
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

## ఖమ్మం

16

ఆదివారం 7 జనవరి 2018

శనివారం గరిష్ఠ ఉష్ణోగ్రత 30 । కనిష్ఠం 14

# చారిత్రక వైభవం

చంద్రుగొండ కనిగిరి గుట్టల్లో రాతిపై చెక్కిన కాకతీయుల కాలం నాటి శిల్పం



- ఇరు జిల్లాల్లో అంతులేని పురాతన కట్టడాలు
- నాటి కాకతీయుల ఘనతను చాటిచెప్పే సజీవ సాక్ష్యాలు ఎన్నో..
- ఆలనాపాలనా లేక శిథిలమవుతున్న చరిత్ర
- అధికారులు పట్టించుకుంటేనే పదిలం

సండే స్పెషల్

ప్రకృతి సోయగాలు. పచ్చని అడవులు.. ఆకాశాన్ని తాకే కొండలు.. అపురూపమైన పురాతన కట్టడాలు.. రాతిని శిలగా మలచిన కళావైభవం. అచ్చెరువొందించే నిర్మాణ కౌశలం. ఇలా చెప్పుకుంటూ పోతే కాకతీయుల పాలన నాటి ఘనతకు దర్పణంగా నిలిచే సజీవ సాక్ష్యాలు ఎన్నెన్నో.. ఇరు జిల్లాలో అంతులేని చారిత్రక సంపద ఉంది. ఆలనాపాలనా లేక కనుమరుగవుతోంది. చరిత్ర కాలగర్భంలో కలిసిపోతుంది. అధికారులు పట్టించుకుంటే పదిలంగా నిలబడుతుంది. భావితరాలకు నాటి ఘన వైభవం తెలుస్తుంది.

- చంద్రుగొండ/కూసుమంచి/భద్రాచలం

సెంటర్‌స్ప్రెడ్‌లో



నాటి చరిత్రకు ఆనవాళ్లు ఈ గుహలు



# ముంచిన ఆరాటం..!

- ఓడీఎఫ్ కోసం మరుగుదొడ్ల నిర్మాణం కాంట్రాక్టర్లకు అప్పగింత
- ఇష్టానుసారంగా పనులు చేసిన గుత్తేదారులు
- నిర్మాణం పూర్తికాకుండానే బిల్లులు డ్రా..
- అసంపూర్తిగా మిగలడంతో లబ్ధిదారుల అవస్థలు

14



అసంపూర్తిగా వదిలేశారంటున్న లబ్ధిదారురాలు జానమ్మ

# మిషన్ భగీరథ
# దేశానికే ఆదర్శం

- సీఎం కేసీఆర్ నమ్మకాన్ని నిలబెడదాం
- ఉగాది కల్లా అన్ని గ్రామాలకూ తాగునీరు
- ఆర్‌అండ్‌బీ మంత్రి తుమ్మల
- సీఎంవో ప్రత్యేక కార్యదర్శి స్మితాసభర్వాల్, మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ ప్రశాంత్‌రెడ్డితో కలిసి పనుల పరిశీలన



తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న భగీరథ వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, పక్కన మంత్రి తుమ్మల తదితరులు



కాంట్రాక్టర్లకు సూచనలిస్తున్న మంత్రి తుమ్మల, ప్రశాంత్‌రెడ్డి

'రాష్ట్ర ప్రభుత్వం మిషన్‌భగీరథ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. దేశానికే ఆదర్శంగా నిలపాలని భావిస్తోంది. గడువులోగా పనులు పూర్తిచేసి సీఎం కేసీఆర్ నమ్మకాన్ని నిలబెట్టాలని' ఆర్‌అండ్‌బీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం, భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలంలో సీఎంవో ప్రత్యేక కార్యదర్శి స్మితాసభర్వాల్, 'భగీరథ' వైస్ చైర్మన్‌తో కలిసి రథంగుట్ట వద్ద చేపడుతున్న మిషన్‌భగీరథ పనులు పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

-ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం/అశ్వాపురం

14

# పడిపోతున్న పత్తిధర



- వారంలో రూ.500 తగ్గుదల
- రైతుల్లో ఆందోళన

6

కోరింది రెగ్యులర్..
# చేసింది రెన్యూవల్

- క్రమబద్ధీకరణ ఊసెత్తని ప్రభుత్వం
- పునరుద్ధరణ ఉత్తర్వులు జారీ
- ఇరు జిల్లాల్లోని సెర్ప్ ఉద్యోగుల్లో అంతర్మథనం

3

S E R P

● అశ్వారావుపేట రూరల్/టౌన్

**తల్లిదండ్రులకు తోడుగా వ్యవసాయ మార్కెట్‌లో కూలికి వెళ్లేవాడతను. గింజలు కాటా వేస్తే రోజుకు రూ.10వరకు వచ్చేవి. రెండేళ్ల పాటు లారీ క్లీనర్‌గా పనిచేశాడు. ఖాకీ చొక్కా ధరించాలనే పట్టుదలతో ముందుకు సాగాడు. లక్ష్యాన్ని చేరుకోవడానికి పేదరికం ఏమాత్రం అడ్డుకాలేదు. అంచెలంచెలుగా ఎదిగి అనుకున్న స్థాయికి చేరుకున్నాడు. అతడే అశ్వారావుపేటకు చెందిన అగ్నిమాపకశాఖ అధికారి దేవనంది శ్రీనివాస్. పేదైనా.. పట్టుదలలో గట్టివాడైన ఈ యువకెరటం గురించి ప్రత్యేక కథనం..**



పెట్రోల్ బంకులో సూచనలు ఇస్తున్న శ్రీనివాస్

**దినసరి కూలీ నుంచి అగ్నిమాపకశాఖ అధికారిగా..**
**పేద కుటుంబమైనా ఉన్నత ఆశయాలు**
**లారీ క్లీనర్‌గా, హోంగార్డుగా విధులు..**
**ఉన్నతాధికారుల నుంచి ఎన్నో అవార్డులు అందుకున్న 'పేట' ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్**

# పట్టుదలే పెట్టుబడి

దేవనంది శ్రీనివాస్‌ది కరీంనగర్ జిల్లా పెద్దపల్లి(ప్రస్తుతం జిల్లా కేంద్రం) గ్రామం. తల్లిదండ్రులు రాజేశ్వరి, ధర్మయ్య.. ముగ్గురు అక్కలు, ముగ్గురు చెల్లెళ్లు, మరో తమ్ముడు ఇలా ఎనిమిది మంది సంతానం. శ్రీనివాస్‌ది కడుపేద కుటుంబం. ఒకపూట తింటే మరోపూట పస్తులే. తల్లిదండ్రులు పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో దినసరి కూలీలుగా పనిచేసేవారు. వారితో పాటే శ్రీనివాస్ గింజలు కాంటా వేసే వద్ద పనిచేసేవారు. జీవనం కోసం చెమటోడుస్తూనే పుస్తకాలను ఓ పట్టు పట్టారు. సంతానం ఎక్కువగా ఉండటంతో అందరూ శ్రమిస్తేగాని కుటుంబం గడిచేది కాదు.

### లారీ క్లీనర్ నుంచి ఫైర్ ఆఫీసర్‌గా

వ్యవసాయ మార్కెట్‌లో రోజువారి కూలీగా పనిచేస్తూనే శ్రీనివాస్ ఇంటర్ వరకు విద్యను పూర్తి చేశారు. పదో తరగతి అనంతరం రెండేళ్లపాటు లారీ క్లీనర్‌గా పనిచేశారు. తండ్రి ధర్మయ్యకు కొడుకులు సర్కారు కొలువు చేయాలనేది కోరికగా ఉండేది. కనీసం బంట్రోతు ఉద్యోగమైనా చేయాలని కొడుకులకు చెప్పేవాడు. దీనికి తోడు ఖాకీ చొక్కాను ధరించాలనేది లక్ష్యం. దానిలో భాగంగానే 1989లో హోంగార్డుగా పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో చేరారు. నాలుగేళ్ల పాటు అనేక ఇబ్బందులను ఎదుర్కోంటూ హోంగార్డుగా పనిచేశారు. హోంగార్డుగా పనిచేస్తూ ఉన్నతాధికారుల జీపు డ్రైవర్‌గా విధులు నిర్వహించేవారు. ఉన్నధికారుల చేత పలుమార్లు ప్రసంశలు అందుకున్నారు. హోంగార్డుగా పనిచేస్తూనే రేషన్ దుకాణాన్ని నిర్వహించేవారు. విధుల పట్ల బాధ్యతను గుర్తించిన ఉన్నతాధికారులు 1993లో అప్పటి ఐపీఎస్ అధికారి రత్నారెడ్డి హోంగార్డు కోటాలో ఫైర్‌మన్‌గా ఎంపికచేశారు. 2000 వరకు ఫైర్‌మన్‌గా పనిచేస్తూనే వాహన డ్రైవర్‌గా ప్రమోషన్ పొందారు. జగిత్యాల, పెద్దపల్లి, మంథని, గోదావరిఖని ప్రాంతాల్లో పనిచేస్తూ 2016లో ఫైర్ ఆఫీసర్‌గా ప్రమోషన్ పొందారు.



ప్రశంసాపత్రం అందుకుంటూ..

**కన్నీళ్లు వస్తుంటాయి..**



ఉద్యోగం చేస్తున్న సమయంలో ఒక్కోసారి నాకుటుంబాన్ని తలచుకుంటే కన్నీళ్లే వస్తుంటాయి. ప్రస్తుతం తల్లిదండ్రులు ఒకస్థాయిలో ఉన్నా ఆనాటి పరిస్థితులు దుర్భరంగా ఉండేవి. ఏదైనా సాధించాలనే నాలక్ష్యం..మానాన్న కోరిక నెరవేరినందుకు ఎంతో సంతోషంగా ఉంది. కష్టపడితే యువత దేన్నైనా సాధించవచ్చు. చేసే పనిని సక్రమంగా చేయటం నాబాధ్యత. ఫైర్ అధికారిగా ప్రజలకు మరింతగా సేవలు అందిస్తా.

**- డి.శ్రీనివాస్, అగ్నిమాపకశాఖ అధికారి, అశ్వారావుపేట**

శ్రీనివాస్ సేవలే పరమావధిగా పనిచేస్తున్నారు. ఎక్కడ పనిచేసినా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల ప్రశంసలందుకుంటున్నారు. నిత్యం అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగించటం, ఎక్కడ ప్రమాదం జరిగినా క్షణాల్లో అక్కడకు వెళ్లి రూ.లక్షల విలువైన సొమ్మును బూడిదపాలు కాకుండా చేయటం శ్రీనివాస్ విధి.

### సాధించిన అవార్డులు

● 1989నుంచి నాలుగేళ్ల పాటు హోంగార్డుగా పనిచేస్తూనే ఉన్నతాధికారుల జీపు డ్రైవర్‌గా పనిచేశారు. విధుల పట్ల బాధ్యతగా ఉండే శ్రీనివాస్ అప్పటి పెద్దపల్లి ఏసీపీ వెంకటేశ్వరరావు, వినయ్‌రంజన్‌రాయ్‌నుంచి పలుమార్లు నగదు పురష్కారాన్ని అందుకున్నారు.

● 1998లో జరిగిన ప్రాణహిత, 2003లో జరిగిన గోదావరి పుష్కరాల్లో అప్పటి కలెక్టర్ సుమిత దావ్ర నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

● 2010-12లో జరిగిన మేడారం సమ్మక్క సారక్క జాతరలో సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు కలెక్టర్ శ్రీధర్‌నుంచి అవార్డును అందుకున్నారు.

● 2011లో మంథని అగ్నిమాపక కేంద్రంలో పనిచేస్తూ జిల్లాస్థాయి ఉద్యోగిగా అవార్డును అందుకున్నారు. గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా అప్పటి కలెక్టర్ జీడీ అరుణ నుంచి అవార్డును అందుకున్నారు.

● 2016 ఆగస్టులో జరిగిన కృష్ణా పుష్కరాల్లో సక్రమంగా విధులు నిర్వర్తించినందుకు నల్లగొండ జిల్లా కలెక్టర్ సత్యనారాయణరెడ్డి నుంచి అవార్డును అందుకున్నారు. ఇలా 25ఏళ్ల సర్వీసులో పలుమార్లు ఉన్నతాధికారులనుంచి అవార్డులు పొందారు.

# వైకల్యాన్ని జయించా

**పెద్దమల్ల శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్, కేయూ**

● ఖమ్మం సంక్షేమవిభాగం



**చిన్నతనంలో పోలియో వచ్చి రెండు కాళ్లు చచ్చుబడ్డాయి. ఇంటినే ప్రపంచంగా తలిచాడు. అమ్మానాన్ననే గురువులుగా భావించాడు. కృషి పట్టుదలతో చదివి మారుమూల పల్లె నుంచి విశ్వవిద్యాలయ స్థాయికి ఎదిగాడు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా దివ్యాంగుల సెల్ డైరెక్టర్‌గా పనిచేస్తూ మన్ననలు పొందుతున్నారు దివ్యాంగుడు పెదమల్ల శ్రీనివాసరావు. 'ఆంధ్రజ్యోతి' పలుకరింపుతో ఎంతో ఆత్మీయంగా మాట్లాడారు. ఆ ముచ్చట మీకోసం...**

**ఇంటి దగ్గరే చదువుకున్నా..**

ఖమ్మం జిల్లా ఎర్రుపాలేం మండలంలోని బనిగండ్లపాడు మా సొంతూరు. అమ్మ లక్ష్మీనర్సమ్మ, నాన్న నాగేశ్వరరావు. ఎనిమిదేళ్ల వయస్సున్నప్పుడు పోలియో మహామ్మారీకి నా రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. అప్పటి నుంచి ఇంట్లోనే ఉన్నా. అమ్మా, నాన్న గురువులుగా చదువుకున్నా. వారు చదువుతో పాటు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చారు.

**డాక్టరేట్ సాధించా..**

సమాజానికి ఏదైనా చేయాలనే తపనతో ఎంఏ న్యాయశాస్త్ర పట్టా పొందాను. 1996- 1998వరకు ఎంఏ, 1998నుంచి2001వరకు ఎల్ఎల్‌బీ పూర్తి చేశా. 'అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ వెల్ఫేర్ ప్రోగ్రామ్స్ ఫర్ ఫిజికల్లీ చాలెంజ్డ్ పర్సన్స్ ఇన్ ఏపీ- ఏ స్టడీ' అనే అంశంపై ప్రభుత్వ పర్యవేక్షణలో 2002నుంచి 2006 వరకు పరిశోధన చేశా. కాకతీయ విశ్వవిద్యాలయం 18వ స్నాతకొత్సవంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ లింగమూర్తి నుంచి డాక్టరేట్‌ను తీసుకున్నా.

**పేద కుటుంబం..**

మాది నిరుపేద కుటుంబం. వైకల్యం ఉన్నా ఏనాడు వెనకడుగు వేయలేదు. వైకల్యం గురించి ఆలోచించలేదు. అమ్మా, నాన్న పూర్తి సహకారంతో ఆర్థిక ఇబ్బందులు అధిగమించా. పట్టుదలను పెంచి రాత్రింబవళ్లు చదివా. నాకు వచ్చిన వైకల్యంపైనే పరిశోధన చేసి డాక్టరేట్‌ను పొందా.

**చాలా అవార్డులొచ్చాయి..**

కేయూ 30వ వ్యవస్థాపక దినోత్సవాన రీసర్చ్ పేపర్స్ అందుకున్నా. విశాఖపట్టణానికి చెందిన అర్వీత సంస్థ 'తెలంగాణ రత్న' అవార్డు ప్రదానం చేసింది.

**దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలి..**

దివ్యాంగులకు రాయితీలు కల్పించాలి. మండల స్థాయిలో దివ్యాంగుల కోసం అధికారిని నియామకం చేయాలి. దివ్యాంగులు వారి వైకల్యం గురించి ఆలోచించకుండా మందుకు సాగాలి.

# సింగరేణిలో సీఎంపీఎఫ్ చెల్లింపుల్లో జాప్యం

**ఇల్లెందుటౌన్,జనవరి6:** సింగరేణి సంస్థలో రిటైరైన కార్మికులకు కోల్‌మైన్స్ ప్రావిడెంట్‌ఫండ్ (సీఎంపీఎఫ్)ను వెంటనే ఇవ్వాల్సి ఉన్నా యాజమాన్యం పెండింగ్‌లో ఉంచుతోంది. సింగరేణి వ్యాప్తంగా నాలుగు నెలలుగా సుమారు 600లోపు కార్మికులు పదవి విరమణ పొందారు. సింగరేణి కార్మికుల జీతాల నుంచి సీఎంపీఎఫ్ పేరుతో రికవరీ చేసిన డబ్బుల వివరాలను ఏటా అకౌంట్ ఇయర్ తరువాత గడిచిన సంవత్సరం వివరాలు, సర్వీస్ యొక్క మొత్తం వివరాలు స్లిప్‌ల ద్వారా, స్టేట్‌మెంట్ ద్వారా తెలియజేసేవారు. ప్రతీ కార్మికుడికి సీఎంపీఎఫ్ పాస్ పుస్తకంలో పూర్తి వివరాలు ఆ పుస్తకంలో కార్మికుడి సంతకం తీసుకునేవారు. 2017 సంవత్సర ఇంకా తెలియజేయకపోవడంతో కార్మికులు ఆందోళనలకు గురవుతున్నారు. పదవీవిరమణ పొందిన కార్మికుడి లీవులు మిగిలివుంటే వాటికి పేమెంట్ చేయాల్సి ఉంది.



**8న సీఎంపీఎఫ్ ఎదుట ధర్నా**
**- ఎం. సారయ్య, సీఐటీయూ**

సీఎంపీఎఫ్ సమస్యల పరిష్కారం కోసం 8న కొత్తగూడెంలో సీఎంపీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నాం. నాలుగు నెలలుగా దిగిపోయిన కార్మికులకు సీఎంపీఎఫ్ ఇవ్వడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

**పట్టించుకోని గుర్తింపు సంఘం**
**కె.సారయ్య, ఏఐటీయూసీ**



నాలుగు నెలలుగా సీఎంపీఎఫ్ సమస్యను గుర్తింపు సంఘం పట్టించుకోవడంలేదు. కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అధికారులు పట్టించుకోకపోయిన గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్ స్పందించడంలేదు.

# లోక కల్యాణార్థం చండీయాగం



లోక కల్యాణం కోసం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం ఆరెగూడెంలోని సీతారామచంద్ర స్వామి, ఆంజనేయ స్వామి దేవాలయాల్లో నిర్వహిస్తున్న శ్రీనవచండీ, నవగ్రహ, నక్షత్ర, మహామృత్యుంజయ రుద్రసహిత మహా శాంతియాగాన్ని భక్తులు శనివారం అధిక సంఖ్యలో తిలకించారు. ఇంగువ రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమైన ఈ క్రతువు సోమవారం వరకు కొనసాగనుంది. **- ఆరెగూడెం(నేలకొండపల్లి)**

# కోరింది రెగ్యులర్.. చేసింది రెన్యూవల్

- క్రమబద్ధీకరణ ఊసెత్తని ప్రభుత్వం
- పునరుద్ధరణ ఉత్తర్వులు జారీ
- ఇరు జిల్లాల్లోని సెర్ప్ ఉద్యోగుల్లో అంతర్మథనం

**ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 6:** తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని ఆందోళన చేపడితే.. రెన్యూవల్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది ప్రభుత్వం! క్రమబద్ధీకరణ ఆశిస్తే.. కొనసాగింపుతోనే సంతృప్తి పడాలని ప్రభుత్వం నిర్ణయించడంతో.. ఉమ్మడి జిల్లాలోని సెర్ప్ ఉద్యోగులు తీవ్ర నిరాశతో అంతర్మథనంలో పడ్డారు. 15 ఏళ్లుగా రాత్రింబవళ్లు పనిచేస్తున్న తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ ప్రధానమైన ఐదు డిమాండ్లతో నెల రోజులపాటు సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) ఉద్యోగులు నిరవధిక నిరసన దీక్షలు చేపట్టారు. ఆందోళన తీవ్ర రూపం దాలుస్తుండడంతో.. రాష్ట్ర పురపాలక గ్రామీణాభివృద్ధి సంస్థ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ కవిత హామీ మేరకు ఉద్యోగులు సమ్మెను విరమించారు. చర్చలు జరిపిన అనంతరం ఎలాగైనా తాము రెగ్యులర్ అవుతామని ఉద్యోగులు ఆశలు పెట్టుకున్నారు. నూతన సంవత్సరంలో రెగ్యులర్ ఉత్తర్వులు వస్తాయని ఆశతో ఎదురు చూసిన ఉద్యోగులు.. శనివారం సెర్ప్ సీఈవో రెన్యూవ్ చేస్తున్నట్టు ఆదేశాలు ఇవ్వడంతో ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారు. మళ్లీ తమ పరిస్థితి ఇబ్బందుల్లోనే పడిందని తీవ్రస్థాయిలో ఆవేదన చెందుతున్నారు.

### ఉమ్మడి జిల్లాలో 369 మంది..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సెర్ప్‌లో 369 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో ఎంఎస్ సీసీలు 77 మంది, ఎల్-1 క్యాడర్ 84, ఎల్-2 క్యాడర్ 139, ఎల్-3 క్యాడర్ 56, ఎల్-4 క్యాడర్10, ఎల్-5 క్యాడర్‌లో ముగ్గురు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2012 నుంచి సెర్ప్‌లో పనిచేస్తున్న తమకు నేటి వరకు రెగ్యులరైజేషన్, ప్రమోషన్లు రావటం లేదని ఉమ్మడి జిల్లాలో సెర్ప్ ఉద్యోగులు నిరసన దీక్షలు చేపట్టారు. అక్టోబర్ 30 నుంచి డిసెంబర్ 2 వరకు ఉధృతంగా ఆందోళన నిర్వహించారు. డిసెంబర్ 2న రాష్ట్ర మంత్రి జూపల్లి నివాసంలో మంత్రితోపాటుగా ఎంపీ కల్వకుట్ల కవిత సెర్ప్ ఉద్యోగ సంఘాలతో జరిగిన చర్చల్లో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో సమ్మె విరమించారు.

### రెన్యూవల్ ఆదేశాలు..

సెర్ప్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను రెన్యూవల్ చేయాలని సెర్ప్ సీఈవో పౌసమిబాబు శనివారం ఆదేశాలు జారీ చేశారు. 2012లో ఇందిర క్రాంతిపథం పేరుతో సెర్ప్ ఉద్యోగుల నియామకం జరిగింది. ప్రతీ ఐదేళ్లకు ఒక సారి సెర్ప్ ఉద్యోగులను రెన్యూవల్ చేయాలని నిబంధనలు ఏర్పాటు చేశారు. పాత నిబంధనల మేరకు 31 డిసెంబర్ 2017తో రెన్యూవల్స్ గడువు ముగిసింది. దీంతో జనవరి ఒకటి 2018 నుంచి 31 డిసెంబర్ 2022 వరకు ఈ ఉద్యోగులను రెన్యూవల్ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. దాంతోపాటుగా.. ఎక్కడైనా ఉద్యోగుల పనితీరు సంతృప్తికరంగా లేకుంటే ఈనెల 15వరకు తమకు నివేదించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

### నేడు శిలాలోలిత, పాటి బండ్ల రజనికి పురస్కారం

**ఖమ్మం అర్బన్, జనవరి 6:** ప్రముఖ అభ్యుదయ, స్త్రీవాద కవయిత్రులు శిలాలోలిత, పాటి బండ్ల రజినిలకు ఆదివారం ఖమ్మంలో రావులపాటి నారాయణ, మాణిక్యం స్మారక పురస్కారాలను అందజేయనున్నారు. జడ్పీ హాల్లో సాయంత్రం 6 గంటలకు జరిగే కార్యక్రమంలో పలువురు సాహితీ వేత్తలు పాల్గొంటారని ప్రదాత రావులపాటి సీతారాం తెలిపారు.



విద్యారంగంపైనా..

## నోట్ల రద్దు, జీఎస్టీ ప్రభావం

- 'ఎఫ్ఆర్‌డీఏ'పై ప్రజల్లో ఆందోళన
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి

**మధిర టౌన్, జనవరి 6:** నోట్ల రద్దు, జీఎస్టీ ప్రభావం విద్యారంగంపై కూడా పడిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క అన్నారు. శనివారం మధిరలో ఠాగూర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర విభజనతో మధిర ప్రాంతం, ఇక్కడున్న విద్యాసంస్థలకు నష్టం వాటిల్లిందని, దానికితోడు నోట్లరద్దు, జీఎస్టీ ప్రభావం పడడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైందన్నారు. ఇక, నూతన ఎఫ్ఆర్‌డీఏ చట్టం గురించి జరుగుతున్న చర్చ ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తోందన్నారు. మధిరలో ఎవరైనా ముందుకొస్తే మెడికల్ కళాశాలకు అనుమతి కోసం కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ యన్నం సుంకిరెడ్డి, యన్నం మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, తెలంగాణ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ మధిర డివిజన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి. భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, సూరంశెట్టి కిషోర్, మిరియాల రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

## 'ప్రభుత్వ పాఠశాలల్లో.. విద్యా ప్రమాణాలు శూన్యం'

**ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 6:** ప్రభుత్వ పాఠశాలల్లో కనీస ప్రమాణాలు కొందరు పాటించడం లేదని విద్యాశాఖ రాష్ట్ర మానిటరింగ్ బృందం సభ్యుడు వెంకటరెడ్డి అన్నారు. ఖమ్మంలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలు, ఎంఈవోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని పాఠశాలల నిర్వాహణ చాలా బాగుందని, మరికొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు కనీసం నోట్‌బుక్స్ కూడా దిద్దడం లేదని, ప్రాజెక్టు వర్క్స్ చేయించడం లేదని అన్నారు. తప్పుడు జవాబులకు కూడా మార్కులు ఇస్తున్నారని అన్నారు. విద్యార్థుల బ్యాగులు 14 కేజీల వరకు ఉన్నాయని, గణితం, ఇంగ్లీష్, తెలుగు సబ్జెక్టుల బోధన పరీక్షా విధానం, తదితర అంశాలపై బృందం తమ అభిప్రాయాలను తెలిపారు. డీఈవో వాసంతి, డీసీఈబీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మల్లిఖార్జున శర్మ పాల్గొన్నారు.







## అబ్దుల్‌నబీని పరామర్శించిన ఎంపీ



**తల్లాడ, జనవరి 6:** తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న షేక్.అబ్దుల్‌నబీని శనివారం ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అబ్దుల్‌నబీ చికిత్స పొందుతుండగా ఎంపీ అక్కడకు వెళ్లి నబీని పరామర్శించారు.

# మూతబడిన ఏటీఎంలు

- బ్యాంకుల్లో నగదు లేదంటున్న అధికారులు
- కమీషన్ వ్యాపారానికి పెరిగిన గిరాకీ
- ఈ లావాదేవీల జాడేదీ?

**సత్తుపల్లి రూరల్, జనవరి 6:** నగదు రద్దు తరువాత బ్యాంకు లావాదేవీలు నిర్వహించాలంటే ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. పాతనోట్ల ఉపసంహరణ అనంతరం కొత్త కరెన్సీ బ్యాంకుల్లోకి వచ్చినప్పటికీ వినియోగదారులకు ఆశించినమేర అందడంలేదు. వారంరోజులుగా సత్తుపల్లిలోని ఏటీఎం సెంటర్లలో నగదులేక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. నూతన సంవత్సరం ప్రారంభం, సంక్రాంతి, క్రిస్మస్ పండుగలు వరుసగా రావడంతో వినియోగదారులు నగదుకోసం బ్యాంకుల్లో బారులు తీరుతున్నారు. బ్యాంకుల్లో విత్‌డ్రాలు పెరగడంతో నగదు లేక అధికారులు సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఏటీఎంలలో నగదు పెట్టేందుకు క్యాష్ లేక రోజుల తరబడి ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. ఏటీఎంలలో తక్కువ నగదు పెడుతుండటంతో గంటలకొద్దీ క్యూలో నిలబడి తీరా వారి వంతు వచ్చేసరికి నో క్యాష్ అని వస్తున్నది. దీంతో ఖాతాదారులు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు.

**కనిపించని నగదు రహిత లావాదేవీలు....**

నగదు ఉపసంహరణ తర్వాత ఈలావాదేవీలు నిర్వహించాలని ప్రభుత్వం అవగాహన కల్పించి వివిధ బ్యాంకుల ద్వారా ఆయావ్యాపారులకు స్వైపింగ్ యంత్రాలను అందించి నగదు విత్‌డ్రాలకు అనుమతులు ఇచ్చింది. నెలలతరబడి ప్రకటనలు చేస్తూ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించినప్పటికీ ఆచరణలో మాత్రం కనిపించడంలేదు. స్వైపింగ్ యంత్రాలను పొందిన వ్యాపారులు ప్రజలకు సేవచేయాల్సిందిపోయి వాటితో వ్యాపారాలు చేస్తున్నారు. నగదు రహిత లావాదేవీలు, బ్యాంకుకు వెళ్లకుండా ఏటీఎం కార్డుల ద్వారా నగదును పొందేందుకు బ్యాంకర్లు అవకాశాలు కల్పించినప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోలేదు.

ఈమిషన్లను ఉపయోగించుకుని ఎవరికివారు వ్యాపారం చేస్తున్నారే తప్ప సామాన్యుడికి నగదు విత్‌డ్రా చేసి ఇచ్చినట్టుగా కనిపించడంలేదు.



మూసేసిన ఏటీఎంలు, ఏటీఎం సెంటర్ వద్ద బారులు తీరిన జనం,

**జోరందుకున్న కమీషన్ వ్యాపారం...**

ఏటీఎంలలో నగదు కొరత ఉండడంతో కొందరు వ్యాపారులు దీనిని అదనుగా భావించి కమీషన్ వ్యాపారానికి తెరలేపారు. ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లు చేయడానికి మూడు శాతం నుంచి ఐదు శాతం వరకు కమీషన్లు వసూలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే షాపుల యజమానులు వినియోగదారుడి అవసరాన్ని బట్టి రూ.1000కి రూ.30నుంచి రూ.50వరకు కమీషన్లు వసూలు చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో నగదు అవసరం ఉన్నవారు వారిని ఆశ్రయించక తప్పడంలేదు. రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు ఈట్రాన్సాక్షన్లు, విత్‌డ్రాలలో ఎక్కువ మొత్తంలో కమీషన్లు తీసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది.

## వేంకటేశ్వరస్వామి కల్యాణం

**వేంసూరు, జనవరి 6:** వేంసూరు మండలం రాయిడుపాలెం గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి శనివారం ఆలయంలో వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త దుగ్గిరాల అశోక్ తెలిపారు. ఈ కళ్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ విద్యను పరిరక్షించాలి

**తల్లాడ, జనవరి 6:** ప్రభుత్వ విద్యను పరిరక్షించటంలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని తల్లాడ ఎంఈవో ఎన్.దామోదర్ ప్రసాద్ కోరారు. శనివారం తల్లాడలో పీఆర్టీయూ క్యాలెండర్, డైరీలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర నాయకుడు వి.జగన్నాథరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దగ్గుల కమలాకర్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్.చాంద్‌సాహెబ్, ఏడుకొండలు, కోటేశ్వరశర్మ, భాస్కర్, సరోజిని, రఫిక్‌పాషా, దయాకర్ పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

**సత్తుపల్లి రూరల్, జనవరి 6:** నియోజకవర్గంలోని సత్తుపల్లి, వేంసూరు మండలాలకు చెందిన ఐదుగురు లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం అందజేసారు. ఈసందర్భంగా క్యాంపు కార్యాలయంలో సండ్ర మాట్లాడుతూ రెండు మండలాల నుంచి ఐదుగురు అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తులు చేసుకోగా వారికి రూ.1.40 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. లబ్ధిదారుల కుటుంబసభ్యులకు చెక్కులను అందచేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు గొర్ల సంజీవరెడ్డి, భూపాల్‌రెడ్డి, కూసంపూడి మహేష్, దొడ్డా శంకర్‌రావు, ప్రసాద్; చాంద్‌పాషాలు పాల్గొన్నారు.



:చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే సండ్ర

## పెన్షనర్లకు బయోమెట్రిక్ పద్ధతి అమలు

**సత్తుపల్లి, జనవరి 6:** మార్చి నుంచి ప్రభుత్వ పెన్షనర్లకు నూతన విధానంద్వారా పెన్షన్ ఇవ్వనున్నట్టు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ.రాఘవులు అన్నారు. శనివారం సత్తుపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చినుంచి బయోమెట్రిక్ విధానంద్వారా పెన్షన్ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరులోపు ప్రభుత్వ పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు గతంలో సమర్పించినవిధంగా మీ సేవాకేంద్రాల్లో ఆధార్, పెన్షన్ పేమెంట్ ఆర్డరు తీసుకుని బయోమెట్రిక్‌లో వేలిముద్రలు నమోదు చేయించుకోవాలని సూచించారు. పత్రాలను సబ్ ట్రెజరీ అధికారికి అందచేయాలని సూచించారు.

## కేసీఆర్ హయాంలో తెలంగాణకు వెలుగులు

- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ రవి

**తల్లాడ, జనవరి 6:** ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి ఫలితంగా తెలంగాణ విద్యుత్ వెలుగులను సంతరించుకుందని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. శనివారం స్థానిక టీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పాలకుల హయాంలో తెలంగాణ అంధకారంలో ఉండేదని, స్వరాష్ట్ర లక్ష్యసాధనతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని విద్యుత్ వెలుగులమయంగా మార్చారన్నారు.. జనవరి ఒకటోతేదీ నుంచి వ్యవసాయానికి 24గంటలు విద్యుత్ సరఫరా చేస్తూ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ అనేక పథకాలకు రూపకల్పన చేశారని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యరమల వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ పోట్రు శరత్‌బాబు, టీఆర్ఎస్ మండల నాయకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ), శీలం కోటారెడ్డి, సరికొండ వీరంరాజు, కోడూరు వీరకృష్ణ, రాము, మల్లిఖార్జున్‌రావు, లాజర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి

## నేడు ఖమ్మంలో పద్మశాలి ఉద్యోగుల సంఘం వార్షికోత్సవ సభ

**తల్లాడ, జనవరి 6:** పద్మశాలి ఉద్యోగుల సంఘం ఐదోవార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఖమ్మంలోని ఐఎంఏ హాల్‌లో వార్షికోత్సవసభ నిర్వహించనున్నట్టు పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రచ్చ శ్రీనివాస్, పిల్లలమర్రి కొండలరావు తెలిపారు. శనివారం తల్లాడలో ప్రచారపత్రాలను ఆవిష్కరించారు. పద్మశాలి ఉద్యోగుల సంఘం ఏర్పడి ఐదుసంవత్సరాలు పూర్తయిందని, ఐదేళ్లలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వారు తెలిపారు. పేదవిద్యార్థుల విద్యాభివృద్ధికి ఆర్థికసాయం అందజేసినట్లు వారు వివరించారు. వార్షికోత్సవ సభకు ముఖ్యఅతిథులుగా బొమ్మా రాజేశ్వరరావు, కమర్తపు మురళీ, జల్లా లక్ష్మీనారాయణ, ఉదారి పద్మ, వనం లక్ష్మణ్‌రావు, గాజ నాగేశ్వరరావు హాజరుకానున్నట్టు తెలిపారు.



ప్రచారపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం



**సినిమాలు**

**సత్తుపల్లి**

| | |
|---|---|
| • శ్రీనివాస | టూ కంట్రీస్ |
| • శ్రీబాలాజీ | హలో |
| • సాయి బాలాజీ | ఎంసీఏ |
| • శ్రీకృష్ణ | చిలుకూరి బాలాజీ |

## సర్వసభ్య సమావేశానికి

# అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం

**కల్లూరు, జనవరి 6:** మండలపరిషత్ సర్వసభ్య సమావేశానికి పలు శాఖలకు సంబంధించిన అధికారులు హాజరుకాకుండా వారిస్థానంలో కిందిస్థాయి ఉద్యోగులు హాజరుకావడం పట్ల మండలపరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలపరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశానికి ఎంపీపీ వలసాల జయలక్ష్మి అధ్యక్షత వహించారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరుతూ తీర్మానించారు. కల్లూరులోని రాష్ట్రీయ రహదారిపై కప్పలబంధం రహదారి బస్టాప్ వద్ద సత్తుపల్లి డిపోకు చెందిన బస్సులు ఆపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురి అవుతున్నారని ఎంపీపీ వలసాల జయలక్ష్మి సమావేశంలో ప్రస్తావించారు. ఆర్టీసీ సంస్థ ప్రతినిధి వివరణనిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. కల్లూరు మండలంలోని ఎర్రబోయినపల్లి, బత్తులపల్లి, లింగాల, పాయకూరు తదితర గ్రామాల్లో రెండు సంవత్సరాలక్రితం ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించుకున్న మరుగుదొడ్లకు బిల్లులు లబ్దిదారులకు అందకపోవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేశారు. పాయపూర్, లింగాల, ఎర్రబోయినపల్లి గ్రామాల్లో బీటీ రహదారులపై పుల్‌వీల్స్ ట్రాక్టర్లు అడ్డదిడ్డంగా నడపడంతో రహదారులు ధ్వంసమవుతున్నాయని, ట్రాక్టర్ల యజమానులపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యులు కృష్ణ, పోట్రు శ్రీను, నాగేశ్వరరావు కోరారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు జర్పుల లీలావతి, మండలపరిషత్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి ఇందిర, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి అస్రా అంజుమ్, ఎంఈవో కె.రంగారావు, ఏవో రూప, ఐకేపీ ఏపీఎం కల్పన, పశుసంవర్ధక శాఖ అధికారి రాధాకృష్ణ, సర్పంచులు జక్కంపూడి రమాదేవి, భరోతు సుజాత, పాలెపు లక్ష్మీకాంతమ్మ, భరోతు సుజాత తదితరులు పాల్గొన్నారు.





కల్లూరు మండలపరిషత్ సర్వసభ్య సమావేశం దృశ్యం

# ఓడీఎఫ్ మండలంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలి

● ఎంపీపీ సరికొండ లక్ష్మీపద్మావతి

**తల్లాడ, జనవరి 6:** తల్లాడ మండలాన్ని బహిరంగ మలవిసర్జన రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషిచేయాలని తల్లాడ ఎంపీపీ సరికొండ లక్ష్మీపద్మావతి కోరారు. శనివారం స్థానిక మండలప్రజాపరిషత్ కార్యాలయంలో తన అధ్యక్షతన జరిగిన మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ 15వతేదీ నాటికి మండలంలోని వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని కోరారు. ఇందుకోసం ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులకు, ఉద్యోగులకు సహకరించాలన్నారు. ఇటీవల ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ఎ.శ్రీనివాసరెడ్డి సభకు పరిచయమయ్యారు. ఈసందర్భంగా ఎంపీ డీవో మాట్లాడుతూ నూరుశాతం వ్యక్తిగత మరుగుదొడ్ల లక్ష్యసాధనకు కృషిచేయాల న్నారు. ఈసమావేశంలో మండలపరిషత్ ఉపాధ్యక్షుడు కొమ్మినేని వెంకటనారాయణ, ఈవోఆర్డీ సుందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శీలం చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీవో కోటయ్య, ఎన్నెస్పీ, ఆర్‌డబ్ల్యూఎస్, మండలపరిషత్ ఇంజనీర్లు రాంబాబు, బాబు, అశోక్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎంపీపీ పద్మావతి

## ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా లీగల్‌సెల్ అథారిటీ చైర్మన్ వినోద్‌కుమార్

**బోనకల్, జనవరి 6:** ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్‌సెల్ అథారిటీ చైర్మన్ కె.వినోద్‌కుమార్ సూచించారు.స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఏడునూతల శ్రీనివాసరావు, ఎస్‌ఐ ఇంద్రసేనారెడ్డి, ప్రిన్సిపాల్ రవి బాబు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

## నివేదికను వెనక్కుతీసుకోవాలి: ఎస్‌ఎఫ్‌ఐ

**సత్తుపల్లి, జనవరి 6:** ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసే విధంగా ఉన్న తిరుపతిరావు కమిటీ నివేదికను వెనుక్కితీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పాకలపాటి గోవర్ధన్ అన్నారు. ఆయన శనివారం పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎస్‌ఎఫ్‌ఐ మండల మహాసభలో ప్రసంగించారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రేమ్‌కుమార్, ఎమ్.శివ, మండలాధ్యక్షుడు సత్యప్రవీణ్, నాగేంద్ర, పవన్‌కుమార్, మనోహర్, సాంబశివరావు, త్రివేణి, కుసుమ, శ్రీవాణి, మీరాలు పాల్గొన్నారు.

## రైతులకు పరిహారం చెల్లించాలి

**తల్లాడ, జనవరి 6:** ఈఏడాది సాగుచేసిన పత్తి పంటకు గులాబిరంగు పురుగు వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని, నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి పాశం అప్పారావు డిమాండ్ చేశారు. శనివారం తల్లాడ తహసీల్దార్ జి.శిరీషకు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో 2.70లక్షల ఎకరాల్లో పత్తి సాగుచేశారని, అధిక దిగుబడి సాధించవచ్చునని ఆశించిన రైతులకు గులాబీరంగు పురుగువల్ల తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. 11న జరిగే ప్రదర్శన, ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి షేక్.లాల్ మియా, దేవా, రాఘవులు, వీరభద్రం పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రదర్శన

**కల్లూరు, జనవరి 6:** కల్లూరు మండలంలోని చెన్నూరు గ్రామంలో ఎన్‌ఎన్‌ఎస్ శీతాకాల ప్రత్యేక శిబిరంలో భాగంగా శనివారం పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కుటుంబాక శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్‌కె.అతహర్ అలీ, అధ్యాపకులు జీనుగు అనిల్, భుక్యా రామునాయక్ పాల్గొన్నారు.

## వేదగణిత శిక్షణ తరగతులు

**సత్తుపల్లి రూరల్, జనవరి 6:** అత్యంత సులువుగా గణితం ఎలా నేర్చుకోవాలనే అంశంపై విద్యార్థులకు ఆశా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వేదగణిత శిక్షణ తరగతులను నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆశా స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకులు, జిల్లా దిశా కమిటీ సభ్యుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ మాట్లాడారు. అనంతరం దమ్మపేట మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాజులపాటి రామారావు విద్యార్థులకు గణిత శాస్త్రంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న దయానంద్

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: లక్కినేని

**కల్లూరు, జనవరి 6:** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాలనసాగిస్తోందని కల్లూరు మండల రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు పేర్కొన్నారు. మండలంలోని చిన కోరుకొండి గ్రామంలో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో చినకోరుకొండి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, గ్రామ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, సర్పంచి భాగ్యలక్ష్మి, ఏఈవోలు నరేష్, హుస్సేన్ పాల్గొన్నారు.



సమావేశం మాట్లాడుతున్న లక్కినేని

## మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

**సత్తుపల్లి రూరల్, జనవరి 6:** సత్తుపల్లి పట్టణంలో శనివారం మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై డీటీ శ్రీరాములు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో వెంకటేశ్వర్లు అనే వ్యక్తి అక్రమంగా మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినట్టు సమాచారం అందడంతో అక్కడికి చేరుకుని బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందుతుడు వెంకటేశ్వర్లుపై 6-ఎ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

# రైతు బాంధవుడు కేసీఆర్

రైతుసమన్వయసమితి మండల కన్వీనర్ పోట్ల

**ముదిగొండ, జనవరి 6:** కేసీఆర్ రైతుబాంధవుడని రైతుసమన్వయసమితి మండల కన్వీనర్ పోట్ల వెంకటప్రసాద్ అన్నారు. శనివారం ముదిగొండలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుసంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీటవేశారని, రైతులకోసం దేశంలో ఎక్కడాలేనివిధంగా 24గంటల ఉచిత కరెంట్ ఇవ్వటం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు ఏలూరి హన్మంతరావు, పాపినేని వెంకటేశ్వర్లు, గడ్డం అంజయ్‌గౌడ్, సెల్వరాజ్, శరత్, పుల్లయ్య, అమరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోట్ల వెంకటప్రసాద్

# వైరాలో ఎంపీ పొంగులేటి పర్యటన

**వైరా, జనవరి 6:** వైరా మండలంలో శనివారం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. గొల్లెనపాడులో వెంపటి వెంకట్రావమ్మ దశదినకర్మలో పాల్గొన్నారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కుమారుడు వెంపటి కృష్ణ ఇతర కుటుంబసభ్యులను పరామర్శించారు. అష్ణగుర్తి గ్రామంలో తాము చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు గురించి ఆర్ట్ ఆఫ్‌లివింగ్ సంస్థ వారు ఎంపీకి వివరించారు. వారిని పొంగులేటి అభినందించారు. టీఆర్‌ఎస్ నాయకులు బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, శ్రీరామనేని తిరుపతిరావు, మిట్టపల్లి నాగి, కమతం కృష్ణయ్య, వెంపటి రాధాకృష్ణ, వెంకట్రావు, ఇటుకల మురళీ, ముత్తారపు డేవిడ్, అశోక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ పొంగులేటి

## రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం: గిరిబాబు

**ఏన్కూరు, జనవరి 6:** రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయమని కాంగ్రెస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకులు లకావత్ గిరి బాబు అన్నారు. శనివారం ఏన్కూరులో కాంగ్రెస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు స్వర్ణ నరేందర్, ఆనంద్ ప్రసాద్, భూక్యా లాలు, వాసిరెడ్డి సత్యనారాయణ, బాణోతు నర్సింహారావు, రాజు, సైదులు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## రాయని పరీక్షకు ర్యాంకులు ఎలా?: కూసంపూడి

**సత్తుపల్లి రూరల్, జనవరి 6:** రాయని పరీక్షకు ర్యాంకులు ఎలా వస్తాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూసంపూడి రవీంద్ర అన్నారు. శనివారం సత్తుపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి నగరపంచాయతీ అధికారులు, పాలకవర్గం తీరు హాస్యాస్పదంగా ఉందని, చేయని పనులనుకూడా చేసినట్టుగా చూపిస్తున్నారన్నారు. ఈసమావేశంలో బీజేపీ నాయకులు వీరంరాజు పాల్గొన్నారు.

## ఫొటో, వీడియోగ్రాఫర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా 'వేముల'

**సత్తుపల్లి, జనవరి 6:** తెలంగాణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెనుబల్లికి చెందిన ఖమ్మం జిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అధ్యక్షుడు వేముల నరసింహారావు ఎన్నికయ్యారు. ఇటీవల కరీంనగర్ పట్టణంలో జరిగిన తెలంగాణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమసంఘం రాష్ట్ర సమావేశంలో జరిగిన నూతన కమిటీ ఎన్నికలో నరసింహారావును రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. నరసింహారావు రాష్ట్రకమిటీకి ఎన్నికవడం పట్ల సంఘం నాయకులు హర్షం వ్యక్తంచేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో జిల్లా ఫొటో గ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం సభ్యులు వత్సవాయి కనకాచారి, వేముల రవికుమార్, మండల కమిటీ అధ్యక్షుడు జిల్లెల్ల ప్రసాద్, కార్యదర్శి ఈశ్వరాచారి, కోశాధికారి కనకాల మధుసూదనరావు, మాజీ మండలాధ్యక్షుడు గోదా శ్రీనివాసరావు, మల్లెల్లి రాం బాబు, వేముల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



నరసింహారావు

# వచ్చే ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలి

● రైతులకు రూ.4వేల స్కీం ఎన్నికల తాయిలమే, తనికెళ్ల మహాసభలో కూనంనేని

**కొణిజర్ల, జనవరి 6:** అమలుకాని వాగ్దానాలు చేసి ప్రజలను విస్మరించిన టీఆర్ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి భాగం హేమంతరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని తనికెళ్లలో జరిగిన సీపీఐ గ్రామశాఖ మహాసభలో పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను అమలుచేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రనాయకులు టీవీ చౌదరి, గడల సీతారామయ్య, నాయకులు అడపా రామకోటయ్య, పీవీరావు, దొండపాటి రమేష్, లాల్‌సింగ్, మంగపతి, పెదమళ్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.



అంజయ్య, నరేందర్



పార్టీ జెండా విష్కరణ చేస్తున్న భాగం

**నూతన కమిటీ ఎన్నిక :** ఈ మహాసభలో నూతన కమిటిని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా మంచికంటి అంజయ్యను, సహాయ కార్యదర్శిగా గడల నరేంద్రనాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# సామాజిక తెలంగాణానే టీమాస్ లక్ష్యం

● టీమాస్ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు బత్తుల లెనిన్

**సత్తుపల్లి, జనవరి 6:** ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటానికి, ప్రజాసమస్యల పరిష్కారానికి టీమాస్ గొప్ప వేదికని టీమాస్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు బత్తుల లెనిన్ అన్నారు. పెనుబల్లి మండల సీపీఎం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెనుబల్లి మండలంలో ప్రజా సమస్యల పరిశీలనకు మూడుదళాలు 22 గ్రామ పంచాయతీల్లో సర్వేచేసి గ్రామ కమిటీలువేసి పోరాటాలకు రూపకల్పన చేశామన్నారు. కొత్త కారాయిగూడెం గ్రామంలో రోడ్డు సక్రమంగా లేదని, ఎస్సీ కాలనీలో తాగునీటి బోర్లు చెడిపోతే వాటి గురించి పట్టించుకునే వారే లేరన్నారు. తాళ్లపెంట గ్రామంలో పేద గిరిజనులకు, గొత్తి కోయలు ఎంతో కాలంగా నివాసం ఉంటున్నా గుర్తింపు కార్డులు లేవన్నారు. గౌరారం ఎస్సీ కాలనీలో ఇళ్ల సమస్యలు ఉన్నాయన్నారు. అలాగే పేదలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలన్నారు. ఈ సమస్యలు సర్వే పూర్తైన తర్వాత 16 నుంచి 19 తేదీల్లో వాటి పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్షలు చేస్తామని, అప్పటికీ అధికారులు స్పందించకుంటే 22న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీమాస్ మండల నాయకులు చలమాల విఠల్‌రావు, మామిళ్ల వెంకటేశ్వర్లు, కె.దేవమందిరం, రాజేశ్వరరావు, పోట్రు రాజారావు, విశ్వనాథం, నాగేశ్వరరావు, కుంజా రాములు, రాజినేని మంగమ్మ, మల్లయ్య, ప్రేమ్‌కుమార్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బత్తుల లెనిన్

# చావే సమస్యకు పరిష్కారం కాదు

**ఆత్మస్థైర్యంతో జీవించాలి**

**సీపీ తఫ్సీర్‌ఇక్బాల్**



మాట్లాడుతున్న సీపీ తఫ్సీర్ ఇక్బాల్



హాజరైన విద్యార్థులు

**తిరుమలాయపాలెం జనవరి 6:** చావే సమస్యకు పరిష్కారం కాదని, ఆత్మస్థైర్యంతో జీవించాలని ఖమ్మం సీపీ తఫ్సీర్ ఇక్బాల్ తెలిపారు. శనివారం తిరుమలాయపాలెంలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతు మనిషి వివేకంతో చిన్న చిన్న విషయాలకు విచక్షణ కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయంతో తన కుటుంబానికి అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భార్యభర్తల మధ్య ఘర్షణలు, పరీక్షలు సక్రమంగా రాయలేదని, ప్రేమ విఫలమైందని ఆత్మహత్యలకు పాల్పడు తున్నారని ఇది సరైందికాదన్నారు. ప్రతిసమస్యకు పరిష్కారం ఉంటుందని ఆదిశగా ఆలోచించాలని సూచించారు. మానసిక వైద్యనిపుణులు సీఎస్ బాలచంద్రసుంకు, డాక్టర్ ఆర్.సతీష్‌బాబు మాట్లాడుతూ సమస్యలు ఎదురైనప్పుడు క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇది సరైంది కాదన్నారు. సమాజంలో 24శాతం కుటుంబ కలహాల కారణంగా 22శాతం ఆరోగ్యసమస్యలతో, ప్రేమవిఫలమై 2.8శాతం ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వివరించారు. సినిమాలు, టీవీసీరియళ్ల ఆత్మహత్య లకు ప్రేరేపించే దృశ్యాలకు ఆకర్షితు లవుతున్నారని తెలిపారు. ఈసందర్భంగా ఆత్మహత్యలు నివారిద్దాం అంటూ అదరితో ప్రతిజ్ఞ చేయించారు. పోలీసు జనజాగృతి కళాకారుల బృందంచే నిర్వహించిన కళాజాత ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో రూరల్‌ఏసీపీ పింగళినరేష్‌రెడ్డి, రూరల్ సీఐ తిరుపతిరెడ్డి, తిరుమలాయపాలెం ఎస్ఐ పంజాల సర్వయ్య, ఏఎస్ఐ వెంకటాచారి పాల్గొన్నారు.

# పడిపోతున్న పత్తిధర

**వారంలో రూ.500 తగ్గుదల**

**రైతుల్లో ఆందోళన**

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - ఖమ్మం)

మొన్నటివరకు పరుగులు తీసిన పత్తిధర ఇప్పుడు క్రమంగా పడిపోతోంది. దీంతో పత్తి రైతాంగంలో ఆందోళన వ్యక్తమవుతోంది. సీజన్ ముగిసే తరుణంలో ధర మరింత పెరుగుతుందని ఆశపడుతున్న తెల్లబంగారం రైతులు ప్రస్తుత మార్కెట్ పరిస్థితి చూసి తెల్లబోతున్నారు. వాస్తవానికి కొత్త సంవత్సరంలో పత్తిధర మరింత పైపైకి పోతుందని, క్వింటా రూ.6వేల వరకు పలుకుతుందని భావించారు. అయితే ప్రస్తుతం పత్తిధర క్వింటాకు రూ.5వేల నుంచి రూ.5,100 నడుస్తోంది. రూ.5,400కుపైగా పలికిన పత్తిధర గడిచిన పదిరోజులుగా తగ్గుతూ వస్తోంది. క్వింటాకు రూ.500ధర తగ్గడంతో పత్తిరైతులు నష్టపోతున్నారు. చైనా తదితర దేశాలకు ఎగుమతి ఆర్డర్లు లేకపోవడం, పత్తి విత్తనాలు కొనే కంపెనీలు కూడా ఉత్సాహంగా లేకపోవడంతో పత్తి ధర పతనానికి కారణమని వ్యాపారవర్గాలు పేర్కొంటున్నాయి. సంక్రాంతి తర్వాత స్వల్పంగా పెరగడమా? లేక తగ్గడమా అన్నది స్పష్టమవుతుందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. రైతులు మాత్రంధర పెరుగుతుందన్న ఆశతో ఇంటివద్దే నిల్వ ఉంచుకున్నారు. ప్రస్తుతం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రోజుకు ఐదువేల బస్తాల వరకు వస్తున్నాయి. ఏన్కూరు మార్కెట్‌తోపాటు భద్రాద్రి, కొత్తగూడెం జిల్లాలోని జూలురుపాడు తదితర చోట్ల ప్రైవేటు వ్యాపారులు కొనుగోళ్లు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 10లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు జరగ్గా, భద్రాద్రి కొత్తగూడెంలో కూడా సుమారు 6లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు జరిగింది. మరో రెండులక్షల క్వింటాళ్ల వరకు ఖమ్మంలో, రెండులక్షల క్వింటాళ్ల భద్రాద్రి కొత్తగూడెంలో మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం పత్తి ముగింపు సీజన్ కావడంతో పత్తి తీయడానికి రైతులు అధికంగానే ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఈ పరిస్థితిలో తగ్గుతున్న ధర రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

## 'కిమ్స్'లో కిడ్నీ క్యాన్సర్ బాధితురాలికి అరుదైన చికిత్స



మాట్లాడుతున్న వైద్యులు గంగరాజు, అశోక్..

**ఖమ్మం టౌన్, జనవరి 6:** కిడ్నీకి క్యాన్సర్ వ్యాధి భారిన పడిన ఒక మహిళకు ఖమ్మం నగరంలోని కిమ్స్ ఆసుపత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. తొలిసారిగా కిడ్నీ క్యాన్సర్‌కు విజయవంతంగాశస్త్రచికిత్స నిర్వహించినట్లు కిమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జి.గంగరాజు, యురాలజిస్ట్ డాక్టర్ అశోక్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైద్యులు గంగరాజు, అశోక్‌లు వివరాలు తెలిపారు. కామేపల్లి మండలం సీరోలుకు చెందిన బి.క్రాంతి అనే 55 ఏళ్ల మహిళ కొంతకాలంగా మూత్ర సంబంధ వ్యాధితో బాధపడుతోందని, ఇటీవల తీవ్రనొప్పితో పాటు మూత్రం ద్వారా రక్తం పోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు నాలుగు రోజుల కిమ్స్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆమెకు పరీక్షలు నిర్వహించిన యురాలజిస్ట్ డాక్టర్ అశోక్ కిడ్నీకి క్యాన్సర్ సోకినట్లు గుర్తించారు. దీంతో తప్పనిసరిగా కిడ్నీ తొలగించాలని రోగి కుటుంబసభ్యులకు తెలిపారు. వైద్యులు అనిల్, రవి, మదన్‌మోహన్‌రెడ్డి శనివారం నాలుగు గంటలపాటు శ్రమించి క్యాన్సర్ సోకిన కిడ్నీని తొలగించారు. మహిళ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. సమావేశంలో డాక్టర్ పవన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# తల్లిదండ్రులను గెంటేశాడు..

**పోలీసులను ఆశ్రయించిన వృద్ధ దంపతులు**



పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వృద్ధ దంపతులు

**దమ్మపేట, జనవరి 6:** వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను గెంటేసి, ఇంటికి తాళం వేశాడో కొడుకు. ఈ సంఘటన దమ్మపేట మండలం, మల్కారం గ్రామంలో శనివారం జరిగింది. బంధువులు, పెద్దమనుషులు ఆ కుమారుడితో మాట్లాడినా ఫలితం లేకపోయింది. దీంతో ఆ తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. అంకత నాగయ్య, గంగమ్మలకు ఇద్దరు కుమారులు బ్రహ్మయ్య, వెంకటేశ్వరరావు, కుమార్తెలు సరోజినీ, కుమారి ఉన్నారు. వీరందరికి వివాహాలు జరిపించారు. కుమారులిద్దరికీ ఇరవై ఏళ్ల క్రితమే భారీగా భూమిని పంచిపెట్టాడు. తనకు, భార్య, వితంతువైన కుమార్తె పోషణకు 11 ఎకరాలు ఉంచుకున్నాడు. తన ఇంట్లో రెండు గదుల్లో నాగయ్య కుటుంబం, మరో రెండు గదుల్లో వెంకటేశ్వరరావు కుటుంబంతో నివసిస్తున్నాడు. తనకు ఆసరాగా ఉంటాడని నమ్మి చిన్నకుమారుడైన వెంకటేశ్వరరావుకు తన 11 ఎకరాలు వీలునామా రాశాడు. ఈ భూములు కాకుండా గంగమ్మ పుట్టింటి నుంచి తెచ్చుకున్న రెండు ఎకరాలను స్వంత ఖర్చులకోసం అమ్ముకుంది. నాటి నుంచివీలునామా అమలు పర్చాలని తండ్రిపై గొడవలు ప్రారంభించాడు. వెంకటేశ్వరరావు. గొడవలతో తనను చూస్తాడన్న నమ్మకం కోల్పోయిన నాగయ్య వీలునామా రద్దు చేసుకున్నాడు. ఇటీవల అశ్వారావుపేట మండలం, వినాయకపురంలోని కుమార్తె సరోజిని ఇంటికి వెళ్లి ఆరునెలలుగా ఉంటున్నాడు. సంక్రాంతికి సొంత ఇంటిలో గడుపుకుందామని శనివారం భార్యకుమార్తెతో వచ్చాడు. ఈ సమయంలో ఇంటికి తాళం వేసుకుని వెంకటేశ్వరరావు వెళ్లిపోయాడు. సమస్య పరిష్కారానికి బంధువులు, గ్రామపెద్దలు చర్చలకు వెంకటేశ్వరరావు స్పందించకపోవడంతో, గత్యంతరం లేక నాగయ్య పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు.

# జీవో-58ను రద్దు చేయాలి

**ఖమ్మంలో వ్యాపారుల సమవేశం**

**మద్దతు తెలిపిన రాజకీయ పక్షాలు**

**ఖమ్మం గాంధీచౌక్, జనవరి 6:** రాష్ట్రప్రభుత్వం ఇటీవల విడుదలచేసిన జీవో 58ని వెంటనే రద్దుచేయాలని ఖమ్మం చాంబర్ఆఫ్ కామర్స్ నాయకులు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో శనివారం ఖమ్మం వ్యాపారవర్గం సమావేశం నిర్వహించింది. శనివారం ఉదయం నగరంలోని త్రీటౌన్ పరిధిలో గల ఓ కోల్డ్‌స్టోరేజీ నిర్వహించిన ఈ సమావేశానికి పలు రాజకీయ పార్టీల నాయకులు మద్దతు తెలిపి సమావేశంలో పాల్గొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన చాంబర్ నాయకుడు తూములూరి లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ జీవో 58 వల్ల రాష్ట్రంలోని మార్కెట్లలోని కమీషన్, ఖరీదు వ్యాపారులకు నష్టం వస్తోందన్నారు. జీవో రద్దుకు భవిష్యత్తులో ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని విన్నవించుకుంటామన్నారు. కార్యక్రమంలో వ్యాపారవర్గ నాయకులతో పాటు టీడీపీ, వైసీపీ, సీపీఎం, కాంగ్రెస్ తదితర పార్టీల నాయకులు కూరపాటి వెంకటేశ్వరరావు, లక్కినేని సుధీర్‌కుమార్, యర్రా శ్రీకాంత్, కల్యాకుంట్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తూములూరి లక్ష్మీనర్సింహారావు

## వేర్వేరు ప్రమాదాల్లో

# ఇద్దరి మృతి

**దుమ్ముగూడెం జనవరి 6:** దుమ్ముగూడెం మండలంలోని కోయనరసాపురం సమీపంలో శనివారం రాత్రి జరిగిన ట్రాక్టరు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ట్రాక్టరు లక్ష్మీనగరానికి చెందిన సంత వ్యాపారి శ్రీనివాసరెడ్డిదిగా సమాచారం. మల్లంపేట నుంచి ధాన్యం తెచ్చే క్రమంలో ప్రమాదం జరిగింది. ఈఘటనలో పెదనల్లబల్లికి చెందిన డ్రైవరు పాయం నాగరాజుకు కాళ్లు విరగ్గా, ఏపీలోని చింతూరు మండలం అల్లిగూడేనికి చెందిన హెల్పరు పూర్తి మృతి చెందాడు. ఐతే ప్రమాదం తీరుపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

**రోడ్డు ప్రమాదంలో మరొకరు..**

మండల సరిహద్దు ఛత్తీస్‌గఢ్ మారాయిగూడేనికి చెందిన సోడి రాంబాబు (35) రోడ్డుప్రమాదంలో మృతి చెందాడు. శుక్రవారం సీజీ మారాయిగూడెం పాఠశాల సమీప ప్రధాన రహదారిపై నడిచి వెళతున్నాడు. ఈక్రమంలో సోదరుడి వరుసయ్యే ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళుతున్నాడున్నాడు. అదుపుతప్పి అతడిని బలంగా ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన రాంబాబును వైద్యం నిమిత్తం భద్రాచలం తరలిస్తున్నారు. మార్గమధ్యలో మృతి చెందాడు.

# సీఆర్‌పీఎఫ్ బలగాల కోసం కాపుకాచిన మావోయిస్టులు

**త్రుటిలో తప్పిన భారీ ప్రమాదం**

**దుమ్ముగూడెం జనవరి6:** దుమ్ముగూడెం మండల సరిహద్దు ఛత్తీగఢ్ కిష్టారం సమీప అటవీప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ బలగాలపై మావోయిస్టులు శనివారందాడికి యత్నించినట్లు తెలుస్తోంది. రోడ్డు ప్రారంభానికి వెళుతున్నారనే సమాచారంతో ఐదు వందల మందిగి పైగా మావోయిస్టులు వీరికోసం పూటుకపల్లి వద్ద కాపుకాసినట్లు సమాచారం. ఓ ఆదివాసీ మహిళ ఈ విషయం బలగాలకు సమాచారమివ్వడంతో ఆ మార్గం గుండా వెళ్లకుండా వెనుదిరిగినట్లు తెలుస్తోంది. ఆ ప్రాంతంలోని మావోయిస్టులు కల్వర్టును పేల్చివేయగా, సీఆర్‌పీఎఫ్ బలగాలు రాకెట్ లాంచర్‌ను ప్రయోగించినట్లు తెలుస్తోంది.

# 2018 అన్ని వర్గాలకు కలిసి రావాలి

**క్యాలెండర్ ఆవిష్కరణలో**

**ఎంపీ, ఎమ్మెల్యే**

**ఖమ్మంటౌన్, జనవరి 6:** అన్ని వర్గాల ప్రజలకు 2018 సంవత్సరం కలిసి రావాలని ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ ఆకాంక్షించారు. ప్రతి ఏడాది నియోజకవర్గాల వారీగా క్యాలెండర్‌ను ముద్రించి ప్రజలకు అందజేసే ఎంపీ క్యాంపు కార్యాలయం నుంచి ఈ ఏడాది ఖమ్మం నియోజకవర్గం తరుపున ముద్రించి ఎంపీ ఎమ్మెల్యే కలిసి ప్రారంభించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం నూతన ఏడాది పలు వర్గాల ప్రజలు ఎన్నో సంక్షేమ పథకాలు అందించిందన్నారు. జనవరి 1నుంచి 24 గంటల విద్యుత్‌ను రైతులకు ఉచితంగా అందజేస్తుందన్నారు. మేలో రైతులకు ఎకరానికి రూ.4వేలు అందజేస్తున్నదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బత్తుల మురళీప్రసాద్, నగర అధ్యక్షుడు కమర్తపు మురళీ, మహిళా అధ్యక్షురాలు కొల్లు పద్మ, కార్పొరేటర్లు, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**గట్టు కరుణను అభినందించిన ఎంపీ**

సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహిత గట్టు కరుణను ఎంపీ శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అజయ్‌కుమార్ ఎంపీ క్యాంపు కార్యాలయంలో అభినందించారు. మహిళలకు భరోస కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళ విభాగం నగర కార్యదర్శి కే. పద్మజారెడ్డి, కొంగర జ్యోతిర్మాయి, షర్మిలసంపత్, కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత పాల్గొన్నారు.

# దినఫలాలు

## అదృష్టసంఖ్యలు : 1, 7

**మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20):** కృషి రంగంలో లక్ష్యాలు సాధిస్తారు. విందు వినోదాల్లో పాల్గొంటారు. పెద్దల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి అనుకూలం. వృత్తి, వ్యాపారాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**వృషభరాశి: (ఏప్రిల్21-మే20):** చిన్నారులు, ప్రియతముల అంశాలపై దృష్టి పెడతారు. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. పొదుపు పథకాలకు సంబంధించిన సమాచారం అందుకుంటారు. పెట్టుబడుల్లో అంచనాలు తప్పే అవకాశం ఉంది.

**మిథునరాశి: (మే21-జూన్21):** రియల్ ఎస్టేట్, గృహనిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా లాభిస్తుంది. ఆర్థిక లావాదేవీలు కొలిక్కి వస్తాయి. ఇంటికి సంబంధించి విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. మరమ్మతులకు, సమీక్షలకు అనుకూలం.

**కర్కాటకరాశి: (జూన్22-జూలై23):** సంభాషణలు, మెయిల్స్ ఉల్లాసం కలిగిస్తాయి. సోదరీసోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు, సమావేశాల్లో కొత్త పరిచయాలు ఏర్పడతాయి. ప్రియతములకు సంబంధించి ముఖ్య సమాచారం అందుకుంటారు.

**సింహరాశి: (జూలై24-ఆగస్ట్23):** శ్రమకు తగిన ఫలితం అందుకుంటారు. వినోదాల కోసం ఖర్చు చేస్తారు. ఆర్థిక అంశాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వస్తువుల కొనుగోలులో నాణ్యత గమనించాలి.

**కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23):** మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. సంతానం విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రేమానుబంధాలు బలపడతాయి. విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. ఖర్చులు అంచనాలు మించుతాయి. స్పెక్యులేషన్లు, పెట్టుబడుల్లో నిదానం అవసరం.

**తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23):** వేడుకల్లో పాల్గొంటారు. సినీరాజకీయ రంగాల వారు పట్టుదలతో పనులు పూర్తి చేస్తారు. కుటుంబ వ్యవహారాలపై దృష్టి పెడతారు. దూరంలో ఉన్న కుటుంబ సభ్యులు ఇల్లు చేరతారు. మనను ఉల్లాసంగా ఉంటుంది.

**వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22):** స్నేహానుబంధాలు బలపడతాయి. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. సమావేశాలు ఫలిస్తాయి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం అందుకుంటారు. పెట్టబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు.

**ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21):** అదనపు ఆదాయం అందుకుంటారు. వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. పెద్దలు, పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.

**మకరరాశి(డిసెంబర్22-జనవరి21):** సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. కొత్త పనుల ప్రారంభం విషయంలో ఆచితూచి ముందడుగు వేయాలి.

**కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18):** విరామ కాలక్షేపాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సమావేశాల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో గత అనుభవంతో లక్ష్యాలు సాధిస్తారు. రుణాలు మంజూరవుతాయి. చందాలు, విరాళాలకు ఖర్చు చేస్తారు.

**మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20):** స్నేహానుబంధాలు బలపడతాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్పెక్యులేషన్లు, పందాలు, పోటీల్లో నిదానం అవసరం. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ఖర్చులు అంచనాలు మించుతాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

# ఆలయ సమాచారం..



## భద్రాచలం రామయ్య

| కాటేజీ/సదనం | మొత్తం | ఖాళీలు |
|---|---|---|
| కాటేజీలు | 26 | 03 |
| వందగదుల సదనం | 62 | 09 |
| శ్రీరామ సదనం | 18 | 06 |
| టీటీడీ సదనం | 26 | 05 |
| సౌమిత్రి సదనం | 30 | 07 |

*తెల్లవారుజామున 4.30 నుంచి 5.30 వరకు, ఉదయం 7 గంటల నుంచి 1గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 8.30 వరకు సర్వదర్శనం.*

**సంప్రదించండి..**
దేవస్థానం కేంద్రీయ విచారణ కార్యాలయం : 08743-232467, 7660007671

**నిత్య సేవలు ఇలా..**

- తెల్లవారుజామున 4.30కి సుప్రభాతసేవ.
- 5.30 నుంచి 7గంటల వరకు బాలభోగం, నివేదన సేవాకాలం.
- ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు సహస్రనామార్చన.
- 8.30 నుంచి 11.30 వరకు, 12.30 నుంచి 1గంట వరకు, 3 నుంచి 8 గంటల వరకు మూల వరుల వద్ద అర్చన.
- 9.30 నుంచి మధ్యాహ్నం 11.30 వరకు నిత్య కల్యాణం.
- 11.30 నుంచి 12గంటల వరకు రాజభోగం.
- మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు ఆలయ తలుపులు మూస్తారు.
- రాత్రి 7గంటల నుంచి 8 వరకు దర్బారు సేవ.
- 8.30 నుంచి 9 గంటల వరకు నివేద బోగం అనంతరం పవళింపు సేవ. ఆ తర్వాత ఆలయం తలుపులు మూస్తారు.

**ప్రత్యేక దర్శనం టిక్కెట్టు ధర ఒకటికి : రూ.20**



## జమలాపురం వెంకన్న

| కాటేజీ/సదనం | మొత్తం | ఖాళీలు |
|---|---|---|
| టీటీడీ సత్రం | 12 | 00 |
| సీహెచ్ఎన్ఎన్ | 10 | 06 |

**నిత్య పూజలు**

- *తెల్లవారుజామున 4.30గంటలకు ఆలయాన్ని తెరుస్తారు.*
- *5గంటలకు తీర్థబిందెలు తెచ్చే కార్యక్రమం.*
- *6.30కి మంగళహారతి, మంత్రపుష్పం సమర్పణ.*
- *ఉదయం 7.00గంటలకు బాలభోగ నివేదన.*
- *7.10 నుంచి 12గంటల వరకు సర్వదర్శనం, ఆర్జిత సేవలు.*
- *10.30 గంటలకు స్వామివారి నిత్య కల్యాణం.*
- *సాయంత్రం 3గంటల నుంచి తిరిగి ఆర్జిత సేవలు.*

సంప్రదించాల్సిన నెం: 08749-279855 ● ఈవో రమణమూర్తి: 9491000705 ● ప్రధానార్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ : 9989507300

'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్'

# ముత్యాల ముగ్గుల పోటీలు నేడు

**8 పాల్వంచ, ఖమ్మం.. రెండు కేంద్రాల్లో నిర్వహణ**



**కొత్తగూడెం కలెక్టరేట్/ఖమ్మం సాంస్కృతికం, జనవరి 6:** ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న టాటా జెమినీ టీ ముత్యాల ముగ్గుల పోటీలు... టేస్ట్ పార్టనర్ గోల్డ్ డ్రాప్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్, హెల్త్ పార్టనర్ అమృతబిందు.. ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం జరగనున్నాయి. ఇరుజిల్లాల్లో రెండు కేంద్రాల్లో ఈ పోటీలు జరుగుతాయి. భద్రాద్రి కొత్తగూడేనికి సంబంధించి పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో పోటీలు జరగనుండగా... అనుబోస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ సహకారం అందిస్తోంది. ఖమ్మం జిల్లాకు సంబంధించి ఖమ్మం నగరంలోని రిక్కాబజార్ హైస్కూల్ ఆవరణలో జరిగే పోటీలకు ఖమ్మంలోని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ యాజమాన్యం సహకారం అందిస్తోంది. రెండు కేంద్రాల్లోనూ ఉదయం 9నుంచి 11గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయి. ఆసక్తి ఉన్న మహిళలు పేర్లునమోదు చేసుకునేందుకు భద్రాద్రి కొత్తగూడెం వారు 9246907418, 9985401698, ఖమ్మం జిల్లా వారు 9985411349, 9985410618 నెంబర్లలో సంప్రదించవచ్చు.

## 18న వైరాలో ఉమ్మడిజిల్లాలస్థాయి

# నృత్య పోటీలు

**వైరా, జనవరి 6:** ఎన్టీఆర్ 22వ వర్ధంతి సందర్భంగా తెలుగుయువత ఆధ్వర్యంలో 18న ఖమ్మంజిల్లా వైరాలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయిలో నృత్యపోటీలు నిర్వహిస్తున్నామని టీడీపీ, తెలుగుయువత నాయకులు తెలిపారు. వైరాలోని గాంధీచౌక్‌లో 18వతేదీ సాయంత్రం ఐదుగంటలకు నృత్యపోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.5116, ద్వితీయ రూ.4116, తృతీయ రూ.3116లతోపాటు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఆసక్తిగల కళాకారులు ఈనెల 17వతేదీ నాటికి 90326213755, 934667974, 9705314298, 9949913755, 8179122779కు ఎంట్రీలు పంపించాలని సూచించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చెరుకూరి చలపతిరావు, పట్టణ కార్యదర్శి కిలారి సురేందర్, తెలుగుయువత అధ్యక్ష, కార్యదర్శులు రాయల నారాయణరావు, వినోద్ పాల్గొన్నారు.

## దసరా మండపంలో

# రామయ్యకు రాపత్తు సేవ



రాపత్తు సేవ నిర్వహిస్తున్న దృశ్యం

**భద్రాచలం, జనవరి 6:** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామికి శనివారం దసరా మండపంలో రాపత్తు సేవ నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారికి రాపత్తు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో దసరా మండపంలో స్వామివారికి రాపత్తు సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సమయంలో రామయ్యకు ప్రత్యేక పూజలు, ప్రసాద నివేదన చేశారు. అంతకు ముందు స్వామి వారిని మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య దసరా మండపానికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు పొడిచేటి జగన్నాధాచార్యులు, వైద్య ఆరోగ్యశాఖ విశ్రాంత రీజినల్ డైరెక్టర్ డా. ఎస్.ఎల్. కాంతారావు, ఎస్ఎన్‌వీ రామారావు, స్థానిక ప్రముఖ వైద్యులు డా.సుబ్బరాజు, డా. శ్రీధర్ వర్మ తదితరులు పాల్గొన్నారు. కాగా ఆదివారం నాడు చిత్రకూట మండపంలో రాపత్తు సేవ నిర్వహించనున్నారు.

# ముక్కోటి ఆదాయం రూ.40.29 లక్షలు

**భద్రాచలం, జనవరి 6:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వైకుంఠ ఏకాదశి మహోత్సవ ఆదాయం రూ.40,29,680 సమకూరింది.. 2016-17 లో రూ.33,26,595 రాగా, ఈ ఏడాది రూ.7,03,085 ఆదాయం అదనంగా వచ్చింది. దేవస్థానం ఆధ్వర్యంలో గత ఏడాది డిసెంబరు 19 నుంచి ఈ నెల 8 వరకు అధ్యయనోత్సవాలు నిర్వహి స్తున్నారు. గత ఏడాది డిసెంబరు 28న తెప్పోత్సవం, 29న ఉత్తర ద్వార దర్శనం నిర్వహించారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ముక్కోటికి విక్రయించిన టికెట్ల విలువ రూ.21,52,250. రూ.1000 టికెట్లు 1100 విక్రయించడం ద్వారా రూ.11 లక్షలు, రూ.500 విలువ గల 1843 టికెట్ల విక్రయం ద్వారా రూ.9,21,500 రూ.250 విలువ గల 523 టికెట్ల విక్రయం ద్వారా రూ.1,30,750 ఆదాయం సమకూరింది. డిసెంబరు 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.18,77,430 ఆదాయం వచ్చింది. గత ఏడాది మీద ఈ ఏడాది రూ.1000 విలువ గల టికెట్లు 300 అధికంగా విక్రయించడం, ప్రసాదాల ధరలు పెంచడంతో ఆదాయం పెరిగింది.


# చారిత్రక వైభవం




ఇది భీముడి అడుగు గుర్తుగా స్థానికులు చెబుతుంటారు

## టీఎల్‌పేటలో.. పాండవుల ఆనవాళ్లు

**ఏన్కూరు, జనవరి 6:** పాండవులు నడయాడినట్లుగా చెపుతున్న ఆనవాళ్లు ఏన్కూరు మండల పరిధిలోని తూతక లింగన్నపేట అడవిలో కనిపిస్తున్నాయి. టీఎల్‌పేట, కేసుపల్లి సమీపంలోని గుట్టల్లో పాండవులు సంచరించినట్లుగా స్థానికులు చెబుతుంటారు. పాండవుల్లో ఒకరైన భీముడు అడుగులు వేసిన ప్రదేశాల్లో గుంతలు పడ్డట్టుగా చెబుతుంటారు. ఒక గుంతలో ఎప్పుడూ నీళ్లు ఉంటాయి. ఏకాలంలో చూసినా అందులో నీళ్లుండటం ఆశ్చర్యం కలిగిస్తోందని గ్రామస్తులు అంటున్నారు. అదేవిధంగా.. భీముడు అడుగు వేసిన దగ్గరలోనే రథచక్రాలు వెళ్లినట్లుగా బండలపై గీతల గుర్తులు కనిపిస్తుంటాయి. వీటికితోడు రాళ్లపై గుర్రపుకాళ్లగిట్టల గుర్తులు అగుపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. గుర్తులే కేసుపల్లి అడవిలో ఉన్నాయి. ఈ అటవీప్రాంతానికి సైతం భీముడు వచ్చినట్టుగా స్థానికులు భావిస్తుంటారు. వనభోజనాల సమయాల్లో అక్కడ పాండవుల స్వరూపాలుగా భావించే ఐదురాళ్లకు సున్నాలు వేసి పసుపు, కుంకుమలు చల్లి పూజలు చేయటం ఆనవాయితీగా వస్తోంది. తెల్లగా వింతఆకారంలో ఉన్న రాయి కూడా కనిపిస్తుంది. చారిత్రక పరిశోధకులు ఈ ప్రాంతాన్ని సందర్శించి, వీటిపై సమగ్ర పరిశీలన చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పాండవులుగా భావించి పూజలు చేసిన గ్రామస్తులు



వింత ఆకారంలో ఉన్న తెల్ల రాయి

సండే స్పెషల్

రామయ్య రాజసం.. పాండవుల వనవాసం.. కాకతీయుల ఘనత.. ఇలా, అలనాటి చారిత్రక వైభవాలను కళ్లకు కట్టే ఆనవాళ్లు ఎన్నో మన చుట్టూ ఉన్నాయి. నాటి రాజనీతి, పాలనా తీరును అర్థం చేయించే తార్కాణాలెన్నో వందల ఏళ్లుగా దర్శనం ఇస్తూనే ఉన్నాయి. అయితే.. మనకు వారసత్వంగా వచ్చిన ఈ సంపదను పరిరక్షించడంలో అలసత్వం వహిస్తున్నారన్నది కాదనలేని సత్యం. ఫలితంగా.. ఎంతో విలువైన చారిత్రక వైభవం మెల్లమెల్లగా శిథిలమైపోతోంది...

- ఇరు జిల్లాల్లో అంతులేని చారిత్రక సంపద
- గతం ఘనతను చాటిచెప్పే సజీవ సాక్ష్యాలు ఎన్నో..
- ఆలనాపాలనా లేక శిథిలమవుతున్న ఆనవాళ్లు
- అధికారులు పట్టించుకుంటేనే పదిలం

**చంద్రుగొండ, జనవరి 6 :** కాకతీయుల కాలం నాటి చారిత్రక సంపద కనుమరుగవుతోంది. గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపడుతుండడం.. పర్యాటక శాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వంటి కారణాలతో పురాతన కట్టడాలు శిథిలమవుతున్నాయి. చంద్రుగొండ మండలంలోని బెండాలపాడు గ్రామ శివారులో కనిగిరి గుట్టలపై ఉన్న ఈ చారిత్రక ఆనవాళ్లు.. చరిత్రలో కలిసిపోతున్నాయి.



శిథిలమైన పానవట్టం

### చంద్రుగొండకు 10కి.మీ. దూరంలో..

మండల కేంద్రానికి 10కిలో మీటర్ల దూరంలో కనిగిరి గుట్టలున్నాయి. ఈ గుట్టలు జూలూరుపాడు, కల్లూరు మండలాలకు అనుసంధానంగా విస్తరించి ఉన్నాయి. ఈ గుట్టను పల్లెల బావిగా పిలుస్తుంటారు. అప్పట్లో ప్రతాప రుద్రుడి సైనిక స్థావరాలు ఇక్కడే ఉండేవని చెబుతుంటారు. కాకతీయ రాజులు శత్రువు నుంచి రక్షణ కోసం ఎత్తయిన గుట్టలను ఎంపికచేసి, సొరంగాల ద్వారా రహస్య కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్టు ఇక్కడ ఆనవాళ్లు చెబుతున్నాయి. ఈ గుట్టల నుంచి కాకతీయుల రాజధాని ఓరుగల్లుకు సొరంగ మార్గం ఉన్నట్టు చెప్పుకుంటారు. అప్పటి కట్టడాలకు సంబంధించిన పలు ఆనవాళ్లు ఇక్కడ కనిపిస్తాయి. రెండు గుట్టల చుట్టూ రాతితో నిర్మించిన పలు ప్రాకారాలు, నివాస స్థావరాలు, రాతి పలకలపై వివిధ భంగిమల్లో చెక్కిన చిత్రాలు కనిపిస్తున్నాయి. గుట్టల కింది భాగంలో ఒక చెరువు ఉన్నట్టు, ఈ ప్రాంతంలో ఒక గ్రామం కూడా ఉన్నట్టు స్పష్టమవుతోంది. ఇంకా.. రథచక్రాలు, విసురు రాళ్లు, రోకలి, రోళ్లు, శిథిలమైన చిన్న చిన్న ఆలయాలు కనిపిస్తున్నాయి. ఒకే శిలపై చెక్కిన హస్తాల వీరభద్రుడి విగ్రహం ఉంది. ప్రత్యర్థి వర్గం దాడిచేసినపుడు తప్పించుకునేందుకు గుట్ట నుంచి ఆలయాల వరకు సొరంగ మార్గం ద్వారా రక్షణ చర్యలు చేపట్టినట్టు అక్కడి ఆనవాళ్ల ద్వారా తెలుస్తోంది. గుట్టపై శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాలు శిథిలమై ఉన్నాయి.

### నిధుల కోసం తవ్వకాలు..

గతంలో కాకతీయ సొరంగ మార్గాల ద్వారా బంగారం దాచారని కొందరి నమ్మకం. ప్రస్తుతం వాటి అన్వేషణ కోసం తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వరంగల్, హైదరాబాద్ లాంటి ప్రాంతాల నుంచి కొందరు అధునాతన పరికరాలతో రాత్రి సమయాల్లో గుట్టపైకి వస్తుంటారు. గుప్త నిధుల కోసం గుట్టలపై పలు చోట్ల క్షుద్ర పూజలు చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటి వరకు నిధులు దొరికిన సంఘటనలు లేకున్నా... అన్వేషణ కోసం భారీగా తవ్వకాలు చేపట్టిన ఆనవాళ్లు మాత్రం ఉన్నాయి.

### మొదలు కాని కల్లూరు రోడ్డు..

బెండాలపాడు గ్రామం నుంచి గుట్టల మీదుగా కల్లూరుకు రోడ్డు నిర్మిస్తామని ఇటీవల బెండాలపాడును సందర్శించిన సందర్భంగా మంత్రి తుమ్మల హామీనిచ్చారు. ఈ క్రమంలో ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో సర్వే కూడా నిర్వహించారు. కానీ.. నిర్మాణం చేపట్టలేదు. ఈ గుట్టపై ప్రతీ ఏడాది శివరాత్రి సమయంలో వీరభద్రుడికి కన్నుల పండువగా కల్యాణం నిర్వహిస్తుంటారు. ఇప్పటికైనా.. సంబంధిత శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, కాకతీయుల చరిత్రను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



గోడలపై శృంగార భంగిమ చిత్రాలు



బెండాలపాడు శివారులోని కనకగిరి గుట్టలు

## పువ్వాడ ప్రీమియర్‌లీగ్ జెర్సీల ఆవిష్కరణ



జెర్సీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 6:** జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 9వ తేదీ నుంచి 17వరకు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరగనున్న పువ్వాడ ప్రీమియర్‌లీగ్ టీ-20 డేనైట్ క్రికెట్ పోటీల జెర్సీలను శనివారం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏసీపీ గణేష్, డిప్యూటీమేయర్ బత్తుల మురళీ ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. కార్యక్రమంలో టోర్నీలో పాల్గొనే 12జట్టు కెప్టెన్ల సమక్షంలో పోటీల డ్రా తీశారు. కార్యక్రమంలో హెచ్‌సీఏ జిల్లా కో-ఆర్డినేటర్ ఎండీ మసూద్, కార్పొరేటర్లు పగడాలనాగరాజు, కమర్తపుమురళి, చావా నారాయణరావు, వలరాజు, టీఆర్ఎస్ నాయులు బుర్రి వినయ్, జస్వంత్, చింతనిప్పు కృష్ణ చైతన్య, మెగామాస్టర్ స్పోర్ట్స్ ఫౌండేషన్ సభ్యులు ఫారుక్, మమ్ము, సందీప్, రాము, నాగేష్ పాల్గొన్నారు.



రాళ్లతో నిర్మించిన మెట్లు



కూసుమంచి శివాలయం ఆవరణలోని శిలాశాసనం

## గణపేశ్వరాలయంలో శిలా శాసనాలు



**కూసుమంచి:** కూసుమంచి గణపేశ్వరాలయంలో కాకతీయులు రాళ్లపై పురాతనమైన శాసనాలు చెక్కారు. ఆలయంలోని ఈశాన్య దిశలో నవగ్రహ మండపానికి దగ్గరలో నాలుగు పలకలుగా ఉన్న రెండు శాసన స్తంభాలు ఉన్నాయి. దేవాలయం శుభ్రం చేస్తున్న క్రమంలో లభించాయి. వీటిని మళ్లీ నిలబెట్టారు. ఈ శాసనంపై గణపతిదేవుడు, శివలింగం, ఆవుదూడ, సూర్యచంద్రులు, గరత్మంతుడు వంటి బొమ్మలున్నాయి. కాకతీయుల శాసనాలు చాలావరకు దాన శాసనాలే. దేవాలయాలలోని ధూపదీప నైవేద్యాల నిర్వహణకు, దైవసంబంధిత పండుగలకు, వేడుకగా చేయాల్సిన పనులకు దేవాలయానికి కావలిసిన మానవ వనరులకు అంటే.. పూజారి, ఆలయాన్ని శుభ్రపరిచేవారికి సంగీత విద్వాంసులకు కొంత భూమిని దేవాలయ ఆస్తిగా తీసిపెట్టేవారు. దానిపై వచ్చే ఆదాయాన్ని ఉపయోగించుకునేందుకు ఒప్పంద పత్రాలుగా.. ఈ శాసనాలు వేయించినట్లు తెలుస్తోంది. శాసన పరిభాషలో ప్రధానంగా ఆచంద్రార్కం, చంద్రార్కస్థాయిగా, ఆదిత్య చంద్రులు కలియనంతకాలం, శశులు కలియనంత కాలం వంటి పదబంధాలు కనిపిస్తాయని అధ్యయనకారులు చెబుతుంటారు.

## భద్రాద్రిలో.. రామలక్ష్మణ స్తంభాలు



రామ, లక్ష్మణ స్తంభాలు

- భద్రాద్రి రామాలయంలో నేటికీ చెక్కుచెదరని శిలా శాసనాలు
- తూము నృసింహదాసు హయాంలో మలిరూపు

**భద్రాచలం:** భద్రాచల రామక్షేత్రంలోని ఆలయ ప్రాంగణంలో పరిశీలిస్తే.. ప్రాచీన తెలుగు భాషలోని శిలాశాసనాలు దర్శనమిస్తాయి. ఆలయం తూర్పు మెట్ల వైపు భద్రుని కోవెల వెనుక భాగంలో ఈ రెండు స్తంభాలు ఉంటాయి. భద్రాద్రి ఆలయ సేవలు, నిర్వహణ సంబంధమైన అనేక విషయాల గురించి తెలిపే ఈ శాసనాలను రామదాసు చెక్కించగా.., అవి దుండగుల బారినపడి ధ్వంసమయ్యాయి. కాగా.. తూము నృసింహదాసు నాటి నిజాం ప్రభువు నాసిరుద్దౌలా అనుమతితో ఆ శాసనాలను తిరిగి చెక్కించారు. ఈ శాసనాలు ప్రతీ స్తంభానికి నాలుగు వైపులా చెక్కబడి ఉన్నాయి. ఈ రెండు స్తంభాలకు రామలక్ష్మణ స్తంభాలని నామకరణం చేశారు.

### ప్రాచీన తెలుగులో..

ఈ శిలా శాసనాల మీద ఎంతో ప్రాచీనమైన తెలుగు భాష ఉండటంతో నేటి తరానికి అర్థం కాని పరిస్థితి. కాగా ఈ రెండు స్తంభాల్లో సుమారు 15 పంక్తులు భూ భాగంలోకి వెళ్లినట్లు నాటితరం వారు చెబుతుంటారు. రామస్తంభంలో రామచంద్రునికి భూములు ఏయే ప్రాంతాల్లోఉన్నాయి? ఎవరి ఆధీనంలోఉన్నాయి? అనేటువంటి వివరాలు ఉన్నాయి. లక్ష్మణ స్తంభంలో ప్రతీరోజు సుప్రభాత సేవ నుంచి పవళింపు సేవ వరకు జరిగే సేవల గురించి లిఖించి ఉన్నాయి. అలాగే.. స్వామి వారికి నివేదించే కృత పొంగలి, చెక్కర పొంగలి, పులిహోర, దద్దోజనం తదితర నివేదనల గురించి, వాటికి సరిపడే దిట్టం గురించి ఆ శాసనాల్లో ఉంది. అదేవిధంగా.. జ్యేష్టాభిషేకం, శ్రావణమాసంలో గోకులాష్టమి, ఉట్ల పండుగ, జగన్మోహిని అలంకారం, ధనుర్మాసంలో అధ్యయనోత్సవాలు, మాఘమాసంలో సహస్రఘటాభిషేకం, ఫాల్గుణమాసంలో డోలోత్సవం, రామయ్యను పెళ్లికుమారుడిని చేయడం తదితర ఉత్సవ వివరాలు సైతం ఉన్నాయి. ఇంకా.. శ్రీవారి సన్నిధిలో ఉండాల్సిన గుర్రాలు, ఏనుగుల గురించి, పని వారు, హరిదాసులు, దేవస్థానం సిబ్బంది గురించి కూడా పేర్కొన్నారు. భద్రాద్రి రామయ్యను దర్శించుకోవడానికి వచ్చే ప్రతీ భక్తుడు తప్పనిసరిగా ఆలయ ప్రాంగణంలోని తూర్పు మెట్లవైపు ఉన్న రామలక్ష్మణ స్తంభాలను దర్శించుకుంటూ ఉంటారు. ఈ సమయంలో ఆనాటి తరం వారు తమ పిల్లలకు, బంధువులకు రామలక్ష్మణ స్తంభాల ప్రాశస్త్యం వివరిస్తూ ఉంటారు.

# విషయాధారిత వాదాన్ని ప్రతిపాదించినవారు?

## ఎస్‌జిటి సోషల్ మెథడ్స్

### నమూనా ప్రశ్నలు

**1. ఉపాధ్యాయుడు తరగతి గదిలో ఉపయోగించాల్సిన పద్ధతులు, సాధనాలు, విషయ పరిజ్ఞానాన్ని తెలియజేస్తూ అది విద్యార్థుల్లో ఎలా నిర్దిష్ట లక్ష్యాలను సాధించేందుకు ఉపయోగపడతాయో సూచించే పథకమే పాఠ్యపథకం...అని నిర్వచించింది?**

1) ఎల్.బి.స్టాండ్ 2) బోసింగ్
3) బైనింగ్ అండ్ బైనింగ్ 4) స్టీవెన్‌సన్

**సమాధానం: 2**

**వివరణ:** ఒక పీరియడ్‌లో బోధించాలని నిర్ణయించిన దాన్ని పీరియడ్ పథకం లేదా పాఠ్య పథకమని అంటారు. ఇది ఉపాధ్యాయుడు తరగతి గదిలో బోధించాల్సిన విధానాన్ని తెలిపే ప్రక్రియ. ఇది ఉపాధ్యాయుని కార్యక్రమాలు, పాఠ్యాంశంపై ఉన్న అవగాహన తదితర అంశాలను తెలియజేస్తుంది. ఆవశ్యకత, లక్షణాలు తదితరాల ఆధారంగా పీరియడ్ పథకం లేదా పాఠ్యపథకానికి విద్యారంగ నిపుణులు వివిధ రకాలుగా నిర్వచించారు.

**2. 'భారతదేశం-నదీ వ్యవస్థ'కు సంబంధించి బోధనలో భాగంగా ఉపాధ్యాయుడు... విద్యార్థులతో భారతదేశ మ్యాప్‌లో నదులను గుర్తించడాన్ని అభ్యసింపజేస్తున్నాడు. ఇది పీరియడ్ ప్రణాళికలోని ఎన్నో బోధన సోపానం?**

1) 1 2) 2 3) 3 4) 4

**సమాధానం: 4**

**వివరణ:** సాంఘికశాస్త్ర బోధనకు సంబంధించి పీరియడ్ ప్రణాళికలో నాలుగు బోధన సోపానాలున్నాయి. అవి...1.ఉపోద్ఘాతం(పలకరింపు, మైండ్ మ్యాపింగ్/పునశ్చరణ ప్రశ్నలు;పాఠ్యాంశ ప్రకటన); 2.పాఠ్యాంశాన్ని చదివి తెలియని పదాలు, భావనలను గుర్తించడం(గుర్తించడం, అవగాహన కలిగించడం, భావనల అవగాహన-చర్చ); 3.భావనల అవగాహన-చర్చ(మాట్లాడించడం, ప్రశ్నించడం, భావనలపై అవగాహన ప్రశ్నలు); 4.నైపుణ్యాల అభ్యసన(సమాచార నైపుణ్యాలు, పట నైపుణ్యాలు). దీనివల్ల పిల్లల్లో సమాచార నైపుణ్యాలపై సేకరణ, నమోదు, విశ్లేషణ, నిర్ధారణకు రావడం తదితర లక్షణాలు పెంపొందుతాయి.

**3. మానవులను సామాజిక సమూహాలుగా ఐక్యపరిచే పవిత్ర విశ్వాసాలు, ఆచారాల వ్యవస్థే మతం...అని అన్నది?**

1) డర్క్‌హోమ్ 2) జోసెఫ్ డి.నోవక్
3) పటేల్ కమిటీ 4) జాన్‌డ్యూయీ

**సమాధానం: 1**

**వివరణ:** శారీరక లక్షణాలు, తెలివితేటలు, వారసత్వ ప్రభావాలు తదితర అంశాలను భౌతికాంశాలుగా; మతం, కులం, సంస్కృతి, ఆర్థిక పరిస్థితులు, రాజకీయ పరిస్థితులు, సామాజిక వర్గాలు తదితర అంశాలను సాంఘిక అంశాలుగా చెప్పొచ్చు. ప్రస్తుతం సమాజ వికాసంలో సాంఘికాంశాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఈ క్రమంలో పాఠ్యప్రణాళిక, విద్యా లక్ష్యాలు, బోధన పద్ధతులు తదితరాలను సాంఘికాంశాలు శాసిస్తున్నాయి. ప్రస్తుతం సాంఘికశాస్త్ర అవగాహనకు వివిధ అంశాలు తోడ్పడుతున్నాయి. అవి...మతం, కులం, సామాజిక వర్గం, విజ్ఞానశాస్త్రం, రాజకీయ పరిస్థితులు, ఆర్థిక పరిస్థితులు. వీటిలో మతానికి డర్క్‌హోమ్ ఆలోచనాత్మక నిర్వచనం ఇచ్చాడు.

**4. 'పిల్లలకు నిజాయితీని అలవరచడం విద్యాభ్యాసంలో తొలిమెట్టు' అని చెప్పినవారు?**

1) జాన్ వి.హైఖేలిన్ 2) సెకండరీ విద్యా కమిషన్
3) జాన్‌రస్కిన్ 4) జేమ్స్ హెమ్మింగ్స్

**సమాధానం: 3**

**వివరణ:** సమాజంలో ఒక సభ్యుడిగా మనిషి సముపార్జించుకున్న విజ్ఞానం, విశ్వాసం, కళ, నీతి సూత్రాలు, న్యాయం, ఆచారాలు, ఇతర సామర్థ్యాలు, అలవాట్లను మొత్తంగా కలిపి సంస్కృతిగా చెప్పొచ్చు. సాంఘికశాస్త్ర అవగాహనలో వివిధ సాంస్కృతిక అంశాలు, పాత్ర పోషిస్తాయి. ఈ క్రమంలోనే పిల్లలకు నిజాయితీని అలవరచడం విద్యాభ్యాసంలో తొలిమెట్టు అని ప్రముఖ బ్రిటిష్ సామాజికవేత్త జాన్ రస్కిన్(1819-1900) పేర్కొన్నాడు.

**5. సామూహిక కృత్యమైన 'క్విజ్' ద్వారా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో పెంపొందించే అంశాలు?**

1) విషయ పరిపుష్టి 2) పఠనాసక్తి
3) నైపుణ్యాభివృద్ధి 4) పైవన్నీ

**సమాధానం: 4**

**వివరణ:** సాంఘికశాస్త్రాలకు సమాజమే ఒక ప్రయోగశాల కాబట్టి పిల్లలు సమాజంలోని కుటుంబం, సామాజిక సంస్థలు, పాఠశాల ఉపాధ్యాయుడు, సమ వయస్కు బృందాలు, సహ విద్యార్థులు తదితరాల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకుంటారు. అయితే ఆ విధంగా నేర్చుకునేందుకు ఉపాధ్యాయుడు అనువైన వాతావరణాన్ని ఏర్పరచాలి. క్విజ్; ఆల్బమ్/స్క్రాప్‌బుక్ తయారీ; స్టాంపులు, నాణేల సేకరణ; సాంఘికశాస్త్ర మేళాల నిర్వహణ; సామాజిక సేవా కార్యక్రమాలు; సాంఘికశాస్త్ర క్లబ్బులు తదితరాలను నిర్వహించాలి. ఈ కార్యక్రమాల నిర్వహణలో ఉపాధ్యాయుడు బోధకుడి పాత్ర నుంచి సహకారి, సహ అభ్యాసకుడి పాత్రను పోషించాల్సి ఉంటుంది. సామూహిక కృత్యాల్లో క్విజ్ కీలకమైనది. దీనివల్ల విద్యార్థుల్లో విషయ పరిపుష్టి, పఠనాసక్తి, నైపుణ్యాభివృద్ధితోపాటు బృందాల మధ్య పోటీతత్వం పెంపొందించవచ్చు. విద్యార్థుల్లో దాగియున్న అంతర్గత శక్తి సామర్థ్యాలను వెలికితీయొచ్చు. అదే విధంగా అభ్యసనలో యాంత్రికతను దూరం చేయొచ్చు.

**6. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు ఇటీవల ఆంధ్రజ్యోతి పత్రికలో సింగరేణి బొగ్గు గనులకు సంబంధించి ప్రచురితమైన ఓ చిత్రాన్ని విద్యార్థులకు చూపిస్తూ...దానిపై ప్రశ్నలు అడిగాడు. విషయాధారిత ఉపగమంలో ఈ ప్రశ్నలు ఏ రకానికి సంబంధించినవి?**

1) అనుమతి ప్రశ్నలు 2) వ్యాఖ్యాన ప్రశ్నలు
3) బదిలీ ప్రశ్నలు 4) పరికల్పన గురించి ప్రశ్నలు

**సమాధానం: 1**

**వివరణ:** విచారణాధారిత ఉపగమంలో ఉపాధ్యాయుడు కేవలం సౌకర్యకర్తగా ఉంటూ, విద్యార్థిలో రేకెత్తిన భావ సంచయనాన్ని, క్రమబద్ధ క్షేత్ర నియమాలతో అనుసంధానం తదితరాల ద్వారా సక్రమ అభ్యసన జరిగేందుకు కృషిచేస్తాడు. ప్రశ్నలు సొంత పరిశోధనకు గుండెకాయలాంటివి. ప్రశ్నలు సంప్రదాయ తరగతిలో ఒక భాగం. ప్రశ్నాపద్ధతులు విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదలకు ఉపయోగకరంగా ఉండాలి. విషయాధారిత ఉపగమంలో నాలుగు రకాల ప్రశ్నలను పేర్కొన్నారు. అవి... 1. అనుమతి ప్రశ్నలు; 2. వ్యాఖ్యాన ప్రశ్నలు; 3. బదిలీ ప్రశ్నలు; 4. పరికల్పన గురించి ప్రశ్నలు. అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా అనుమతి ప్రశ్నలుంటాయి. ఈ రకం ప్రశ్నల ద్వారా విద్యార్థులు తక్షణమే జ్ఞానార్జన చేస్తారు.

**7. ఎరిక్సన్ మనోవైజ్ఞానిక భావాలపై ఆధారపడిన సాంఘిక జట్టుపనిలోని విధానం?**

1) నివారణ పద్ధతి(Remidial Model)
2. అన్యోన్య లేదా మధ్యవర్తిత్వ పద్ధతి(Reciprocal or Mediatory Model)
3. అభివృద్ధి పద్ధతి(Development Model)
4. సాంఘిక లక్ష్య పద్ధతి(Social Goal Model)

**సమాధానం: 3**

**వివరణ:** వ్యక్తి సొంతంగా నిర్వహించిన సామాజిక పనికంటే సామూహికంగా లేదా జట్టుగా చేసిన పని ఫలితం ఎక్కువగా ఉంటుంది. జట్టుపని వల్ల నైపుణ్యాలు ఎక్కువగా అభివృద్ధి చెందుతాయి. సాంఘిక జట్టుపనిలో నాలుగు విధానాలున్నాయి. అవి.. 1) నివారణ పద్ధతి 2) అన్యోన్య లేదా మధ్యవర్తిత్వ పద్ధతి 3) అభివృద్ధి పద్ధతి 4) సాంఘిక లక్ష్య పద్ధతి. ఎరిక్సన్ మనోవైజ్ఞానిక భావాలపై అభివృద్ధి పద్ధతి ఆధారపడి ఉంటుంది. ఇది బృంద వైశిష్ట్యాలు, సంఘర్షణ సూత్రంపై నిర్దిష్టత కలిగి ఉంటుంది. బృందాలు పూర్తి స్వేచ్ఛ కలిగి, ఏకఛ్ఛత్రాధిపత్యం కలిగి ఉంటాయి. బృందాల్లోనివారు ఆయా సంఘాల్లోని భావాలకు అనుగుణంగా ప్రవర్తిస్తారు. లక్ష్యాల సాధనకు అభివృద్ధి పథంలో పయనిస్తారు.

**8. భారతదేశ జీవ నదులు అనే పాఠ్యాంశ బోధనలో భాగంగా ఉపాధ్యాయుడు ఓ వీడియో ఆధారంగా బోధిస్తున్నాడు. ఇది సాంఘిక శాస్త్ర బోధనావనరుల్లో ఏ రకమైన వనరు?**

1) భౌతిక వనరు 2) లిఖిత/అలిఖిత వనరు
3) ద్వితీయ వనరు 4) ఏదీకాదు

**సమాధానం: 2**

**వివరణ:** సాంఘికశాస్త్ర బోధన వనరులను ప్రధానంగా రెండు రకాలు విభజించొచ్చు. అవి... 1. ప్రాథమిక వనరులు(Primary Sources), 2. ద్వితీయ వనరులు(Secondary Sources). ప్రాథమిక వనరుల్లో భౌతిక వనరులు, లిఖిత/అలిఖిత వనరులు ఉంటాయి. కట్టడాలు, దేవాలయాలు, మ్యూజియాలు, కళాకృతులు, పాత్రలు తదితరాలు భౌతిక వనరుల కిందకు వస్తాయి. డైరీలు, ఉపన్యాసాలు, మౌఖిక చరిత్రలు, ఆడియో, వీడియో రికార్డింగ్, జనాభా రికార్డులు, చాయాచిత్రాలు, పోస్టరులు తదితరాలను లిఖిత/అలిఖిత వనరులుగా చెప్పొచ్చు.

**9. భారతదేశాన్ని సందర్శించిన మొదటి విదేశీ యాత్రికుడు మెగస్తనీస్ కాగా, మనదేశాన్ని సందర్శించిన తొలి చైనా యాత్రికుడు ఎవరు?**

1) ఫాహియాన్ 2) హుయాత్సాంగ్
3) అల్‌బరూని 4) మార్కోపోలో

**సమాధానం: 1**

**వివరణ:** బౌద్ధమత గ్రంథాల్లో నిక్షిప్తమైయున్న భారతీయ సంప్రదాయాల గురించి తెలుసుకునేందుకు, వాస్తవ నిరూపణల కోసం ఫాహియాన్ క్రీ.శ.399లో గుప్తుల కాలంలో దేశంలో పర్యటించాడు. భారత్‌లోని తన అనుభవాలను, భారతీయ తత్వశాస్త్ర గొప్పతనాన్ని తన 'ప్రయాణ దర్శిని'లో రాశాడు. రెండో చంద్రగుప్త మౌర్యుని కాలంలో న్యాయం, ప్రజలపై రాజుల బాధ్యతలు తదితర అంశాలను క్షుణ్ణంగా వివరించాడు. ఫాహియాన్ 'ప్రయాణ దర్శిని'ని బౌద్ధమత ఇతిహాసంగా కూడా చెప్పొచ్చు.

**10. రాష్ట్రంలో 2012-17 మధ్యకాలంలో పప్పుధాన్యాల ఉత్పత్తి గురించి బోధించేందుకు ఉపాధ్యాయుడికి అనువుగా ఉండే గ్రాఫ్‌లు?**

1) లైన్ గ్రాఫ్‌లు 2) బార్ గ్రాఫ్‌లు
3) సర్కిల్ గ్రాఫ్‌లు 4) చిత్రాల గ్రాఫ్‌లు

**సమాధానం: 2**

**వివరణ:** గణాంక పట్టికల వివరాలను విద్యార్థులకు వివరించడానికి గీతలు లేదా చుక్కల ద్వారా చూపే రేఖాచిత్రాలను గ్రాపులంటారు. గ్రాపుల్లో లైన్ గ్రాఫ్‌లు, బార్ గ్రాఫ్‌లు, సర్కిల్ గ్రాఫ్‌లు, చిత్రాల గ్రాఫ్‌లు, ప్లానల్ గ్రాఫ్‌లు ఉంటాయి. నిలువుగా లేదా అడ్డంగా పొడవైన స్తంభంలాంటి గీతల ద్వారా ఒక అంశంలో క్రమానుగత అభివృద్ధి లేదా మార్పులను బార్‌గ్రాఫ్‌ల ద్వారా చూపించవచ్చు.

**11. విషయాధారిత వాదాన్ని ప్రతిపాదించినవారు?**

1) రోజర్ శాంక్, అతని శిష్యబృందం
2) జాన్‌డ్యూయీ, అగస్టన్
3) యశ్‌పాల్ కమిటీ
4) సెకండరీ విద్యా కమిషన్

**సమాధానం: 1**

**వివరణ:** గత సమస్యల సాధన అనుభవం ద్వారా కొత్త సమస్యలను సాధించడం విషయాధారిత వాదం. ఇది కేవలం కంప్యూటర్ ఆధారిత సమస్యల సాధనకే కాకుండా, నిత్యజీవితంలో మనిషికి ఎదురయ్యే అన్ని రకాల సాధనకు ఉపయోగపడుతుంది. వ్యక్తిగతంగా గతంలో పొందిన అనుభవాల ఆధారంగా విషయాధారిత వాదం కొత్త సమస్యలను పరిష్కరిస్తుంది. ఈ వాదాన్ని 1980లో రోజర్‌శాంక్, ఆయన శిష్యబృందం ప్రతిపాదించారు.

- అశోకరాణి వడ్లమూరి, ప్రభుత్వ ఉపాధ్యాయిని.

---

# అలోవేరా డ్రింక్

స్వయం ఉపాధి



సామాజిక, ఆర్థిక అభివృద్ధితో ప్రజల అలవాట్లు, ప్రాధాన్యాలు మారడం సహజం. ఆరోగ్యంపై శ్రద్ధ ఫలితంగా శుచికరమైన ఆహారం, పానీయాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. అందువల్లనే మనందరం కలబందగా పిలిచే 'అలోవేరా' ఆరోగ్య, సౌందర్య పరిరక్షణ, ఇతర ఉత్పత్తులకు డిమాండ్ క్రమేణా పెరుగుతోంది. నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందుబాటులో ఉంటే అవసరమైతే అధిక ధరలు చెల్లించి అయినా ఉపయోగించడానికి నేటి వినియోగదారులు వెనుకాడటం లేదు.

### కలబంద ప్రయోజనాలు

శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపుతుంది, రోగనిరోధకశక్తిని వృద్ధి పరుస్తుంది. ఆల్కనైజింగ్ ప్రభావం వల్ల జీర్ణవ్యవస్థ వృద్ధి చెందుతుంది. అజీర్తి సమస్యను నివారిస్తుంది. మధుమేహాన్ని నియంత్రిస్తుంది. వడదెబ్బ, కాలిన గాయాలు పొడిచర్మం వల్ల సమస్యలను నివారిస్తుంది. నోటి సంబంధ వ్యాధులను నివారిస్తుంది. చర్మాన్ని ప్రకాశవంతం చేస్తుంది. పోషక విలువలను పెంచుతుంది. యాంటీ ఇన్‌ఫ్లమేటరీగా పనిచేస్తుంది. శరీర వృద్ధికి తోడ్పడుతుంది. అవసరమైన విటమిన్లను శరీరానికి అందిస్తుంది. క్యాన్సర్ రాకుండా నిరోధిస్తుంది. కాలేయాన్ని సమర్థంగా పనిచేయిస్తుంది.

అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉండటంతో అలోవేరా డ్రింక్‌ను ప్రతిరోజూ తీసుకుని ఆరోగ్యాన్ని వృద్ధి చేసుకోవచ్చు.

### రెడీ టు డ్రింక్ / సర్వ్ జ్యూస్

సింథటిక్ శీతల పానీయాల్లో అధికశాతం పెస్టిసైడ్స్ ఉంటున్నాయని, అవి ఆరోగ్యానికి హానికరంగా మారుతున్నాయని అనేక స్వచ్ఛంధ సేవా సంస్థలు ఆధారాలతో సహా నిరూపిస్తున్నాయి. దాంతో ప్రజల్లోనూ వాటిపై వ్యతిరేకత వస్తున్నది. అందువల్ల నాణ్యమైన ముడి పదార్థాలతో రుచికరమైన రెడీ టు డ్రింక్ / సర్వ్ కలబంద పానీయం మంచి ప్రత్యామ్నాయ శీతల పానీయం అవుతోంది.

### తయారీ విధానం

నాణ్యమైన అలోవేరా జ్యూస్‌ను సేకరించాలి. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానం అనుసరించి దానిని రెడీ టు సర్వ్ అలోవేరా జ్యూస్‌గా తయారు చేయవచ్చు. ప్యూర్ కలబంద జ్యూస్‌తోపాటు మామిడి, స్ట్రాబెర్రీ, లిచీ, దానిమ్మ, ఇతర పండ్ల ఫ్లేవర్స్‌ను కూడా చేర్చవచ్చు. సహజ ఆహార రంగులు, ప్రిజర్వేటివ్స్‌లతో రుచికరమైన, ఆరోగ్యకరమైన అలోవేరా జ్యూస్ తయారుచేయవచ్చు. ఒకసారి తాగడానికి వీలుగా 250 మి.లీ. పరిమాణంలో బాటిలింగ్ చేయడంతోపాటు, ఇంట్లో ఫ్రిజ్‌లో ఉంచుకొని తాగడానికి వీలుగా ఒక లీటరు బాటిల్స్ కూడా ప్యాకింగ్ చేసి మార్కెట్‌కు పంపవచ్చు.

### అవసరమైన యంత్రపరికరాలు

సుగర్ సిరప్ తయారీ యంత్రం, మిక్సింగ్ ట్యాంక్, పాశ్చరైజర్, బాటిలింగ్ యంత్రం, వర్కింగ్ టేబుల్స్, ఎస్ఎస్ పాత్రలు మొదలైనవి.

### ముడి పదార్థాలు

ఫుడ్ గ్రేడ్, ఆర్గానిక్ అలోవేరా జ్యూస్ (ఫైబర్ లేకుండా, పల్స్‌ఫైబర్ కూడిన), నేచురల్ ఫ్రూట్ ఫ్లేవర్స్, కలర్స్, ప్రిజర్వేటివ్స్, బాటిల్స్, లేబుల్స్, కార్టూన్ బాక్సులు మొదలైనవి.

### మార్కెట్ అవకాశాలు

నాణ్యమైన పద్ధతిలో తయారుచేసిన కలబంద జ్యూస్‌కు వినియోగదారుల ఆదరణ ఉంటుంది. పాన్‌షాపులు, కిరణా, సూపర్ మార్కెట్స్ ద్వారా వినియోగదారులకు అందుబాటులో ఉంచడం అవసరం. ఆన్‌లైన్ విధానంలో కూడా మార్కెటింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. నాణ్యమైన నూతన ఆహార ఉత్పత్తుల తయారీ పరిశ్రమ పై ఆసక్తి ఉన్న యువతకు రెడీ టు డ్రింక్ / సర్వ్ అలోవేరా జ్యూస్ పరిశ్రమ మంచి స్వయంఉపాధి అవుతుంది.



మైనంపాటి శ్రీనివాసరావు
బిజినెస్ కన్సల్టెంట్
సెల్: 9866119816

### పరిశ్రమ వ్యయం

**ఉత్పత్తి సామర్థ్యం:** వెయ్యి లీటర్లు / రోజుకు
**పరిశ్రమ వ్యయం:** రూ.35 లక్షలు

# SSC CGL TIER-II *MODEL PAPER*

(నిన్నటి స్టడీ తరువాయి)

## ENGLISH LANGUAGE AND COMPREHENSION

**Directions (41-60): A sentence has been given in Active/Passive Voice. Out of the four alternatives suggested below, select the one which best expresses the same sentence in Passive/Active Voice.**

41. India is evolving a new plan to control her population.
(A) A new plan is evolved by India to control her population.
(B) A new plan has been evolved by India to control her population.
(C) A new plan was being evolved to control her population by India.
(D) A new plan is being evolved by India to control her population.

42. We found the lock broken last night.
(A) The lock was found by us breaking last night.
(B) The lock was found broken last night.
(C) The lock was broken by us last night.
(D) The broken lock we found last night.

43. They should shoot the traitor dead.
(A) The traitor should be shot at by them.
(B) The traitor should be shot them.
(C) The traitor should be shot dead .
(D) The traitor is shot by them.

44. Who inaugurated the fair?
(A) The fair was inaugurated by whom?
(B) The fair is inaugurated by who ?
(C) By whom was the fair inaugurated?
(D) By who was the fair inaugurated?

45. When he left school, the textbooks were put aside by him and were never reopened.
(A) After he left school, he put aside his textbooks and they were never reopened
(B) He put aside his textbooks when he left school and never reopened them.
(C) He put aside his textbooks when he left school and were never reopened by him.
(D) He put aside his textbooks as he left school and never reopened.

46. A selfish person foists all his problems on unfortunate friend.
(A) All the problems are foisted by a person on his unfortunate friend.
(B) Foisted on his unfortunate friend the problems of a selfish person.
(C) All his problems are foisted unfortunate friend by a selfish.
(D) All the problems are foisted unfortunate friend by a selfish person.

47. End the war now!
(A) Now must the war be ended.
(B) The war must be ended now.
(C) You must end the war now.
(D) Must the war be ended now.

48. I was constantly being asked for money.
(A) I was constantly asking for money.
(B) They constantly asked for money.
(C) I constantly asked them for money.
(D) They were constantly asking for money.

49. How much a month are you paid?
(A) How much a month do you pay.
(B) In a month how much do you pay.
(C) How much a month do they pay you.
(D) How much a month do you pay them.

50. Someone saw him stealing.
(A) He was seen stealing by someone.
(B) He was seen stealing.
(C) He was seen by one when he is stealing.
(D) He is seen by someone stealing

51. This unexpected news made me numb.
(A) I was made numb by the unexpected news.
(B) I am made numb by the unexpected news.
(C) I have made numb by the unexpected news.
(D) I had been made numb by the unexpected news.

52. The students are rehearsing the play.
(A) The play is being rehearsed by the students.
(B) The play was being rehearsed by the students.
(C) The play is rehearsed by the students.
(D)The play is been rehearsed by the students.

53. The agent had disclosed the secret before it was evening.
(A) The secret was disclosed by the agent before it was evening.
(B) The secret had disclosed by the agent before it had been evening.
(C) The secret had been disclosed by the agent before it was evening.
(D) The secret was disclosed by the agent before it had been evening.

54. Surely the lost child must have been found by now.
(A) Surely must have found the lost child by now.
(B) Surely some one must have found the lost child by now.
(C) Surely now must have found the lost child.
(D) Now must have found the lost child surely.

55. Why did he deprive you of the membership?
(A) Why you were deprived of the membership
(B) Why were you deprived of his membership by him
(C) Why was he deprived of his membership
(D)Why were you deprived of the membership by him.

56. The news has been brought to us by him.
(A) He brought us the news.
(B) He has brought us the news.
(C) He was brought the news to us.
(D) We brought the news to him.

57. The people couldn't move me to the hospital and the doctor operated on me at home.
(A) I couldn't be moved to the hospital and was operated on at home.
(B) I couldn't be moved to the hospital and I had to be operated on at home.
(C) I couldn't be moved to the hospital and I was operated on at home by the doctor.
(D) I couldn't be moved to the hospital by the people and operated on at home.

58. Not a word was spoken by the criminal in self-defence.
(A) The criminal spoke not a word in self-defence
(B) The criminal in self-defence spoke no word.
(C)The criminal did not speak a word in selfdefence.
(D)The criminal spoke in self-defence not a word.

59. They have made a film based on this novel.
(A) A film was based on this novel and made.
(B) A film have been made based on this novel. (C) A film, based on this novel, has been made.
(D) A film has been based and made on this novel.

60. They must keep their word.
(A) Word must kept.
(B) Word must be kept.
(C) Word must keep.
(D) Word must be kept by one.

**Directions (61-85): It the following passage, some of the words have been left out. First read the passage over and try to understand what it**

### *Cloze test 1*

India and 25 other countries agreed to the Copenhagen Accord even as other developing countries accepted it as an irreversible decision later. The Accord came out of....(61).... bargaining lasting almost 20 hours among....(62)... .of governments of some of then most....(63)... countries of the world. At....(64)....of the day on Saturday, India....(65)....to have given ground on some....(66)....but blocked intrusion on other red lines. It had become....(67)....within the first week of the ....(68)....that the best even the four emerging and. . . . (69) . . . . economies of the developing world were going to do was to defend the....(70)...economic resource sharing regimes.

61. (A) difficult (B) hard
(C) easy (D) early
62. (A) rulers (B) kings
(C) heads (D) chiefs
63. (A) influential (B) corrupted
(C) useless (D) beautiful
64. (A) middle (B) evening
(C) night (D) end
65. (A) proved (B) appeared
(C) viewed (D) cleared
66. (A) materials (B) thoughts
(C) issues (D) discussions
67. (A) evident (B) ambiguous
(C) vague (D) indecisive
68. (A) accord (B) talks
(C) issues (D) thoughts
69. (A) economic (B) political
(C) powerful (D) praiseworthy
70. (A) expected (B) existing
(C) resultant (D) consequential

### *Cloze test 2*

The inevitable effect of mechanical production is uniformity, and although uniformity may lead to monotony, it need not lack beauty. In fact, modern improvement in popular....(71)....is mainly the result of better design ....(72).... standardised, goods; and the average ....(73)....is buying better designed goods, because those goods are....(74)...., because the problem of taste has been . .. .(75). .. .for him. Good taste is not always....(76)....and most people manage to get,...(77)....without it. It is fortunate, therefore, that so many of the....(78)....of life are now chosen for us by....(79).... Even among luxuries, the margin for....(80)....taste is constantly being reduced.

71. (A) craft (B) technology
(C) ideas (D) taste
72. (A) on (B) of
(C) in (D) for
73. (A) shopper (B) client
(C) man (D) businessmen
74. (A) gaudy (B) accessible
(C) reliable (D) durable
75. (A) tackled (B) simplified
(C) resolved (D) solved
76. (A) genuine (B) laboured
(C) impulsive (D) inborn
77. (A) ahead (B) along
(C) through (D) around
78. (A) amenities (B) comforts
(C) luxuries (D) necessities
79 (A) connoisseurs (B) artists
(C) experts (D) scientists
80. (A) local (B) particular
(C) impersonal (D) personal

### *Cloze test 3*

One of the major causes of the fai lure of...(81)....countries on the economic front istheir....(82)....to evolve a judicious mixture of....(83)....substitution and export promotion. Today, Bambia ....(84)....on imports after its independence 20 years ....(85)....

81. (A) advanced (B) advancing
(C) developed (D) developing
82. (A) handicap (B) disadvantage
(C) inability (D) incapacity
83. (A) import (B) export
(C)scientific (D) invention
84. (A) banked (B) traded
(C) carried (D) expected
85. (A) since (B) ago
(C) earlier (D) back

| KEY | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | | 53. C | 60. B | 67. A | 74. C | 81. D |
| 41. D | 47. B | 54. B | 61. A | 68. B | 75. A | 82. C |
| 42. B | 48. D | 55. D | 62. C | 69. C | 76. D | 83. A |
| 43. C | 49. C | 56. B | 63. A | 70. B | 77. B | 84. C |
| 44. C | 50. A | 57. C | 64. D | 71. B | 78. C | 85. B |
| 45. B | 51. A | 58. A | 65. B | 72. B | 79. C | |
| 46. A | 52. A | 59. C | 66. C | 73. A | 80. D | |

**పై ప్రశ్నపత్రాన్ని 'నంద్యాల అకాడమి' నిపుణుల బృందం రూపొందించింది.**

(మిగతా రేపటి స్టడీలో)

## అడ్మిషన్స్

### జెఎన్‌టియు అనంతపురం

**జ**వహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జెఎన్‌టియు) అనంతపురం 2017-18 సంవత్సరానికి పిహెచ్‌డి ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

x పిహెచ్‌డి, ఎంఫిల్, ఎంఎస్(రీసెర్చ్)

**విభాగాలు:** ఇంజనీరింగ్, సైన్సెస్, మేనేజ్‌మెంట్, హ్యూమానిటీస్

**అర్హత:** సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత.

**ఎంపిక:** ప్రవేశ పరీక్ష ద్వారా. యుజిసి/సిఎస్ఐఆర్/జెఆర్ఎఫ్/నెట్/స్లెట్/గేట్/జీప్యాట్/ఎంఫిల్ ఉన్నవారికి ప్రవేశ పరీక్ష నుంచి మినహాయింపు ఇస్తారు.

**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా

**చివరి తేదీ:** 2018 ఫిబ్రవరి 1

**వెబ్‌సైట్:** http://jntua.ac.in/

## స్కాలర్‌షిప్

**న్యూ**ఢిల్లీలోని సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్సెస్ & ట్రైనింగ్ స్కాలర్‌షిప్స్ కోసం దరఖాస్తులు కోరుతోంది.

**కల్చరల్ టాలెంట్ సెర్చ్ స్కాలర్‌షిప్ స్కీమ్-2018**

**స్కాలర్‌షిప్స్ సంఖ్య:** 650

జనరల్ స్కాలర్‌షిప్స్: 375, ట్రెడిషనల్ ఆర్టిస్ట్ ఫ్యామిలీస్: 125, ట్రైబల్ కల్చర్/ ఎస్టీ స్టూడెంట్స్: 100, డిఫరెంట్లీ ఏబుల్డ్: 20, క్రియేటివ్ రైటింగ్/లిటరసీ ఆర్ట్స్: 30

**స్కాలర్‌షిప్:** సంవత్సరానికి రూ.3,600. ప్రత్యేక శిక్షణ ట్యూషన్ ఫీజుల కింద సంవత్సరానికి రూ.9,000 రీయింబర్స్ చేసుకోవచ్చు. **విభాగాలు:** మ్యూజిక్, డాన్స్, డ్రామా, పెయింటింగ్, స్కల్ప్చర్, క్రాఫ్ట్స్, లిటరరీ ఆర్ట్స్.

**దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్. **చివరి తేదీ:** 2018 జనవరి 31

**ఉచిత దరఖాస్తు ఫారం, ఇతర వివరాలకు:** CCRT Regional Centre, Opp CII, New Google Office, Madhapur to Kondapur Main Road, Madhapur, Hyderabad - 500084. **చిరునామా:** Centre For Cultural Resources And Training, Plot No. 15 A, Sector - 7, Dwarka, New Delhi - 110075

**వెబ్‌సైట్:** www.ccrtindia.gov.in

### విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



**ఎర్రుపాలెం, జనవరి 6:** విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతల రమేష్ డిమాండ్ చేశారు. శనివారం ఎర్రుపాలెం ఎస్‌జేకేఎం జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో ఎస్ఎఫ్ఐ ముందుండి పోరాడుతుందన్నారు.

# అనర్హులకూ కల్యాణలక్ష్మి చెక్కులా?

**• పంపిణీ సమయంలో విస్తుపోయిన ప్రజలు • ఇదీ రెవెన్యూ అధికారుల ఘనకార్యం**

**మధిర టౌన్, జనవరి 6:** మధిరలో శుక్రవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో రెవెన్యూ అధికారుల తీరు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క, ఎంపీపీ వేమిరెడ్డి వెంకట్రావమ్మ, చైర్‌పర్సన్ నాగరాణి, జడ్పీటీసీ సభ్యురాలు ప్రియాంక, తహసీల్దార్ మంగీలాల్ చేతులమీదుగా ఒక లబ్ధిదారుడికి అందించిన చెక్కు విస్మయం కలిగించేలావుంది. మధిరలోని రెండోవార్డులో ఇంటినెంబర్ 1-784/1 యజమాని బంకూరి వెంకటేశ్వర్లుకు మూడుపోర్షన్లు కల్గిన రెండంతస్థుల బిల్డింగ్‌తోపాటు మధిరలోని వైరా రోడ్డులో నాపరాళ్లు, సిమెంట్‌వరలు, పైపుల వ్యాపారంవుంది. ఇతను ఇంటిపన్ను కిందనే సంవత్సరానికి నగరపంచాయతీకి రూ. 3,600 పన్ను చెల్లిస్తున్నాడు. ఇటీవల వెంకటేశ్వర్లు తన కుమార్తె మానసకు ఘనంగా వివాహం జరిపించాడు. ప్రభుత్వం అందించే కల్యాణలక్ష్మి పథకానికి తన భార్య నాగలక్ష్మితో దరఖాస్తు చేయించాడు. దరఖాస్తుదారుని ఆర్థిక పరిస్థితి ఆవీధిలో ఉన్నవారందరికీ తెలిసినా రెవెన్యూ వారికి మాత్రం తెలియలేదు. లబ్ధిదారుడు తన వ్యాపారం చేసే రేకుల షెడ్డునే ఇల్లుగా చూపి గతంలో ఆహారభద్రత కార్డు తీసుకోవడంతో దాని ఆధారంగానే రెవెన్యూ అధికారులు దరఖాస్తును ధ్రువీకరించారు. ఈమేరకు ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధుల చేతులమీదుగా నాగలక్ష్మికి (ఎస్‌బీఐ చెక్కు నెం.865002తో) రూ.51 వేల విలువచేసే చెక్కును అందజేశారు. నిరుపేదలకు దక్కాల్సిన ప్రభుత్వ పథకం దుర్వినియోగమవుతుండటంతో పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈవిషయమై తహసీల్దార్ మంగీలాల్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా విచారణ నిర్వహించి అనర్హులైతే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నాగలక్ష్మికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే,



వెంకటేశ్వర్లు రేకులషెడ్డు,



లబ్ధిదారుని కుటుంబం పేరుతో ఉన్న ఇల్లు

### కోర్టును సందర్శించిన జిల్లా అదనపు జడ్జి



కోర్టును సందర్శించిన జిల్లా అదనపు జడ్జి

**మధిర, జనవరి 6:** అదనపు జిల్లా జడ్జి ఎన్.ప్రేమలత శనివారం మధిర జూనియర్ సివిల్‌జడ్జి కోర్టును సందర్శించారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వార్షిక తనిఖీల్లో భాగంగా జడ్జి పర్యటనకు వచ్చారు. జిల్లా జడ్జికి న్యాయమూర్తి రాజేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసంశెట్టి కోటేశ్వరరావు, సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, పోలీసు అధికారులు గౌరవ వందనంతో స్వాగతం పలికారు. అనంతరం కోర్టు రికార్డులను జిల్లా జడ్జి పరిశీలించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డుల పరిశీలన చేయటం జరిగిందని కోర్టు అధికారులు తెలిపారు.

## పంపు కనెక్షన్ల వద్ద ఆటోమేటిక్ స్టాటర్ల తొలగింపు

**బోనకల్, జనవరి 6:** మండలంలోని రావినూతల, రామాపురం గ్రామాలలో శనివారం వ్యవసాయ బావుల వద్ద ఆటోమేటిక్ స్టాటర్లను వ్యవసాయాధికారి వాహిని తొలగించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకోసం నిరంతర విద్యుత్‌ను ఇస్తోందన్నారు ఇందులోభాగంగా బావులవద్ద ఉన్న స్టాటర్లను అందరూ తొలగించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో రైతుసమితి జిల్లా సభ్యులు మందడపు తిరుమలరావు, మండల కోఆర్డినేటర్ వేమూరి ప్రసాద్, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.



స్టాటర్లను తొలగిస్తున్న ఏవో

## కందిసాగులో మెళకువలు తెలుసుకోవాలి: శాస్త్రవేత్త డా.శివాని

**ఎర్రుపాలెం, జనవరి 6:** రైతులు కందిసాగులో మెళకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మధిర వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డాక్టర్ శివాని సూచించారు. శనివారం బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పూత, కాపు దశలో వ్యవసాయ అధికారుల నుంచి సలహాలు తీసుకొని సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ రైతులకు బిందుసేద్యంపై వందశాతం రాయితీలు ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు విజయనిర్మల, మణిమాల, శ్రీనివాసరావు, ఏఈవోలు ధాత్రి, బాలకృష్ణ, జిష్ణు, సుష్మ, సాధన, రైతునాయకులు వెంకట్రామిరెడ్డి, వేమిరెడ్డి త్రివేణి, సర్పంచ్ యరమల శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

## బస్వాపురంలో డబుల్ లబ్ధిదారుల ఎంపిక

**చింతకాని, డిసెంబర్ 6:** మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో శనివారం నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులను లాటరీ పద్ధతిలో అధికారులు ఎంపిక చేశారు. గ్రామంలో నూతనంగా 20 ఇళ్లు నిర్మించగా మొత్తం 180 మంది లబ్ధిదారులు ఇళ్లకోసం దరఖాస్తులు చేసుకున్నారు. మూడురోజులు గ్రామంలో అధికారులు పర్యటించి దరఖాస్తులను క్షుణ్ణాంగా పరిశీలించారు. 180 అర్హులైన లబ్ధిదారులలో అఖిల పక్షం, గ్రామస్థుల సమక్షంలో తహసీల్దార్ కారుమంచి శ్రీనివాసరావు, ఎంపీడీవో నవాబ్‌పాషా సంబంధిత లబ్ధిదారులలో ఒకరితో లాటరీ తీయించి 20 మందిని ఎంపికచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు సుగణమ్మ,అన్ని రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు,



లాటరీ తీస్తున్న దృశ్యం

## పల్స్‌పోలియోపై కళాజాత

**ఎర్రుపాలెం, జనవరి 6:** మండలపరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈసందర్భంగా హెల్త్‌అసిస్టెంట్ లంకా కొండయ్య కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించి పోలియోపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరాల సంజీవరెడ్డి, సీహెచ్‌వో ప్రసన్నకుమారి, జయలక్ష్మి, డి.సాయిరెడ్డి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

### రైతు కుటుంబాలకు బీమా చెక్కుల పంపిణీ

**సత్తుపల్లి, జనవరి 6:** సత్తుపల్లి మండలం కిష్టారం సొసైటీ పరిధిలో గ్రూప్ ఇన్సూరెన్స్ చెక్కులను సొసైటీ అధ్యక్షుడు బొమ్మారెడ్డి విజయకుమార్‌రెడ్డి శనివారం పంపిణీ చేశారు..

## జమలాపురం ఆలయంలో డీఆర్‌వో పూజలు

**ఎర్రుపాలెం, జనవరి 6:** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. జమలాపురానికి చెందిన తుళ్లూరి సీతారామయ్య అన్నదానానికి వితరణ చేశారు. డీఆర్‌వో వెంట వీఆర్‌వోల సంఘం అధ్యక్షుడు గంటా శ్రీనివాసరావు, వీఆర్‌వో చంద్రన్నగౌడ్, వీఆర్ఏ బాజీ, ఆలయ ఈవో ఏవీ.రమణమూర్తి, ఆలయ చైర్మన్ ఉప్పల శివరాంప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్‌శర్మ, సిబ్బంది విజయకుమారి, ఆంజనేయులు, సోమయ్య పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న డీఆర్‌వో శ్రీనివాస్

### మీ సేవలో 'ఆంధ్రజ్యోతి'

పాఠకులకు 'ఆంధ్రజ్యోతి'ని మరింత చేరువ చేయడానికి స్థానిక విలేకరుల ఫోన్ నంబర్లను ఇస్తున్నాం.. అవినీతి, అక్రమాల సమాచారాన్ని అందించండి. మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం

| | |
|---|---|
| మధిర | 9985411342 |
| మధిర టౌన్ | 9491890567 |
| మధిర రూరల్ | 9963852263 |
| బోనకల్ | 9701255161 |
| ఎర్రుపాలెం | 9618415904 |
| వైరా | 9866316711 |
| చింతకాని | 9492104828 |
| ముదిగొండ | 9866492332 |

### సినిమాలు

మధిర

| | |
|---|---|
| • శాంతి | ఎంసీఏ |
| • శ్రీలక్ష్మి శ్రీనివాస | ఒక్క క్షణం |
| • వాసవి | ............ |

# గ్రూపు సభ్యుల వివాదంతో నిలిచిపోయిన మధ్యాహ్న భోజనం

**• పాఠశాలలో ఘర్షణ • ఎస్ఐ జోక్యంతో ఆందోళన విరమణ • ఉప్మా వండిపెట్టిన ఉపాధ్యాయులు**

**బోనకల్, జనవరి 6:** భోజన తయారీ గ్రూపు సభ్యుల మధ్య ఘర్షణ చినికి చినికి గాలివానాలా మారటంతో బోనకల్ మండలం జానకీపురం ఉన్నతపాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనం నిలిచిపోయింది. గ్రామంలోని రాజకీయ నాయకులు, డ్వాక్రా గ్రూపులు, ఎస్‌సీ కాలనీ వాసులు అక్కడకు చేరుకోవడంతో పాఠశాల ప్రాంగణం రణరంగంగా మారింది. ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి పాఠశాలకు వచ్చి ఆందోళనను విరమింపజేశారు. వంట ఎవ్వరూ వండకపోవడంతో విద్యార్థులు ఆకలితో అలమటించారు. చివరకు ఉపాధ్యాయులే ఉప్మా చేయించి విద్యార్థులకు వడ్డించారు. కొంతకాలంగా పాఠశాలలో భోజన గ్రూపుల మధ్య వివాదం కొనసాగుతోంది.

**అసలు వివాదమేమిటంటే...**

పాఠశాలలో కొంతకాలంగా సంధ్యా గ్రూపు సభ్యులైన బొల్లెపోగు పద్మ, మార్తమ్మ, విజయమ్మ మధ్యాహ్న భోజనం తయారుచేస్తున్నారు. రెండునెలలక్రితం అదే గ్రూపులోని మిగిలిన సభ్యులు ఇక తాము వండుతామని ముందుకొచ్చారు. దీంతో వారు అందిస్తున్న భోజనానికి సంబంధించి బిల్లులు గతంలో వంటచేసిన వారిఖాతాలో జమ అవుతున్నాయి. దీనికితోడు పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ భోజన తయారీని పద్మ, మార్తమ్మ, విజయమ్మ చేసేట్టు తీర్మానంచేశారు. దీంతో వారు వంట చేసేందుకు రాగా ప్రస్తుతం చేసే వారు అడ్డుకున్నారు. ఇరువర్గాలకు మద్దతుగా గ్రామంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు రావడంతో ఘర్షణ జరిగింది. సోమవారం పరిష్కరించేలా చూస్తానని ఎస్ఐ హామీ ఇవ్వడంతో వివాదం సమసింది.





గ్రూపు సభ్యులను వారిస్తున్న ఎస్ఐ ఇంద్రాసేనారెడ్డి, విద్యార్థులకు ఉప్మా వడ్డిస్తున్న దృశ్యం

## మాదిగ జేఏసీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మధు

**వైరా, జనవరి 6:** తెలంగాణ మాదిగ జేఏసీ వైరా నియోజకవర్గ ఇన్ చార్జిగా పాపగంటి మధు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైరా మండలం గొల్లపూడి గ్రామంలో శనివారం మాదిగ జేఏసీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల మురళీ పర్యవేక్షణలో మధు ఎన్నిక జరిగింది. సమావేశంలో వైరా పట్టణ అధ్యక్షుడు పూర్ణకంటి సైదుబాబు, మండల అధ్యక్షుడు కన్నెకంటి రవి, ఆదూరి బాబు, మామిడాల నవీన్, రాయల నరేష్, మరికంటి వెంకయ్య, వరికూటి బెంజి, కిషోర్, టి.నాగరాజు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టుల గడ్డ తనికెళ్ల

- సీపీఐ నేత టీవీ చౌదరి

**కొణిజర్ల, జనవరి6:** కమ్యూనిష్టుల గడ్డగా తనికెళ్ల గ్రామంకు ఇప్పటికి మంచి పేరు ఉందని, ఎంతో మంది అమరవీరులు పార్టీ కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడారని సీపీఐ రాష్ట్రనాయకులు టీవీచౌదరి అన్నారు. శనివారం తనికెళ్లలోని తుల్లూరు పెద్దసత్యం వర్దంతి సభను నిర్వహించారు. సత్యం చనిపోయేంవరకు పార్టీ కోసమే తపించాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి భాగం హేమంతరావు, మండల కార్యదర్శి పివిరావు, అడపా రామకోటయ్య, గడల సీతారామయ్య, తుల్లూరు తులిశమ్మ, లాల్‌సింగ్, అంజయ్య, సత్యం, మంగపతిరావు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డుకు శంకుస్థాపన

**వైరా, జనవరి 6:** వైరా ఇందిరానగర్‌కాలనీ(శాంతినగర్)లో ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు జడ్పీటీసీ సభ్యురాలు బొర్రా ఉమాదేవి, ఎంపీపీ బొంతు సమత శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లీశ్వరి, టెలికాం అడ్వయిజరీ కమిటీ మెంబర్ సూతకాని జైపాల్, ఎంపీటీసీ ముళ్లపాటి సీతారాములు, 11వ వార్డు సభ్యుడు మోదుగు లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ తేలుప్రోలు నర్సింహారావు, నాయకులు మిట్టపల్లి నాగి, చింతనిప్పు సుధాకర్, కరిసె విఠల్‌రావు, కొమ్ము నాగేశ్వరరావు, కరిసె రమేష్, మచ్చా రామారావు, రేచర్ల సత్యం, అయిలూరి మోహన్‌రెడ్డి, పోలా శ్రీను, దార్ల శేఖర్, షేక్.ఖాదర్, పణితి సైదులు, షేక్.రహీం, పర్సా రవి పాల్గొన్నారు.

### కోదండ రామాలయంలో అన్నదానం

**వైరా, జనవరి 6:** వైరాలోని శ్రీకోదండ రామాలయంలో శనివారం మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 41రోజులుగా కోదండరామాలయంలో అయ్యప్పమాల ధారణ గురుస్వాములు అన్నదానాన్ని నిర్వహించారు. సొంతఖర్చులను భరించి, కొందరు దాతల నుంచి విరాళాలు వసూలు చేసి ఈ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# నాటి ఖాజోర్‌పాలెమే నేటి అమ్మపాలెం

- అమ్మపాలెం గ్రామంపై కథనం




అమ్మపాలెం గ్రామం వ్యూ

**కొణిజర్ల, జనవరి 6:** పూర్వకాలం నుంచి నేటి పాతరికార్డుల్లో కూడ అమ్మపాలెం గ్రామం పేరు ఖాజోర్‌పాలెం గా ఉంది. ఆ నాటి కాలంలో గ్రామంలో ఖాజీదొర ఉండేవాడు. అతనే గ్రామాన్ని పాలించేవాడని గ్రామస్థులు అంటున్నారు. దాంతో గ్రామానికి ఖాజీపాలెం అని దొర పేరు పెట్టిన్నట్లు తెలిసింది. ఆ తార్వత ఖాజోరపాలెం అని గ్రామస్థులు పిలుచుకున్నారు. ఆ తర్వాత రాను రాను ఖాజీర్‌పాలెం నుంచి అమ్మపాలెంగా మారిందని తెలుపుతున్నారు. అమ్మపాలెంగా మారటానికి ఖాజీదొర పేరును మరిచిపోతున్న సమయంలో కీసరలచ్చమ్మ అనే ఆమె కొణిజర్ల మండలం రామనర్సయ్యనగర్, తుమ్మలపల్లి, అన్నవరం, ప్రాంతాల మీదగా అమ్మపాలెం వరకు అక్కడ నుంచి చింతకాని మండలం చింతకాని, నాగులవంచ వరకు వ్యవసాయం చేసిందని ఆ సమయంలో ఆమె భోజనం సమయానికి అమ్మపాలేనికి చేరుకొని అంబలి తయారుచేసుకొని తాగేదని తెలుపుతున్నారు. అంబలి తయారు చేసుకుంటూ వ్యవసాయం చేసేది కనుక ఆ అంబలి పేరుతోనే అమ్మ అయిందని, ఖాజోర్‌పాలెంలో ఖాజోర్‌తీసి మిగిలిన పాలేనికి ఆ అమ్మను కలపడంతో అమ్మపాలెం అని పిలుస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. ఖాజీదొర, కీసరలచ్చమ్మ ఇద్దరు వలన గ్రామంకు ఆ పేరు వచ్చిన్నట్లు తెలుపుతున్నారు. గ్రామంలో నాటి పదుల సంఖ్యలో ఉన్న జనాభా నేడు సుమారు 2500 లకు పైగా పెరిగింది. గ్రామంలో 1900 మంది ఓటుహక్కును వినియోగించుకుంటున్నారు. ఇప్పటికి కూడ అమ్మపాలెం గ్రామం బోర్డులు పెడుతున్నప్పటికి పాతరికార్డుల్లో మాత్రం ఖాజోర్‌పాలెం అని, ఖాజీఅమ్మపాలెం అని పేర్లు కనిపిస్తూనే ఉన్నాయి. 'ఆంధ్రజ్యోతి' ద్వారానైన మా గ్రామ చరిత్రను తెలుసుకుంటున్నామని పలువురు ఆనందం వ్యక్తం చేశారు.

## చేతిపంపు నిర్మాణానికి శంకుస్థాపన



చేతిపంపు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

**వైరా, జనవరి 6:** వైరాలోని 17వ వార్డులో ఎమ్మెల్యే మదన్‌లాల్ నిధులతో రాజశేఖర్‌నగర్‌లో ఏర్పాటుచేసిన చేతిపంపు నిర్మాణానికి శనివారం సర్పంచ్ బాణోతు వాలి, వైస్‌ఎంపీపీ తన్నీరు జ్యోతి శంకుస్థాపన చేశారు. టీఆర్ఎస్ నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు, తన్నీరు నాగేశ్వరరావు, సూర్యదేవర శ్రీధర్, మాదినేని ప్రసాద్, బాణోతు కృష్ణ, మిట్టపల్లి సత్యంబాబు, షేక్.పాషా, బత్తుల లింగారావు, రాము, అప్పారావు, తిరుపతిరావు, పొట్లపల్లి నాగేశ్వరరావు, తన్నీరు కిషోర్, విలాసాగరం వెంకటేశ్వరరావు, నరేష్, కాంపల్లి గోపి పాల్గొన్నారు.

## 'మోడల్'లో మానెటరింగ్ సభ్యుల తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

**కారేపల్లి, జనవరి 6:** తెలంగాణ మోడల్ పాఠశాలలను శనివారం రాష్ట్ర మానటరింగ్ కమిటి అధికారులు పరిశీలించారు. పాఠశాలలో పలు విభాగాల్లో పరిశీలన చేశారు. ప్రధానంగా పాఠశాలకు వస్తున్న విద్యార్థుల బ్యాగులకు సంబందించిన బరువులపై సిబ్బందితో పాటు విద్యార్థులను అడిగితెలుకున్నారు.అధిక బరువుతో కలిగిన బ్యాగులతో పాఠశాలకు రావద్దంటు అవసరమైనా పుస్తకాలను మాత్రమే తెచ్చుకోవాలన్నారు.పాఠశాల ప్రిన్సిపాల్ ఎండీ అక్తర్‌తో మాట్లాడారు. రాష్ట్రటీం సభ్యులు పోట్ల వెంకటప్పయ్య, జిల్లాటీం సభ్యులు నున్న అప్పారావు బృందంలో ఉన్నారు.

# హోరాహోరీగా కబడ్డీ పోటీలు

**ఏన్కూరు, జనవరి 6:** మండల పరిధిలోని గంగుల నాచారం గ్రామంలో పెద్దమ్మతల్లి, గణేష్‌యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60టీంలు రాగా శనివారం రాత్రి వరకు ఇంకా పూర్తికాలేదు. భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, మహబూబాబాద్, ఖమ్మం జట్ల మధ్య హోరాహోరీ పోటీ జరుగుతుంది. కబడ్డీ పోటీలు ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుగుతున్నాయి. కబడ్డీ పోటీలను చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ పోటీలు అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశముంది. కార్యక్రమంలో నిర్వాహకులు సుధీర్‌కుమార్, వినోద్‌కుమార్, జూలూరుపాడు జడ్పీటీసీ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, ఏన్కూరు ఏఎంసీ వైస్‌చైర్మన్ ముక్తి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు వెంకటముత్తమ్మ, రేసు వెంకయ్య, ఆదివాసీ సంక్షేమపరిషత్ జిల్లా కార్యదర్శి సుధీర్‌కుమార్, నాయకులు నాగరాజు, ఉద్యోగసంఘ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న దృశ్యం

# రాహుల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

- టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జ్ రాందాస్‌నాయక్, కారేపల్లి మాజీ ఎంపీపీ దేవ్లా నాయక్



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్, ఎంపీ రేణుకాచౌదరి

**వైరా, జనవరి 6:** ఇప్పటివరకు వైరా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా పనిచేసిన మాలోతు రాందాస్‌నాయక్ శనివారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావుతో కలిసి శుక్రవారం ఢిల్లీ వెళ్లిన రాందాస్‌నాయక్ రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి ఆధ్వర్యంలో పోట్లతో పాటు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వైరా నియోజకవర్గంలోని మరికొంతమంది నేతలు కూడా కాంగ్రెస్‌లో చేరారు.

**కారేపల్లి, జనవరి 6:** రెండు రోజుల క్రితం టీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన పలువురు టీఆర్ఎస్ నాయకులు శనివారం ఎంపీ రేణుకా చౌదరి ఆధ్వర్యంలో ఢిల్లీలో రాహుల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎంపీపీ బాణోత్‌దేవ్లనాయక్, అడ్డగోడ అయిలయ్య, రైతు సమన్వయ కమిటి మండల సభ్యుడు దమ్మలపాటి ప్రసాదుతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, చాగంటి లక్ష్మణ్‌రావు, పగడాల మోహన్‌కృష్ణ తదితరులు వున్నారు. ఈసందర్భంగా వారంత కాంగ్రెస్‌లో చేరేందుకు ఢిల్లి వెళ్లినట్లు తెలిసింది.

## సంక్షిప్తం

### కాంగ్రెస్ క్యాలెండర్ ఆవిష్కరణ

**కొణిజర్ల, జనవరి6:** కొణిజర్లలో శనివారం కాంగ్రెస్ క్యాలెండర్‌ను వైరా మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ సూరంపల్లి రామారావు, నాయకులు బాదావత్ సైదులునాయక్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో కాంగ్రెస్‌కు మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెల్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### నలుగురి బైండోవర్

**కారేపల్లి జనవరి 6:** మండలం పరిధిలోని సారా తయారు చేస్తున్న నలుగురిపై ఎక్సైజ్ శాఖ అధికారులు తహసీల్దార్ శ్రీనివాస్‌రావువద్ద బైండోవర్ చేశారు. గాంధీనగరానికి చెందిన తురక ఉమా, ఉసిరికాయలపల్లికి చెందిన లాకవత్ శ్రీను, గాదెపాడుకు చెందిన మోతీలాల్, బాల్యాలను తహసీల్దార్ ఎదుట హాజరుపర్చారు. ఎక్సైజ్ ఎస్ఐ బాబు, సిబ్బంది హనుమంత్, గంగా పాల్గొన్నారు.

### 'రిజర్వాయర్‌ను సాగర్‌జలాలతో నింపాలి'

**వైరా, జనవరి 6:** వైరా రిజర్వాయర్‌ను సాగర్‌జలాలతో నింపాలని టీమాస్ జిల్లా నాయకుడు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం టీమాస్‌ఫోరం అధ్యయనం, ప్రచార జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్‌కు సాగర్ జలాలు వెంటనే విడుదల చేయాలన్నారు. నాయకులు తోట నాగేశ్వరరావు, సుంకర సుధాకర్, బోడేపూడి వీరభద్రం, తూము సుధాకర్, కొప్పుల వెంకటేశ్వర్లు, నల్లమోతు వెంకటనారాయణ, బాజోజు రమణ, ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి పోరాడాలి

రైతాంగానికి గిట్టుబాటు ధరలు, ప్రజాసమస్యల పరిష్కారం కోసం సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఎం జిల్లాకమిటీ సభ్యుడు బొంతు రాంబాబు అన్నారు. శనివారం వైరా మండలం గొల్లెనపాడులో తెలంగాణ సాయుధ పోరాటయోధుడు కొణిధన సత్యనారాయణ 19వ వర్ధంతిసభలో మాట్లాడారు.

### 'ఉపాధి కోసం యువత పోరాడాలి'

**వైరా, జనవరి 6:** యువత ఉద్యోగ, ఉపాధి కోసం పోరాడాలని పీవైఎల్ రాష్ట్ర నాయకుడు షేక్.లాల్‌మియా పిలుపునిచ్చారు. శనివారం జరిగిన పీవైఎల్ వైరా మండల మహాసభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో 50లక్షలమంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

### 11నుంచి జిల్లాస్థాయి క్రికెట్

**వైరా, జనవరి 6:** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని తమ గురువు గంధం మల్లికార్జున్‌రావు జ్ఞాపకార్థం 11నుంచి వైరాలో జిల్లాస్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని విక్టరీ బాయ్స్ క్రికెట్‌క్లబ్ ప్రకటించింది. శ్రీనికేతన్ స్కూల్‌కు సమీపంలోని పామాయిల్ తోట గ్రౌండ్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపింది.

# ‘మిషన్‌భగీరథ’ దేశానికే ఆదర్శం

- సీఎం కేసీఆర్ నమ్మకాన్ని నిలబెడదాం
- ఉగాది కల్లా అన్ని గ్రామాలకూ తాగునీరు సరఫరా
- ఆర్అండ్‌బీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- స్మితాసబర్వాల్, ప్రశాంత్‌రెడ్డితో కలిసి పనుల పరిశీలన

**(ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం), అశ్వాపురం జనవరి6:** మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శమని ఆర్అండ్‌బీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం అశ్వాపురం మండలం పాముపల్లి సమీపంలోని రథంగుట్ట వద్ద మిషన్ భగీరథ పనులను సీఎంవో ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్, మిషన్‌భగీరథ వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డితో కలిసి పరిశీలించారు.

**పనులు త్వరితగతిన పూర్తి చేయాలి**
**ఆర్అండ్‌బీ మంత్రి తుమ్మల**

ఈసందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో కలిసి పనులను పర్యవేక్షించారు. పనుల్లో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఉగాది నాటికి ఇంటింటికీ తాగునీరు అందజేయాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పూసూరు, దుమ్ముగూడెం, పాలేరు, వైరా లో ఇన్‌టేక్‌వెల్‌లను నిర్మిస్తున్నట్టు వివరించారు. నాలుగు ఇన్‌టేక్‌వెల్‌ల పనులు పూర్తి కావొచ్చాయన్నారు. వీటిల్లో వైరా,పాలేరులో ప్రయోగాత్మక పరుగు దశలో ఉన్నాయన్నారు. ఫిబ్రవరి నాటికి అన్ని సెగ్మెంట్లలో ట్రయల్ రన్ నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగానే పనులను పరిశీలిస్తున్నామన్నారు. మిట్టగూడెం రథంగుట్ట, కనకగిరిగుట్టల వద్ద కొన్ని అవాంతరాల మూలంగా పనులు జాప్యం జరుగుతోందని.. అక్కడ కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కల్వర్టుల వద్ద నిర్లక్ష్యంగా పనులు చేయడాన్ని ఆయన తీవ్రంగా పరిగణించారు. పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు**
**మిషన్‌భగీరథ వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి**



మిషన్‌భగీరథ పనుల్లో అలసత్వం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని మిషన్‌భగీరథ వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పథకం తీరుతెన్నులపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. మిషన్‌భగీరథ ముఖ్యమంత్రి కేసీఆర్ మానస పుత్రికని, ఆడబిడ్డ నెత్తిమీద బిందె పెట్టుకొని తాగునీళ్ల కోసం రోడ్డెక్కొద్దన్న లక్ష్యంతో రూ. 42వేల కోట్లతో మిషన్‌భగీరథ పథకానికి రూపకల్పన చేశామన్నారు. పది నాటికి జిల్లాలోని పూసూ రు సెగ్మెంట్‌లో 147 గ్రామాలకు, పాలేరు సెగ్మెంట్‌లో 370 గ్రామాలకు 20వ తేదీ నాటికి బల్క్‌వాటర్ సరఫరా చేస్తామన్నారు. 25న ట్రయల్ రన్ నిర్వహించి వైరాలో 460 గ్రామాలకు, నెలాఖరు నాటికి ట్రయల్ రన్ నిర్వహించి దుమ్ముగూడెంలో 1,480 గ్రామాలకు నీరు సరఫరా చేస్తామన్నారు. పనుల తీరును ఎప్పటికప్పుడు తనకు, మంత్రి తుమ్మలకు, స్మితాసబర్వాల్‌కు ఫొటోలు, వీడియో తీసి పంపాలన్నారు. పనులు సకాలంలో పూర్తి చేస్తేనే కాంట్రాక్ట్ సంస్థలకు పేరొస్తుందన్నారు. మిషన్ భగీరథ బృహత్తర పథకమని ఇది కాంట్రాక్టర్లు, అధికారులు గుర్తుఎరగాల న్నారు, సమీక్షసమావేశంలో పినపాక ఎమ్మె ల్యే పాయం వెంకటేశ్వర్లు, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి స్మితాసబర్వాల్, జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతు, భద్రాచలం సబ్‌కలెక్టర్ పమెలా సత్పథి, ఖమ్మం జేసి వినయ్‌కృష్ణారెడ్డి, ప్రాజెక్ట్ ఈఎన్‌సీ సురేందర్‌రెడ్డి, సీఈ విజయ్‌పాల్ రెడ్డి, ఎస్ఈ శ్రీనివాసు, ఈఈ రవీందర్, కన్సల్టెన్సీ ఈఈ సురేష్‌కుమార్, డీఈ యేసుబాబు, బూర్గంపాడు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజయనిర్మల అశ్వాపురం జడ్పీటీసీ లత పాల్గొన్నారు.





పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అధికారులతో చర్చిస్తున్న స్మితాసబర్వాల్

# ‘భగీరథ’ పనులు వేగవంతం చేయాలి

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- ప్రాజెక్టు వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి
- ఉగాదికి ఇంటింటికి తాగునీరు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



తిరుమలాయపాలెం మండలంలోని మాదిరిపురం వద్ద మిషన్ భగీరథ పనులు పరిశీలిస్తున్న దృశ్యం

**తిరుమలాయపాలెం జనవరి 6:** రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పదకంద్వారా ఇంటింటికి పరిశుభ్రమైన నదీజిలాలను అందిస్తున్నట్టు మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. శనివారం తిరుమలాయపాలెం మండలంలోని మాదిరిపురం వద్ద మిషన్ భగీరథ పనులు పర్యవేక్షణలో భాగంగా ఆర్ అండ్‌బీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక కార్యదర్శి స్మితాసబర్వాల్‌తో కలిసి అధికారులు, ఏజెన్సీ బాధ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల ప్రశాంతరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని సాహసం సీఎం కేసీఆర్ చేశారన్నారు. భగీరథ మొదటి దశ పనులు పూర్తయ్యాయని, ఈ నెలచివరినాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ మిగిలిన పనులు చేయాలని ఆదేశించారు. పనులు నిర్వహణలో అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకంటాన్నారు. పంపుహౌజ్ వాటర్‌పంపు మోటార్ల బిగింపులో అలసత్వం వహించవద్దని హెచ్చరించారు. ఆదివారం నుంచి పనులు వేగవంతం చేయాలని అవసరమైతే కూలీలను ఎక్కువ మందిని వినియోగించుకోవాలన్నారు.

**ఉగాదికి ఇంటింటికి తాగునీరు:**
**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

ఉగాది నాటికి పాలేరు నియోజకవర్గంలోని ప్రజలకు ఇంటింటికి మిషన్‌భగీరథ ద్వారా పరిశుభ్రమైన నీటిని అందిస్తున్నట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మొదటి దశ పనులు ముగింపులో ఉన్నాయని, మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను, ఏజెన్సీ బాధ్యులను ఆదేశించారు. స్మితాసబర్వాల్ మాట్లాడుతూ మిషన్‌భగీరథ పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రణాళికబద్ధంగా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో యాదాద్రి జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్, డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్, వైరా ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్, మిషన్‌భగీరథ చీఫ్ ఇంజనీర్ సురేందర్‌రెడ్డి, సీఈ నాగేశ్వర్, ఎస్ఈ కృష్ణయ్య, జడ్పీచైర్‌పర్సన్ గడిపల్లి కవిత, ఆర్డీవో పూర్ణచంద్రం, సీఈవో నగేష్, ఏజీఎం గోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



రహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పోట్ల, పలు పార్టీల నేతలు

# కాంగ్రెస్ గూటికి మాజీ ఎమ్మెల్సీ పోట్ల

**(ఆంధ్రజ్యోతి ప్రతినిధి-ఖమ్మం)**

జిల్లాకు చెందిన సీనియర్ రాజకీయ నేత మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావుతో పాటు పలువురు నాయకులు శనివారం రాజసభ సభ్యురాలు రేణుకాచౌదరి నాయకత్వంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. టీఆర్ఎస్‌కు రాజీనామ చేసిన పోట్లతో పాటు టీడీపీ వైరా ఇన్‌చార్జీగా పనిచేసిన మాలోత్ రందాస్‌నాయక్‌తో పాటు రవిచంద్రా తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. సదరు నాయకులు శుక్రవారం ఢిల్లీకి చేరుకొని ముందుగా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ కుంతియా, రేణుకాచౌదరిని కలుసుకున్నారు. తర్వాత వారి అధ్వర్యంలోనే రాహుల్‌గాంధీని కలిసి శనివారం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పోట్లతో పాటు పలువురు నాయకులు తెలిపారు.

# ముంచిన ఆరాటం..!

**ఖమ్మం కార్పొరేషన్, జనవరి 2:** ఖమ్మం నగరపాలక సంస్థలు, పురపాలకాల ను బహిరంగ మలమూత్ర రహితంగా తయారు చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ గతంలో ఆదేశించారు. ఆ మేరకు ఖమ్మం నగరాన్ని బహిరంగ మలమూత్ర విసర్జనరహితంగా(ఓడీఎఫ్) మార్చాలని నగర పాలక సంస్థ అధికారులు నిర్ణయించారు. అయితే అనుకున్నమేర లక్ష్యం సాధించలేకపోయారు. దీంతో అధికారులపై ఒత్తిడి పెరిగింది. కేవలం 35శాతం మాత్రమే వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్త వడంతో నిర్మాణాలు పూర్తిచేసే బాధ్యతను కొందరు కాంట్రాక్టర్లకు అప్పగించారు. అయితే కొంతమంది కాంట్రాక్టర్లు మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేయకుండానే బిల్లులు కాజేసినట్టు తెలుస్తోంది. లబ్ధిదారుల ఇళ్లల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు అసంపూర్తిగా ఉంటే కాంట్రాక్టర్ల ఖాతాలో మరుగుదొడ్లు పూర్తయినట్టు బిల్లులు జమ అయ్యాయి. నగరంలోని ఒక్క యుపీహెచ్ కాలనీలోనే 40 మరుగుదొడ్లు పూర్తికాకుండానే బిల్లులు స్వాహా చేశారు.

**ఓడీఎఫ్ ఒత్తిడితోనే..**

ఖమ్మం నగరాన్ని ఓడీఎఫ్‌గా ప్రకటిం చాలని కార్పొరేషన్ అధికారులపై ఒత్తిడి వచ్చింది. దీంతో మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయించేందుకు నానా తంటాలు పడ్డారు. డివిజన్లకు కొందరు ఉద్యోగులను ప్రత్యేకంగా కేటాయించి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు కృషిచేశారు. అయినా గడువు లోపు నిర్మాణాలు పూర్తికాకపోవడంతో నిర్మాణ బాధ్యతలను కొందరు కాంట్రాక్టర్లకు అప్పగించారు. నగరంలో 4,420వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం లక్ష్యం కాగా ఇప్పటివరకు 4,254 నిర్మాణాలు పూర్తయినట్టు నగర పాలక సంస్థ అధికారులు రికార్డుల్లో లెక్కలు చూపుతున్నా రు. వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ఓడీఎఫ్ ప్రకటించాలనే ఒత్తిడితో తప్పులు చేశారు. పూర్తిస్థాయిలో మరుగు దొడ్ల నిర్మాణం లేకుండానే ఓడీఎఫ్‌గా ప్రకటించారు.

**నిబంధనలు మార్చడంతో అవినీతికి ఆస్కారం..**

నగరంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు సంబంధించి రెండు విడతల్లో ఇచ్చే సొమ్ములు నేరుగా మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాల్లోకి వెళతాయి. అయితే నిర్మాణాలను కొందరు కాంట్రాక్టర్లకు అప్పగించి బిల్లులను నేరుగా వారి ఖాతాలోకి జమ అయ్యేటట్టు చేసి నిబంధనలను తుంగలో తొక్కారు. ఇదే అదనుగా కొందరు కాంట్రాక్టర్లు నిర్మాణాలు పూర్తి చేయకుండానే చేసినట్టు చూపించారు. ఫలితంగా నిర్మాణాలు అసంపూర్తిగా ఉండగానే కాంట్రాక్టర్ల ఖాతాలో సొమ్ములు జమ అయ్యాయి. కానీ మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తికాక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. నిర్మాణం పూర్తికాలేదని నగరపాలక సంస్థ కార్యాలయానికి వెళితే పూర్తయినట్టు ఆన్‌లైన్‌లో ఉందని సొమ్ములు కూడా చెల్లించామని చెబుతున్నారు.

**మచ్చుకు కొన్ని...**

యుపీహెచ్ కాలనీకి చెందిన దామళ్ల ఇందిరకు వ్యక్తిగత మరుగుదొడ్డి మంజూరైంది. (నెంబర్ 0400444) అయితే నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. కాంట్రాక్టర్ ఒక తలుపును అసంపూర్తి నిర్మాణం ఎదుట ఉంచి, ఇందిరను నిల్చోబెట్టి ఫొటో తీయించాడు. అంతే నిర్మాణం పూర్తయినట్టు ఆన్‌లైన్‌లో నమోదయింది.

కవుటం జానకమ్మ అనే మహిళ ఇంట్లో కేవలం ఒరలు వేసి మరుగుదొడ్డి నిర్మాణం పూర్తయినట్టు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

దాసరి కుమారి (నెంబర్ 0400262) అనే మహిళది అదే పరిస్థితి. మరుగుదొడ్డి నిర్మాణం పూర్తికాకుండానే.. కాంట్రాక్టర్ ఖాతాలో పూర్తిస్థాయి సొమ్ములు చేరాయి.

**ఒరలు వేసి వెళ్లిపోయారు:**
**కవుటం జానమ్మ, లబ్ధిదారు**



వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణం కోసం ఒరలు వేసి వెళ్లిపోయారు. అయితే కార్పొరేషన్‌లో మాత్రం నిర్మాణం పూర్తయినట్టు ఉంది. చాలా ఇబ్బంది పడ ుతు ున్నాం. అధికారులు వెంటనే విచారణ చేయాలి.



# మోటార్ సైకిల్ సూపర్‌మెన్!



**సర్కస్ ఫీట్లను నేల మీద చేసే వారిని చూస్తున్నా.. అమ్మో అనిపిస్తుంది! అవే సర్కస్ ఫీట్లను 20 నుంచి 40 అడుగుల ఎత్తులో ఆకాశంలో బైక్‌తో చేస్తే! ఏమాత్రం అదుపు తప్పినా ప్రాణాలు ఆకాశంలో కలసిపోతాయి.**

బోల్డ్‌డాగ్స్ ఎఫ్‌ఎంఎక్స్.. బ్రిటిష్ ఫ్రీస్టైల్ మోటో క్రాస్ స్టంట్ టీమ్ ఇది. వీరంతా ఎన్నో సంవత్సరాల నుంచి బైక్‌లతో రకరకాల సాహసాలు చేస్తూ ప్రేక్షకులకు వినోదం పంచుతున్నారు.. ఒక దాని తరువాత మరొకటిగా ప్రపంచ రికార్డులను బద్దలు కొడుతున్నారు.

ఇటీవల బ్రిటన్‌లోని సీబీబీసీ ఛానెల్లో అఫీషియల్లీ అమేజింగ్ అనే టీవీ షో ప్రసారమైంది. ఆ షో కోసం నిర్వహించిన ఫ్రీస్టైల్ బైక్ రైడర్ పోటీల్లో బ్రిటన్ నుంచి అనేక జట్లు పాల్గొన్నాయి. బోల్డ్‌డాగ్స్ టీమ్ కూడా పాల్గొని విజేతగా నిలిచింది. బైక్‌లతో ఆ జట్టు గాల్లో ఎగురుతూ చేసిన విన్యాసాలతో ప్రేక్షకుల రోమాలు నిక్కబొడుచుకున్నాయి. బైక్‌తో కలిసి గాల్లో బంతిలా గింగిరాలు కొడుతున్న స్టంట్‌మాన్‌లను చూసి ప్రేక్షకులు విస్తుపోయారు. కొన్ని క్షణాలపాటు బైక్‌హ్యాండిల్‌ను వదలి రెండుచేతులతో సీటును పట్టుకోని గాల్లో వేలాడటం, మళ్లీ హ్యాండిల్‌ను పట్టుకోవటం, 40 అడుగుల ఎత్తులో ఆకాశంలో దూసుకెళుతున్న బైక్‌మీద పాదాలతో నిలబడటం, బైక్‌ను పూర్తిగా వదిలి గాల్లో ఎగిరి మళ్లీ పట్టుకోవటం, బైక్‌తో సహా గాల్లో సున్నా ఆకారంలో గుండ్రంగా తిరగటం, జట్టు మొత్తం వరుసగా ఒకరి తరువాత మరొకరు గాల్లోకి ఎగురుతూ విన్యాసాలు చేయటం లాంటి రకరకాల సాహసాలకు కొదవే లేదు.

అయితే ఈ సాహసాలు చేయటంలో అంతులేని రిస్క్ దాగి ఉంది. అయినా అవేవి పట్టనట్టు బ్రిటన్‌కు చెందిన బోల్డ్‌డాగ్స్ ఎఫ్‌ఎంఎక్స్ టీమ్‌సభ్యులు అలా అలా...గాల్లో తేలిపోయారు. ఏమాత్రం అదుపు తప్పినా ప్రాణాలు గాల్లో దీపాలే. అయితే వీరంతా సుశిక్షితులు. ఈ కళలో బాగా తర్ఫీదు పొందారు. కాబట్టి ఎలాంటి ఇబ్బంది లేకుండా సాహసాలు చేస్తుంటారు. అయినా కొన్నిసార్లు చేతులు, కాళ్లు విరిగాయి. అయినా వారు దీన్ని మానలేదు. సాహసమే జీవితం అంటున్నారు.



## పజిల్ పూరించండి

| | | | |
|---|---|---|---|
| | | 9 | |
| | 7 | 2 | |
| 5 | 7 | 6 | |
| 4 | 6 | ? | 8 |

## జనరల్ నాలెడ్జ్

అద్వైత సిద్ధాంత కర్త ఎవరు?

## పద్యం

విద్యలేనివాడు విద్యాధికుల చెంత
నుండినంత పండితుండు కాడు
కొలని హంసలకడం గొక్కెర యున్నట్లు
విశ్వదాభిరామ వినురవేమ.


**భావం:** కొలనులో హంసల నడుమ కొంగ ఉన్నా, దాని జాతి భేదం గుర్తింపబడినట్లే, విద్యావంతుల మధ్య అవివేకి ఉన్నా వానికి వివేకం కలుగదు.

## పొడుపు కథ



అడవిలో పుట్టింది
అడవిలో పెరిగింది
వంటినిండా గాయాలు
కడుపునిండా రాగాలు

## పదాలు కనుక్కోండి



sun
boat
heart
snail
puppy
carrot

| | | | | | |
|---|---|---|---|---|---|
| l | c | b | s | u | n |
| h | a | o | m | l | y |
| e | r | a | u | i | p |
| a | r | t | i | a | p |
| r | o | l | j | n | u |
| t | t | i | t | s | p |

## జవాబులు

జనరల్ నాలెడ్జ్ : శంకరాచార్యులు
పొడుపు కథ : పిల్లనగ్రోవి
పజిల్ పూరించండి : 0
(టాప్ నుంచి 9 x 8 =72, 72 x 8 = 576, 576 x 8 = 4608)

జంబ్లింగ్ వర్డ్స్
1. STATUS
2. STORIES
3. ACTIVE
4. SHORTLY
5. REPORT

## తేట తెలుగు

దోషము = పొరపాటు
మాసము = నెల
భంగము = ఆటంకం




## నోరు తిరుగుతోందా?



FUZZY WUZZY WAS A BEAR
FUZZY WUZZY HAD NO HAIR
SO, FUZZY WUZZY
WASN'T REALLY FUZZY,
WAS HE?

## బొమ్మ గీయండి



## జంబ్లింగ్ వర్డ్స్

1. TASTSU ..................
2. TSOIERS ..................
3. TIACVE ..................
4. SOHTLRY ..................
5. PORRET ..................

## ఆణిముత్యం

ఇవ్వడం నేర్చుకో, తీసుకోవడం కాదు. సేవ అలవరచుకో, పెత్తనం కాదు.

## దారి కనుక్కోండి



# పదిలోగా జీవో అమలుచేయాలి

- దేవాదాయశాఖ అధికారులకు అల్టిమేటం
- 11న హైదరాబాద్‌లో కార్యాచరణ ప్రకటన
- ఆందోళన చేపడతామని హెచ్చరిక
- అర్చక, ఉద్యోగుల సంఘం (జేఏసీ) రాష్ట్ర అధ్యక్షుడు గంగు భానుమూర్తి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు భానుమూర్తి

**ఖమ్మం సాంస్కృతికం, జనవరి 6:** రాష్ట్రంలోని ఆలయాల్లో పనిచేస్తున్న అర్చక, ఉద్యోగులకు ఈ నెల 10వ తేదీలోగా ట్రెజరీ వేతనాల చెల్లింపులకోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన జీవోను అమలు చేయాలని రాష్ట్ర దేవాలయాల అర్చక, ఉద్యోగుల సంఘం (జేఏసీ) అధ్యక్షుడు గంగు భానుమూర్తి దేవాదాయశాఖ అధికారులను డిమాండ్ చేశారు. 10వ తేదీలోగా అమలు చేయకపోతే 11న హైదరాబాద్‌లో ఆందోళన కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు. శనివారం ఖమ్మంలో జరిగిన అత్యవసర రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి గతేడాది సెప్టెంబరు 15న జీవో 577ద్వారా రాష్ట్రంలోని 654 దేవాలయాల్లో పనిచేస్తున్న 5,625మంది అర్చక సిబ్బందికి 2015 పీఆర్‌సీని అమలు చేస్తూ వేతనాలు ఇవ్వాలని ఆదేశించారన్నారు. దేవాదాయ శాఖలో పనిచేస్తున్న అందరిని రెగ్యులరైజేషన్ స్కేల్ ఫిక్సేషన్ చేస్తూ వేతనాలు ఇవ్వాలని ఆదేశించారన్నారు. 2017నవంబరు వేతనం డిసెంబరు ఒకటిన చెల్లిస్తామని జీవోలో తెలిపారని పేర్కొన్నారు. కానీ డిసెంబరు ఒకటిన 5,625 మందికి బదులు కేవలం 784మందికి మాత్రమే పెంచిన పాక్షిక వేతనం వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. పాత వేతనం పూర్వ పద్ధతిలో దేవస్థానం నుంచి తీసుకోవాలని అధికారులు మౌఖికంగా తెలిపారన్నారు. ఒక వ్యక్తికి రెండు పద్దుల ద్వారా వేతన విధానం అమలును వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ నెల 10లోపు 2015 పీఆర్‌సీతో కూడిన వేతనాన్ని ఒకే పద్దు ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే జీవో 577ను సవరణ చేయాలన్నారు. ధార్మిక పరిషత్ ద్వారానే అందరికీ వేతనాలు ఇవ్వాలన్నారు. జీవోను అమలుపరచడంలో దేవాదాయశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తీవ్రస్థాయిలో ఆరోపించారు. అధికారుల అలసత్వం వల్ల రాష్ట్రంలోని అర్చక ఉద్యోగులందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం జీవోను అమలు చేయాలని వరంగల్ జిల్లా జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా జేఏసీ నేత దాములూరి వీరభద్రశర్మ, తోటకూర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేవాదాయ శాఖాధికారులు ముఖ్యమంత్రి ఇచ్చిన జీవోను అమలు చేయకపోతే ఎవరి జీవోలను అమలు చేస్తారని ప్రశ్నించారు. 'దేవుడు వరమిచ్చినా పూజారి వరం ఇవ్వని' సామెతగా తమ బతుకులు ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. తాము చేపట్టే ఆందోళనకు దేవాదాయశాఖ అధికారులే బాధ్యత వహించాలాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని, ముఖ్యమంత్రి ఇచ్చిన జీవోను అమలు చేయకపోవడం వల్లనే తాము ఆందోళన చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. జేఏసీ నేతలు ఎస్‌బీ. కృష్ణమాచారి, రామశర్మ, రామకృష్ణమాచార్యులు, కరీంనగర్ వినయ్‌కుమార్, నల్గొండ సాంబిరెడ్డి, నిజామాబాద్ వేణు, కృష్ణమాచారి హైదరాబాద్, ప్రతాప్ ఆదిలాబాద్, ఆనంద్ మహబూబ్ నగర్, ఖమ్మం నరహరి నర్సింహాచార్యులు, మేనేజర్లు ఎస్. శ్రీనివాస్, మూర్తి, జమలాపురం వెంకటేశ్వరస్వా మి ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు, పెద్దమ్మ తల్లి ఆల యం, ఇల్లెందు కోటమైసమ్మ ఆలయం అర్చకులు జిల్లాలోని వివిధ ఆలయాల అర్చకులు పాల్గొన్నారు.

# ఖమ్మం



## సైకిల్ షెడ్ నిర్మాణ పనులు ప్రారంభించిన డీఎఫ్‌వో

**కమాన్‌బజార్ జనవరి6:** నగర శివారులోని వెలుగుమట్ల ఫారెస్ట్ పార్కులో శనివారం సైకిల్ షెడ్ నిర్మాణ పనులను డీఎఫ్‌వో డాక్టర్ సునిల్ ఎస్ హిరామత్ ప్రారంభించారు. పార్కును అన్ని విదాల అభివృద్ధి చేసి త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. పర్యాటకులకు అందుబాటులో ఉండేవిదంగా 50సైకిళ్లను కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. వాటిని బద్రపరిచేందుకు షెడ్డును ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## సంక్షిప్తం

### 'దళిత రుణాల పంపిణీలో గందర గోళం వద్దు'

**ఖమ్మం అర్బన్,జనవరి6:** దళిత రుణాల పంపిణీలో నెలకొన్న గందరగోళాన్ని నివారించాలని తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుమ్మరి గోపాల్, మందా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.. సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివార కొర్లపాటి రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాల పంపిణీలో గందర గోళం కారణంగా లబ్దిదారులకు రుణాలు దక్కటం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత దళితుల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం చేసిన మేలు ఏమీ లేదన్నారు. ఇప్పటికైనా బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించి రుణాలు పంపిణీ చేయక పోతే వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పటం ఖాయమన్నారు. కార్యక్రమంలో దాసరి రాము, నకిరి కంటి కృష్ణ, కుమ్మరి గురమూర్తి పాల్గొన్నారు.

### ఘనంగా శత చండీయాగం

**ఖమ్మం సాంస్కృతికం, జనవరి6:** స్థానిక గాయత్రి భవన్‌లో శనివారం ఆరుద్ర స్వాహకార పూర్వక శతచండీ యాగాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణ పండితులు పాల్గొని ప్రత్యేకంగా యాగం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిపారు. భక్తులు పాల్గొని యాగంను తిలకించారు.

### ముస్లింల హక్కుల సాధన కోసం ఉద్యమించాలి

**మయూరిసెంటర్, జనవరి 6:** న్యాయమైన హక్కుల కోసం పోరాటానికి ముస్లింలందరూ ఐక్యంగా ఉద్యమించేందుకు సిద్ధంగా ఉండాలని ముస్లిం హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ సలీం అహ్మద్ అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని హక్కుల వినియోగం కోసం తెలంగాణలో అన్ని జిల్లాల్లో కమిటీలు వేస్తున్నట్లు అందులో భాగంగా ఖమ్మంలో కూడా వేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎంఎ ఖమర్, టౌన్ అధ్యక్షులు నసీర్ ఆజాం, రియాఫత్, పారూఖ్, ఇలియాజ్, జానీ తదితరులు పాల్గొన్నారు.

### సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

**మయూరిసెంటర్ జనవరి6:** దేశవ్యాప్తంగా జరుగుతున్న ఎన్ఎస్‌యుఐ సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఎన్ఎస్‌యూఐ తెలంగాణ ఇన్‌చార్జి నగేష్ కరియప్ప, నాగమధు యాదవ్‌లు కోరారు. శనివారం నగరంలో ప్రెస్‌క్లబ్‌లో జరిగినవిలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత నెల 28ప్రారంభమైన సభ్యత్వ నమోదు ఈనెల28 వరకు జరుగు జరుగుతుందన్నారు. ఈనెల8న పదిలక్షల మందితో ఎన్ఎస్‌యూఐ బ్లడ్‌డోనర్ (రక్తదానశిబిరం) నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈసమావేశంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు

# ఆరని 'చెత్త' మంటలు..

## ఫైరింజన్లతో ఆర్పేందుకు ప్రయాస ● పొగతో ప్రజల అవస్థలు

**ఖమ్మం కార్పొరేషన్, జనవరి6:** నగరపరిధిలోని దానవాయిగూడెం సమీపంలోని డంపింగ్ యార్డులో చెత్త ఇంకా తగలబడుతూనే ఉంది. మంటలు ఆర్పేందుకు ఫైరింజన్లతో పాటు ఖమ్మం నగర పాలక సంస్థకు చెందిన ట్యాంకర్ల ద్వారా నీళ్ల చల్లుతున్నారు. అయినప్పటికీ చెత్త కాలి పొగలు ఇంకా వస్తున్నాయి. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పొగతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

**వారం రోజులుగా చెత్త కాలుతున్నా...**

వారం రోజులుగా చెత్త కాలుతున్నా అధికారులు, పాలకపక్షం పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో పెద్దఎత్తున పేరుకుపోయిన చెత్త అడుగు భాగం నుంచి మంటలు వస్తుండటంతో ఎన్ని నీళ్ల చల్లినా.. మంటలు ఎక్కడో ఒక ప్రాంతంలో వస్తూనే ఉన్నాయి. 35 ఎకరాల విసీర్ణంలో చెత్త కుప్పలు ఉండటంతో ఎక్కడో ఒకచోట మంటలు వస్తూనే ఉన్నాయి. వాటిని ఆర్పేందుకు కార్పొరేషన్ సిబ్బంది తిప్పలు పడుతున్నారు. అయినా అదుపులోకి రాకపోవడంతో పొగ ఇంకా వస్తూనే ఉంది.

**సందర్శించిన మేయర్, కార్పొరేటర్లు**

ఖమ్మం నగరాన్ని పొగ మేఘాలు కమ్మేసినా పట్టించుకోని పాలకపక్ష కార్పొరేటర్లు, అధికారులు ఆలశ్యంగా శనివారం డంపింగ్ యార్డుకు వచ్చారు. పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతూ ఇళ్లల్లో ఉండలేక ప్రజలు శుక్రవారం రహదారులపై, కార్పొరేషన్ కార్యాలయం వద్ద బైఠాయించినా ఎవరూ పట్టించుకోలేదు. కేవలం 36వ డివిజన్ కార్పొరేటర్ నాగండ్ల దీపక్‌చౌదరి మాత్రమే స్పందించి బాధితులకు మద్దతుగా ధర్నా నిర్వహించారు. కాగా శనివారం నగర మేయర్ డాక్టర్ జి.పాపాలాల్, 1వ డివిజన్ కార్పొరేటర్ దరావత్ రామ్మూర్తి, 49వ డివిజన్ కార్పొరేటర్ జంగం భాస్కర్, 34వ డివిజన్ కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత తదితరులు డంపింగ్‌యార్డును సందర్శించి జరుగుతున్న పనులను పరిశీలించారు.



పొగలు వెదజల్లుతున్న డంపింగ్ యార్డు



మంటలు ఆర్పేందుకు ప్రయత్నాలు

## ఎంపీ, ఎమ్మెల్యేలతో స్థానికుల వాగ్వాదం

డంపింగ్‌యార్డు తగులబడి పొగతో ప్రజలు బాధపడడంతో శనివారం రాత్రి ఖమ్మంఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పువ్వాడ అజయ్ కుమార్, కమిషనర్ సందీప్‌కుమార్‌ఝాతో కలిసి రాపర్తినగర్ బీసీ కాలనీ, టీఎన్‌జీవోకాలనీ సందర్శించారు. కాగా ఎంపీ, ఎమ్మెల్యేలతో ఆ ప్రాంత ప్రజలు వాగ్వాదానికి దిగారు. డంపింగ్‌యార్డు నుంచివచ్చే పొగతో వారం రోజులుగా ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని వివరించారు. అనంతరం డంపింగ్‌యార్డువద్దకు వెళ్లి పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దోరేపల్లిశ్వేత పాల్గొన్నారు.

**కమిషనర్ ఎవరి మాట వినడు:** కమిషనర్ వ్యవహారశైలిపై పలువురు ఎంపీ పొంగులేటిశ్రీనివాసరెడ్డికి తెలపగా కమిషనర్ ఎవరి మాట వినడని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే, ఎంపీ, చివరకు మంత్రి చెప్పినా వినడని తాను అనుకున్నదే చేస్తాడని, ఎంపీ వ్యాఖ్యానించడం గమనార్హం.



ఎంపీ, ఎమ్మెల్యేలతో స్థానికుల వాగ్వాదం

## 'స్కీం వర్కర్ల సమ్మె కనువిప్పు కావాలి'

**ఖమ్మం అర్బన్, జనవరి6:** దేశ వ్యాప్తంగా ఈనెల 17న జరిగే స్కీం వర్కర్ల సమ్మె కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు అన్నారు.. వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన స్కీం వర్కర్ల జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం స్కీం వర్కర్లు దేశ వ్యాప్తంగా సమ్మె శంఖారావం పూరించనున్నారని తెలిపారు. అంగన్ వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, ఎన్‌హెచ్‌ఎం, సర్వశిక్ష అభియాన్, వంటి స్కీంలలో పనిచేస్తున్న వర్కర్లందరినీ ఉద్యోగులుగా గుర్తించటం తోపాటు రూ. 18 వేల కనీస వేతనం కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నేత కొత్తాసీతారాములు, టీఎన్‌టీయూసీ నాయకులు మందా వెంకటనారాయణ, ఏఐటీయూసీనేత శింగు నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళ్యాణం వెంకటేశ్వరరావు

## జీవో 58 రద్దుకు మంత్రి హరీష్‌రావుకు వినతి

**ఖమ్మంవ్యవసాయం జనవరి6:** రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి హరీష్‌రావును ఖమ్మం చాంబర్ నాయకులు దిగుమతి శాఖ అధ్యక్షుడు వీరెల్లి యుగంధర్, అడ్తి వ్యాపారవర్గం రాష్ట్ర నేతలు హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిశారు. జీవో 58వల్ల వ్యాపారవర్గానికి నష్టం చేకూరే అవకాశం ఉందని, వెంటనే జీవో58 రద్దుచేయాలని కోరారు. వ్యాపారవర్గం నిత్యం ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై సైతం మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు స్పందించి ఈ నెల 13న వరంగల్, అడ్తి వ్యాపారుల రాష్ట్ర సంఘం అంతా కలిసివస్తే చర్చలు నిర్వహించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం చాంబర్ దిగుమతి శాఖ అధ్యక్షుడు వీరెల్లి యుగంధర్‌తోపాటు రాష్ట్ర అడ్తి వ్యాపారుల సంఘం అధ్యక్షుడు కటకం పెంటయ్య, గంప శ్రీనివాసరావు, 10 జిల్లాల అడ్తి వ్యాపారుల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి హరీష్‌రావుకు వినతిత్రం ఇస్తున్న దృశ్యం

## '14వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడిగా గోపాల్'

**మామిళ్లగూడెం, జనవరి6:** తెలుగుదేశం పార్టీ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా శనివారం 2, 3, 14వ డివిజన్ కమిటీల ఎన్నికలను నిర్వహించారు. 14వ డివిజన్ అధ్యక్షుడిగా తిప్పట్ల గోపాల్, ప్రదాన కార్యదర్శిగా మెహరాజ్ ఎన్నికయ్యారు. 2వ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా కొత్తారాము, మన్నె సతీష్ నియామకం కాగా 3వ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులుగా మద్దినేని రవికుమార్, అంకోజు రామాచారి నియమితులయ్యారు. వీరికి పార్టీ కన్వీనర్ కూరపాటి వెంకటేశ్వర్లు నియామకపు పత్రాలను అందచేసి అభినందించారు.కార్యక్రమంలో ఏలూరి శ్రీనివాసరావు, గొడ్డేటి మాధవరావు నాగార్జునపు శ్రీను, జాన్‌బి పిట్టల అంజయ్య, కన్నెబోయిన మల్లయ్య, బాబూరావు, సీతారాములు, దాసరి నాగరాజు, తిప్పట్ల ఉమామహేష్, వెంకటేశ్, పిట్టల కృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నియామకపు పత్రాన్ని అందచేస్తున్న దృశ్యం

## టీఆర్ఎస్ నియోజకవర్గ క్యాలెండర్ ఆవిష్కరణ



టీఆర్ఎస్ పార్టీ ఖమ్మం నియోజకవర్గ క్యాలెండర్‌ను శనివారం ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అజయ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 2018 అందరికీ కలిసి రావాలన్నారు.

## కలెక్టరేట్ ముట్టడి జయప్రదం చేయండి

**ఖమ్మం అర్బన్,జనవరి6:** ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీమాస్ ఆధ్వర్యంలో ఈనెల 22న నిర్వహించ తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి జయప్రదం చేయాలని టీమాస్ రాష్ట్ర కమిటీ నేత నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. నగరంలో ప్రజా సమస్యల పరిష్కారం డిమాండ్ చేస్తూ చేపట్టిన ఇంటింటిసర్వేలో భాగంగా శుక్రవారం రాత్రి రమణ గుట్టప్రాంతంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు.



## సంక్షిప్తం

### అమిత్ షాను జిల్లాకు ఆహ్వానించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు



అమిత్ షా కార్యదర్శితోఉదయ్ ప్రతాప్

**ఖమ్మం అర్బన్ జనవరి6:** ఖమ్మం జిల్లాలో బీజేపీ మరింత బలోపేతం కోసం జిల్లాలో పర్యటించాల్సిందిగా బీజేపీ జాతీయ నేత అమిత్ షాను బీజేపీ జిల్లా అధ్యక్షుడు సన్నె ఉదయ్ ప్రతాప్ ఆహ్వానించారు. శనివారం ఢిల్లీలోని బీజేపీ సెంట్రల్ కార్యాలయానికి వెళ్లిన ఉదయ్ ప్రతాప్ అమిత్ షా కార్యదర్శి అరవింద్ మీనన్‌ను కలిసి జిల్లాలో బీజేపీ పరిస్థితిని వివరించారు. బూత్ స్థాయి నుండి, అసెంబ్లీ , పార్లమెంట్ స్థాయిల వరకు పటిష్ట చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌ల రిపోర్టులు, నియోజక వర్గాల కమిటీల రిపోర్ట్‌లను అందజేశారు. తెలంగాణ పర్యటన సమయంలో జిల్లాలో పర్యటించాలని కోరారు.

### యువతులకు అండగా షీ టీం

**ఖమ్మం అర్బన్,జనవరి6:** యువతులకు అండగా షీటీం పనిచేస్తుంద ని షీటీం ఇన్‌ఛార్జ్ సీఐ అంజలి అన్నారు.. శనివారం నయాబజార్ కళాశాలలో నిర్వ హించిన షీటీం అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. షీటీం ఉపయోగాలను వివరించారు.. పోకిరీల చేష్టలు, ఆకతాయిల వేధింపుల బారినుండి కాపాడేందుకు షీటీం అన్ని వేళలా సిద్ధంగా ఉంటుందన్నారు. హ్యాక్ ఐ అనే ఆప్‌ను సెల్ ఫోన్‌లో ఉపయోగించటం ద్వారా అత్యవసర సమయాల్లో పోలీసుల సహాయం పొందవచ్చన్నారు.

### అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు మంజూరు చేయాలి-బీజేపి

**రఘునాథపాలెం జనవరి6:** అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మం జూరు చుఏయాలని బీజేపీ ఆధ్వర్యంలో శనివారం మండల తాహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అసందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు విద్యాసాగర్ మాట్లా డారు. అనంతరం డీటి సురేష్‌బాబుకు వినతి పత్రం అందించారు. ఈ . కార్యక్రమంలో బీజేపి జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యోగుల క్రీడలను విజయవంతం చేయాలి

### టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు పొట్టపింజర రామయ్య

**ఖమ్మం కలెక్టరేట్, జనవరి6:** ఈనెల 21,22తేదీల్లో నిర్వహించే ఉద్యోగుల క్రీడలను విజయవంతం చేయాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు పొట్టపింజర రామయ్య కోరారు. శనివారం టీఎన్జీవో ఫంక్షన్‌హాల్లో గుంటుపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన ఖమ్మం నగరకమిటీ కార్యవర్గ సభ్యుల సమావేశాని నిర్వహించారు. ఈ సమావేశంలో రామయ్య మాట్లాడుతూ.. నగరంలో ఉద్యోగులు అధికంగా ఉన్నారని నగర కమిటీ ఉద్యోగుల వివరాలు సేకరించాలని కోరారు. వారి సమస్యల పట్ల ఎప్పుడూ అందుబాటులో ఉండి పరిష్కరించాలని సూచించారు. టీఎన్జీవో ఖమ్మం నగర కమిటీ టేబుల్ క్యాలెండర్ తయారీకి పూర్తి సమాచారం జిల్లా కమిటీకి అందచేయాలని కోరారు. ఇల్లెందుకు చెందిన టైపిస్ట్ పద్మను పాశవికంగా హతమార్చిన ఆమె భర్తను కఠినంగా శిక్షించి పద్మ ఆత్మకు శాంతిచేకూర్చాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో కేంద్రకమిటీ సభ్యులు బి వెంకటేశ్వరరావు, గుంటుపల్లి శ్రీనివాస్, కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి దస్రూ, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి గంగవరపు బాలకృష్ణ, జైపాల్, కె శ్రీనివాస్, ఆయూష్ ప్రకాష్, రమణయాదవ్, చందూ, శ్రీకాంత్, రాజు, రామకృష్ణ, అఖిల్, రాంకుమార్, ప్రచార కార్యదర్శి ఎడ్లపల్లి రమేష్‌కుమార్,జరీనాబేగం, ఉషారాణి, సువర్చల తదితరులు పాల్గొన్నారు.త




సమావేశంలో మాట్లాడుతున్న రామయ్య

### ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి: బీజేపీ



వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

**ఖమ్మం అర్బన్ జనవరి6:**ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ యువజన మోర్చా ఆధ్వర్యంలో శనివారం అర్బన్ తహసిల్దార్ శ్రీలతకు మెమోరాండం సమర్పించారు.. ఈ సందర్భంగా బీజేపీ నగర అధ్యక్షుడు రుద్రప్రదీప్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1,12లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గెంటేల విద్యాసాగర్ , మందడపు ప్రభాకర్, గుత్తా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయి బాస్కెట్‌బాల్‌క్యాంపునకు
## జిల్లా క్రీడాకారుల ఎంపిక

**ఖమ్మంస్పోర్ట్స్, జనవరి 6:** జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వ్యంలో ఈనెల 2 నుంచి4 వరకు స్థానిక పెవిలియన్‌గ్రౌండ్‌లో జరిగిన 4వరాష్ట్ర స్థాయి సీనియర్ బాస్కెట్‌బాల్‌టోర్నీలో ప్రతిభ చూపిన జిల్లా క్రీడాకారులు ఎం.మోనిక, వడ్డె ఈశ్వర్, కె.శ్రీనివాసరావులు జాతీయస్థాయి కోచింగ్ క్యాంప్‌కు ఎంపికయ్యారని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరి ఏంవీ రమణ తెలిపారు. వీరు సికింద్రాబాద్ రైల్వే గ్రౌండ్‌లో ప్రారంభమయ్యే కోచింగ్ క్యాంప్‌కు బయలుదేరారని ఆయన తెలిపారు. వీరికి ఈనెల 17నుంచి 24వరకు చెన్నైలో జరిగే జాతీయస్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు.



మోనిక   వడ్డె ఈశ్వర్, శ్రీనివాసరావు

### 'సంక్షేమ పథకాల రద్దుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర'

**ఖమ్మంమయూరి సెంటర్ జనవరి 6:** కేంద్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమ పథకాలన్నింటిని రద్దుచేయడానికి కుట్రపన్నుతోందని అందులో భాగంగానే మధ్యాహ్నభోజన పథకం , ఆరోగ్యరంగాలకు నిధులు కేటాయింపులు క్రమంగా తగ్గిస్తూ పూర్తిగా రద్దుచేసే ప్రయత్నం చేస్తున్నదని, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు చెరుకూరి సీతామ హాలక్ష్మి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సింగు నర్సింహారావులు ఆరోపించారు. శనివారం ఖమ్మంనగరంలోని గిరిప్రసాద్‌భవన్‌లో జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తలు సమావేశంలో వారు మాట్లాడారు.

## కార్పొరేషన్ తీరు మారకుంటే ఆందోళన తప్పదు

### సీపీఐ కార్పొరేషన్ ఏరియా కార్యదర్శి ఎస్‌కే.జానిమియా

**ఖమ్మం అర్బన్, జనవరి 6:** మునిసిపల్ కార్పొరేషన్ తీరు మారకుంటే ఆందోళన తప్పదని సీపీఐ కార్పొరేషన్ ఏరియా కార్యదర్శి ఎస్‌కే.జానిమియా హెచ్చరించారు.. శనివారం ముస్తఫా నగర్‌లో జరిగిన ఏరియా కమిటీ సమవేశంలో ఆయన మాట్లాడుతూ.. కమిషనర్‌కు పాలక వర్గానికి పొంతన లేక పోవటంతో నగరంలో పాలన పడకేసిందన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయలు కల్పించటంలో, పౌరసేవా పత్రాలు అందజేయటంలో కార్పొరేషన్ విఫలం అయ్యిందన్నారు. పారిశధ్యం కుంటుపడటంతో నగరంలో ప్రజారోగ్యం సమస్యాత్మకంగా మారుతోం దన్నారు. ఇప్పటికైనా పాలకవర్గం వైఖరి మార్చుకోక పోతే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు.

కార్యక్రమంలో నాయకులు బీజీ క్లైమెట్, వెంపటినాగేశ్వరరావు, పొన్నం పుల్లయ్య తదితరుల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జానిమియా

## రెజోనెన్స్ ఎస్‌వీఎంలో రంగవల్లుల పోటీ

**ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి6:** స్థానిక రెజోనెన్స్, ఎస్‌వీఎం పాఠశాలలో శనివారం ముగ్గుల పోటీలు జరిపారు. సాంప్రందాయ దుస్తుల్లో విద్యార్థులు హాజరై అందంగా రంగవల్లులు తీర్చిదిద్దారు. గొబ్బెమ్మలు పెట్టి నవధాన్యాలు, రేగుపండ్లతో పూలతో అలంకరించారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ ఆర్‌వీ. నాగేంద్రకుమార్, కే. శ్రీధర్‌రావు, నీలిమ పాల్గొన్నారు. గాలిపటాలను ఎగురవేసి విద్యార్థులు ఆనందంగా గడిపారు. అనంతరం పాఠశాలలో వేదిక్ మ్యాక్స్ పాఠాలు జరిపారు. నేషనల్ రికార్డు గ్రహీత డా. సాయికిరణ్ పాల్గొని గణిత సమస్యల్ని చాలా సాధించాలన్నారు. డైరెక్టర్స్ ఆర్‌వీ. నాగేంద్రకుమార్, కే. శ్రీధర్‌రావు, నీలిమ పాల్గొన్నారు.



ముగ్గులు వేస్తున్న దృశ్యం

## నగరంలో సినిమాలు

| | | |
|---|---|---|
| 8 | ఆదిత్య | ఒక్క క్షణం |
| 8 | తిరుమల | జుమాన్జీ |
| 8 | వినోద | ఎంసీఏ |
| 8 | శ్రీనివాస | హలో |
| 8 | నర్తకి | ఖాకీ |
| 8 | సుందర్ | ఇన్సిడియస్ |
| 8 | కిన్నెరసాని | 2 కంట్రీస్ |

# ఖమ్మం

### ప్రభుత్వ పాఠశాలల మూసివేత మానుకోవాలి



**కామేపల్లి,జనవరి6:** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేరనే సాకుతో మూసివేయాలనే ఆలోచనను పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఆజాద్ అన్నారు. మండల పరిధిలోని జాస్తిపల్లి హైస్కూల్‌లో విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు.

## సంక్షిప్తం

### రాంకోటి కుటుంబానికి మానుకొండ పరామర్శ



పరామర్శిస్తున్న మానుకొండ

**రఘునాథపాలెం జనవరి6:** మండలంలోని పుటానితండాకు చెందిన గుగులోత్ రాంకోటి(50) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. దీంతో ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ రాంకోటి మృతదేహానికి దేహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. దహనసంస్కారల నిమిత్తం రూ.5వేలు అందించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు మలీదు వెంకటేశ్వర్లు, మండలపార్టీ అధ్యక్షుడు కోటేరు వెంకటరెడ్డి, ఇస్మాయిల్, బానోత్ కోటేష్, నాగరాజు, మంగిలాల్, బాలాజీ, వీరు, చిన్న రాందాస్, అనిల్, భీమ్లా, సోమ్లా, రాంలాల్ తదితరులు ఉన్నారు.

### కాంగ్రెస్ ఓబీసీ సెల్ కమిటీ నియామకం

**ఖమ్మం అర్బన్, జనవరి6:** కాంగ్రెస్ ఓబీసీ సెల్ కమిటీని శనివారం నియమించారు. డీసీసీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ కమిటీ నగర ఉపాధ్యక్షుడిగా సంపటం నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా సోమగాని యల్లారావులను నియమిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు అయిత సత్యం, కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా నేత వడ్డే బోయిన నరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తాజుద్దీన్, ఇసాక్, కొత్త సీతారాములు పాల్గొన్నారు.



నియామక పత్రాలందిస్తున్న దృశ్యం

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ఎజెండా

## ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అజయ్‌కుమార్



కళ్యాణ లక్ష్మి చెక్కుల అందిస్తున్న ఎంపి



ఎమ్మెల్యే వెజ్ బిర్యానిని వడ్డిస్తున్న ఎమ్మెల్యే అజయ్‌కుమార్

**రఘునాథపాలెం, జనవరి6:** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ఎజెండా అని రాజకీయాలకు తావు లేకుండా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని మల్లేపల్లి, రాంక్యాతండ, ఈర్లపుడి, పంగిడి గ్రామపంచాయతీల్లో ఏర్పాటుచేసిన పార్టీ దిమ్మెలను వారు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలో 54మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు రాగా ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారుల ఇంటికివెళ్లి చెక్కులు అందించే కార్యక్రమం చేపట్టారు. శనివారం ఎమ్మెల్యేతో పాటు ఎంపీ పొంగులేటి చెక్కులు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల హామీలతో సంబంధం లేకుండా ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తూ ప్రజాపాలన కొనసాగిస్తున్నామన్నారు. రానున్న కాలంలో గిట్టుబాటు ధరలకే పంటకొనుగోలుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రైతును రాజును చేయటమే ప్రభుత్వలక్ష్యమన్నారు. మన తెలంగాణ, మన పరిపాలన మన ఇంటిముందుకే వచ్చే విదంగా రాష్ట్రంలో ఉన్న ఎమ్మెల్యే లందరూ అనుసరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాళోత్ శాంత, జడ్పీటీసీ వీరునాయక్, ఏఎంసి వైస్ చైర్మన్ మండదపు నర్సింహారావు, ఆత్మ చైర్మన్ మెంటెం రామారావు, మండదపు సుధాకర్, తాహశీల్దార్ తిరుమలాచారి, ఎంపీడీవో ఏలూరి శ్రీనివాసరావు, ఆర్ఐ నర్సింహారావు, వీఆర్వో భీమల నాగేంద్రబాబు, సర్పంచ్‌లు ధారవత్ మాన్సి, జాటోత్ దేవ్లి, చల్లా స్వరూప, మనూరి, వీవీపాలెం సొసైటి చైర్మన్ రావెళ్ల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ధారావత్ రాంమూర్తి, జాగృతి నియోజకవర్గ కన్వినర్ బానోత్ ప్రమీల, బచ్చు విజయ్‌కుమార్, మాదంశెట్టి హరిప్రసాద్, గుత్తారవి, పిన్ని కోటేశ్వరరావు, దొంతు సత్యనారాయణ, పవన్, బానోత్ శివలాల్, సూర్యం, హరి తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ విద్య భలోపేతం- ఎమ్మెల్యే అజయ్

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి ప్రభుత్వ విద్యను భలోపేతం చేసేందుకు ఎన్నో కార్యక్రమాలను చేపట్టినట్లు ఎమ్మెల్యే అజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని రాంక్యాతండాలోని ప్రాథమిక పాఠశాలలో ప్రతి శనివారం విద్యార్థులకు అందించనున్న వెజ్ బిర్యానిని విద్యార్థులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కేజీటు పీజీ విద్యను అందించేందుకు ఎన్నో గురుకులాలను తెచ్చామన్నారు.

సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టటంతో హాజరు శాతం పెరిగిందన్నారు. నాణ్యతతో కూడిన విద్యను అందిస్తున్న నేపధ్యంలో ప్రైవేటు పాఠశాలల్లో చదువులు మాన్పించి ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు విద్యార్థులను చేర్పిస్తున్నారన్నారు. ఎంతో మంది ఉన్నతాధికారులు సైతం ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తున్నారంటే ప్రభుత్వ విద్య ఎంత బలోపేతం అయిందో అర్థమవుతోందన్నారు.

# తూతూ మంత్రంగా గ్రామసభల నిర్వహణ

**రఘునాథపాలెం జనవరి6:** మండలంలో గ్రామసభలు తూతూ మంత్రంగా సాగుతున్నాయి. అధికారులు హాజరు కాకపోవటంతో ఎవరితో ఏం చర్చించాలి అనుకున్నారో ఏమో ప్రజలు కూడా హాజరు కాలేదు. మొత్తంగా మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో గ్రామసభలను రెండు రోజుల్లోనే ముగించారు. శనివారం జరిగిన గ్రామసభలకు ఎవరూ హాజరుకాకపోవటంతో కుర్చీలు వెలవెబోయాయి. ప్రతీ మూడు నెలలకు ఒకసారి గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, జరిగిన అభివృద్ధిపై చర్చించటానికి అధికారులు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వహిస్తుంటారు. అందులో భాగంగానే శుక్ర, శనివారాల్లో గ్రాసభలు నిర్వహించటానికి అధికారులు నిర్ణయించారు. ఈ రెండు రోజుల్లో కూడా అధికారులు హాజరు కాకపోవటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రాకుండ సమస్యలు ఎవరితో విన్నవించుకోవాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒక కార్యదర్శి, సర్పంచ్ మాత్రమే గ్రామ సభలు నిర్వహించారు. వాస్తవానికి గ్రామసభల్లో అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, మండల ప్రత్యేక అధికారి పాల్గొనాల్సి ఉంది. కాని ఎవరూ ఆచాయల్లో కనిపించక లేదు. ఇంత మాత్రం దానికి ప్రజాధనం వృధాచేయటం ఎందుకని ప్రజలు వాపోతున్నారు.



ప్రజలు లేకపోవటంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

## కూరగాయలు

| రకం | కిలో ధర(రూపాయల్లో) |
|---|---|
| 8 టమోట | 10 |
| 8 వంకాయ | 20 |
| 8 బెండకాయ | 38 |
| 8 పచ్చిమిర్చి | 24 |
| 8 కాకరకాయ | 30 |
| 8 బీరకాయ | 40 |
| 8 క్యాబేజీ | 16 |
| 8 క్యారెట్ | 54 |
| 8 దొండకాయ | 28 |
| 8 ఆలుగడ్డ | 16 |
| 8 గోరుచిక్కుడు | 34 |
| 8 దోసకాయ | 24 |
| 8 సొరకాయ | 10 |
| 8 పొట్లకాయ | 24 |
| 8 చిక్కుడు | 40 |
| 8 చామగడ్డ | 44 |
| 8 కంద | 60 |
| 8 బీట్‌రూట్ | 34 |
| 8 బీన్స్ | 40 |
| 8 ముల్లంగి | 40 |
| 8 క్యాప్సికం | 60 |
| 8 ములక్కాయ(1) | 10 |
| 8 బచ్చలకూర | 3 |
| 8 పాలకూర | 3 |
| 8 తోటకూర | 2.5 |
| 8 గోంగూర | 2 |
| 8 కొత్తిమీర | 10 |
| 8 ఉల్లిగడ్డలు | 45 |

ఖమ్మం స్పోర్ట్స్

# రూ.3కోట్లతో వాటర్‌ట్యాంకుల నిర్మాణం

**కామేపల్లి జనవరి6:** మండలంలోని 17గ్రామపంచాయతీల పరిధిలో మిషన్‌భగీరథ కార్యక్రమం ద్వారా రూ.3కోట్లతో 30 వాటర్ ట్యాంకు నిర్మాణాలు చేపడుతున్నట్లు మండల జడ్పీటీసీ సభ్యుడు మల్లిబాబుయాదవ్, ఎంపీపీ మలోతు సరిరాంనాయక్ అన్నారు. మండల పరిధిలోని రాయిగూడెం, రుక్కితండా, బండిపాడు గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న వాటర్‌ట్యాంకు పనులను శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కారించే దిశగా పనిచేస్తుందన్నారు. ప్రతీ ఇంటికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో మిషన్‌భగీరథ పథకం ప్రవేశపెట్టటం జరిగిందన్నారు. గ్రామాల్లో ప్రజలు ప్రభుత్వ పనితీరు పట్ల సంతృప్తిగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ బానోతు కస్తూరీబాయి,వైస్ ఎంపీపీ రాయల బాస్కర్‌రావు,ఎంపీటీసీ ధనియాకుల హన్మంతరావు,నాయకులు బానోతు నరసింహనాయక్, బండి ఉపేందర్,శీలం పుల్లయ్య,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాట్లాడుతున్న మల్లిబాబుయాదవ్

# 'అవయవదానంతో ఎందరికో వెలుగు'

**ఖమ్మంటౌన్ జనవరి 6:** అవయవదానంతో ఆరిపోయే ప్రాణానికి వెలుగు ఇవ్వవచ్చని తెలంగాణ నేత్ర అవయవదాతల సంఘంరాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికపల్ల అశోక్ అన్నారు. తెలంగాణ నేత్ర అవయవ శరీరదాతల సంఘం ఆధ్వర్యంలో ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థసహకారంతో ఖమ్మం వరంగల్ క్రాస్‌రోడ్‌లో శ్రీవాసాచారి అధ్యక్షతన జరిగిన అవయవదానం అవగాహన సదస్సులో డాక్టర్ అశోక్ మాట్లాడారు. నేత్రదానంతో ఇద్దరు అందులకు చూపు ఇవ్వవచ్చన్నారు. అలాగే అవయవదానంతో 18 ప్రాణాలు నిలబెట్టవచ్చని, దేహదానంతో భావి వైద్యుల పరిశోధనలకు ఉపయోగపడవచ్చని తెలిపారు. అనంతరం గుడిమళ్లమోహన్ ఆకుతోట కృష్ణమూర్తి, బండారు అయిలయ్య, గోదాసి కుమారస్వామి, గుడిమల్లశ్రీనివాస్, వెంగళ రాజేందర్, బండారి వీర్లలింగం, కొండిరమేష్ తమ మరణానంతరం నేత్ర, అవయవదానాలు, తమశరీరాన్ని కాకతీయ మెడికల్ కాలేజికి అప్పగించాలని అంగీకరపత్రాలు డాక్టర్ అశోక్‌కు అదించారు.



అవయవదాన పత్రాలు చూపుతున్న దృశ్యం

## కేజీబీవీ విద్యాలయంలో తాత్కాలిక ఉద్యోగి తొలగింపు

**కూసుమంచి, జనవరి 6:** మండలంలోని గంగబండతండలో గల కస్తూర్బా విద్యాలయంలో తాత్కాలిక ఉద్యోగిని తొలగిస్తు డీఈవో వాసంతి ఉత్తర్వ్యాలు జారీ చేశారు. విద్యాలయంలో అటెండర్‌గా రాంబాయి అనే మహిళను నియామకం చేశారు. గతంలో జరిగిన నియామకంలో అవకతవకలు జరిగాయని గ్రామస్థులు కలెక్టరుకు ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు. డిప్యుటీ డిఈవో విచారణ నిర్వహించగా, విచారణలో అవకతవకలు చోటుచేసుకున్నట్లు తేలడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అటెండర్‌ను విధులనుంచి తొలగిస్తు డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. అటెండరును తొలగించినట్లు కేజీబీవీ స్పెషలాఫీసర్ అజితకుమారి తెలిపారు.

# టీఆర్‌ఎస్ X సీపీఎం

- జక్కేపల్లి ఎంపీటీసీ ఉప ఎన్నికలో పోటాపోటీ ప్రచారం
- టీడీపీ, కాంగ్రెస్ అభ్యర్థుల ఉపసంహరణపై నాయకుల గరంగరం

**కూసుమంచి, జనవరి 6:** మండలంలోని జక్కేపల్లి ఎంపీటీసీ ఉప ఎన్నికలో ద్విముఖ పోటీ జరుగనుంది. 11న పోలింగ్ జరుగనుంది. టీడీపీ, కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకొని అధికార పార్టీ టీఆర్‌ఎస్‌కు మద్దతు ప్రకటించారు. దీంతో రెండు పార్టీల మధ్యే ప్రధాన పోటీ జరగనుంది. టీఆర్‌ఎస్ అభ్యర్థి బాణోతు వీరభద్రమ్మ, సీపీఎం అభ్యర్థి బాణోతు భారతి మధ్య పోటీ ఏర్పడింది. శనివారం అధికారులు పోటీలో ఉన్న అభ్యర్థులను వారికి కేటాయించిన గుర్తులను ప్రకటించారు. దీంతో గ్రామాలలో ఎన్నికల హడావుడి ప్రారంభం అయింది. అధికారపార్టీ అభివృద్ధి మంత్రంతో ముందుకు సాగుతుండగా, వామపక్షాలు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేవిధంగా ప్రచారం చేసి తమ సత్తాను నిరూపించుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. నామినేషన్ల ఉపసంహరణలో కాంగ్రెస్, టీడీపీ అభ్యర్థులు ఆయా పార్టీలకు తెలియకుండా వైదొలగడంతో నాయకులు మండిపడుతున్నారు. దీంతో సీపీఎం అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించాయి. కాగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై గతంలోనే జక్కేపల్లి గ్రామంలో ఆయాపార్టీలనుంచి పెద్ద సంఖ్యలో టీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో ప్రస్తుతం ఆపార్టీ బలంగా ఉంది. జక్కేపల్లి, మల్లేపల్లి గ్రామపంచాయితీల పరిధిలో ఎంపీటీసీ ప్రాదేశిక నియోజకవర్గం ఉండగా మొత్తం 2280 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1093, మహిళా ఓటర్లు 1187 మంది ఉన్నారు. ఏకగ్రీవం అవుతుందని భావించిగా... ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావించడంతో ఎన్నిక అనివార్యమైంది. తమ గెలుపు సునాయాసమే నని టీఆర్‌ఎస్ భావిస్తుండగా, అన్ని పార్టీల మద్దతుతో టీఆర్‌ఎస్‌కు బుద్ధిచెపుతామని సీపీఎం అంటోంది.





నామినేషన్ల సందర్భంగా టీఆర్‌ఎస్, సీపీఎం ర్యాలీ (ఫైల్)

## పాఠశాల్లో మానెటరింగ్ బృందం పరిశీలన

**కూసుమంచి, జనవరి 6:** అభ్యాసనాభివృద్ధి కార్యక్రమం పరిశీలనలో భాగంగా రాష్ట్ర పరిశీలనా బృందం మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో జిల్లా పరిశత్ ఉన్నత పాఠశాలను, ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించారు. పరిశీలన బృందం సభ్యులు రాంబాబు, వెంకట్రాంరెడ్డి, పాఠశాలల్లో అభ్యాసనాభివృద్ధి కార్యక్రమాన్ని, నిరంతర సమగ్ర మూల్యాంకన తీరును పరిశీలించారు. విద్యార్థుల స్కూలు బ్యాగు బరువును పరిశీలించి విద్యార్థులు గురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో వెలుగుచూసిన అంశాలను రాష్ట్ర విద్యాశిక్షణ పరిశోధనా సంస్థకు తమ నివేదిక ద్వారా సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రామాచారి, ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రమీల, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డుకు శంకుస్థాపన

**పైనంపల్లి(నేలకొండపల్లి),జనవరి 6:** పైనంపల్లి ఉన్నత పాఠశాల ఎదురుగా సందులో రూ.10 లక్షల గ్రామీణ ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు సర్పంచ్ పుష్పమ్మ శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు నల్లాని మల్లికార్జునరావు, ఎంపీటీసీ సభ్యురాలు యడవల్లి శ్రీదేవి, డాక్టర్.నాగుబండి శ్రీనివాసరావు, కుక్కల సామేలు, నల్లాని వెంకటేశ్వర్లు,రెడ్డిమళ్ళ వెంకట్రామిరెడ్డి, వీరవాసు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

### బతుకుతెలంగాణ కావాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా

**ఖమ్మంరూరల్ జనవరి 6:** బంగారు తెలంగాణ కాదు బతుకు తెలంగాణ కావాలని టీమాస్ రాష్ట్రస్టీరింగ్ కమిటీసభ్యుడు నున్నా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పల్లెగూడెం, రెడ్డిపల్లి, సత్యనారాయణపురం, తదితరగ్రామాలలో టీమాస్ బృందం శనివారం పర్యటించింది. ఈసందర్భగా ఆయన మాట్లాడుతు కేసీఆర్ ఎన్నికలలో ఇచ్చినహామీలు అమలు చేయకుండా మాయమాటలతో కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికలలో కేసీఆర్‌కు తగిన బుద్ధిచెప్పేందుకు బీసీలు, ఎంబీసీలు, ఎస్సీ,ఎస్టీ, మైనారిటీలు నిరుద్యోగులు సిద్ధంగా ఉండాలన్నారు. టీమాస్ రాజకీయాలకు అతీతంగా సమాజంలోని మేధావులను, కవులను, కళాకారులను నాయకలను, కార్యకర్తలను సామాజిక సంఘాలను కలుపుకుని ముందుకెలుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు మూడు ఎకరాలభూమి, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలన్నారు. లేకపోతే టీమాస్ ఆధ్వర్యంలో దశజలవారీగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ప్రసాద్, నాయకులు బందెల వెంకయ్య, పి.సంగయ్య, నందిగామ కృష్ణ, వెంకటరెడ్డి, ప్రసాద్, పాల్గొన్నారు.

### రాహుల్‌ని కలిసిన ఎస్టీ సెల్ నాయకుడు బాలునాయక్



**తిరుమలాయపాలెం, జనవరి 6:** ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ నాయకుడు బానోతు బాలునాయక్ కలిశారు. ఈసందర్భంగా మండలంలోని వివిధగ్రామాలలోని ప్రధాన సమస్యలను రాహుల్‌దృష్టికి తెచ్చారు. పాలేరు నియోజకవర్గంలో గిరిజనులు అధికంగా ఉన్నారని పార్టీపదవుల్లో గిరిజనులకు ప్రాధాన్యం ఇవ్వాలని తద్వారా పార్టీకి పూర్వ వైభవం వస్తుందని తెలిపారు. పార్టీసంస్థాగత ఎన్నికలలో గిరిజనులకు పెద్దపీట వేయాలని రాహుల్ దృష్టికి తెచ్చారు.

### 'ఆటోస్టార్టర్లను తొలిగించాలి'

**ఖమ్మంరూరల్ జనవరి 6:** ప్రతి రైతుల ఆటోస్టార్టర్లను తొలిగించాలని టీఆర్ఎస్ జిల్లా నాయకులు సాధథురమేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని చింతపల్లిలో శనివారం ఆటోస్టార్లర్ల తొలిగింపుపై రైతులకు అవగాహన కలిపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు కేసీఆర్ రైతులకు 24గంటలు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. రైతులంతా ఆటోస్టార్టర్లను తొలిగించి విద్యుత్‌ను ఆదాచేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అద్యక్షుడుబెల్లం వేణుగోపాల్, రైతు సమన్వయి సమితి ఛైర్మన్ తోట వీరభద్రం, సర్పంచ్ తోట జగన్, ఆత్మడైరెక్టర చంద్రశేఖర్, ఏవో నాగేశ్వరరావు, ఏఈవోలు ఆదర్శ, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## నూతక్కి ఆశయ సాధనకు కృషి చేద్దాం



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి

**నేలకొండపల్లి, జనవరి6:** సీపీఎం మండల నాయకుడు అమరజీవి నూతక్కి గంగాధరరావు ఆశయ సాధనకు కృషి చేయాలని, మండల కార్యదర్శి గుడవర్తి నాగేశ్వరరావు అన్నారు. శనివారం నేలకొండపల్లిలోని పాత పెట్రోలు బంకువద్ద నూతక్కి గంగధరరావు 26వ వర్ధంతి సభ జరిగింది. సీఐటీయు నాయకుడు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రైతు-కూలీ ఉద్యమాల నిర్మాణంలో గంగాధరరావు కీలకంగా వ్యవహరించారన్నారు. గంగాధర్‌రావు ఆశయాలు సాధించటమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అన్నారు. మరో నాయకుడు కొలికపంగు షైసయ్య 26వ వర్ధంతిని సైతం సీపీఎం కార్యకర్తలు నిర్వహించారు. తొలుత గంగాధర్‌రావు స్మారకస్థూపం వద్ద పార్టీ చెండాను రచ్చా నర్సింహారావు ఎగురవేశారు. కార్యక్రమంలో సిరికొండ ఉమామహేశ్వరి, కొల్లి రాధాకృష్ణమూర్తి, భూక్యా కృష్ణ, ఏటుకూరి రామారావు, కె.వి.చారి, రావెళ్ళ సుదర్శన్‌రావు, గంధం వెంకటేశ్వర్లు, మందడపు మురళి, గంగాధర్‌రావు కుమారుడు నూతక్కి భార్గవ, అల్లుడు గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో స్వయం పాలనా దినోత్సవం

**కూసుమంచి, జనవరి 6:** మండలంలోని కూసుమంచి, నాయకన్‌గూడెం గ్రామాలలోని ప్రగతి, శ్రీచైతన్యపాఠశాలల్లో విద్యార్థులు స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగాను, ప్రజాప్రతినిధులుగా అనుకరిస్తు ఆలరించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులతో పాటు, దేశ, రాష్ట్ర పరిపాలకులుగా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, సీఎం, డిప్యుటీ సీఎం, గవర్నర్లుగాను, ఉన్నతాధికారులుగాను అనుకరించి సహ విద్యార్థులను ఆకట్టుకున్నారు. ఈసందర్భంగా ప్రగతి విద్యాలయ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి మాట్లాడుతు విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

- లయన్స్‌క్లబ్ డైమండ్ జోన్ ఛైర్మన్ యలమద్ది

**నేలకొండపల్లి,జనవరి 6:** క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని, ఐకమత్యాన్ని పెంచుతాయని లయన్స్ క్లబ్ డైమండ్ జోన్ ఛైర్మన్ యలమద్ది వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం నేలకొండపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు లయన్స్ క్లబ్ డైమండ్ తరపున రూ.12వేల విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దారుఢ్యాన్ని కలిగిస్తాయన్నారు. విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందచేయాలని లయన్స్ క్లబ్ డైమండ్ నిర్ణయించిందని, అందులో భాగంగానే ఇప్పటి వరకు 13 పాఠశాలలకు అందచేసినట్లు వై వి తెలిపారు. ఎంఈవో పురుషోత్తమరావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఝాన్సీ, లక్ష్మి, క్లబ్ అధ్యక్షుడు లక్ష్మణమూర్తి, పీడీలు అన్నపూర్ణ, అరుణశ్రీ, శ్రీరామమూర్తి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ సమస్యలపై బీజేవైఎం ధర్నా

**ఖమ్మంరూరల్, జనవరి 6:** రాష్ట్రంలో నిరుద్యోగులను ప్రభుత్వం విస్మరిస్తుందని నిరుద్యోగ సమస్యను వెంటనే పరిష్కరించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నకిరికంటి వీరభద్రం డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం రూరల్ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు టీఆర్ఎస్ అధికారంలోకివచ్చాక నిరుద్యోగులను నిలువునా ముంచిందన్నారు. ఉద్యమం సమయంలో వందలమంది యువకులు బలిదానం చేసుకున్న సందర్భంలో కేసీఆర్ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలుకలిపిస్తానని హామిఇచ్చారన్నారు. నేడు కేవలం సీఎం కుర్చీ కోసం మాత్రమే కేసీఆర్ పాకులాడుతున్నారు తప్పా సమస్యలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. రానున్నరోజుల్లో రాష్ట్రంలో బీజేపీదే అధకారం అని తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాని్న తహసీల్దార్‌కు అందించారు.ఈ కార్యక్రమంలో నాయకులు బట్టు నాగరాజు, ఎం.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, లింగరాజు, మాధవరావు, ప్రసాద్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు